thechurakalu@gmail.com
www.churakalu.com
editor@churakalu.com

RNI. NO. TEL TEL/2006/16536
Postal Regd. No. H/KAR/90/06-08

# చురకలు

## సాయంకాల దినపత్రిక

Published from Karimnagar, Hyderabad, Adilabad, Warangal

సంపుటి - 20 సంచిక - 8 కరీంనగర్ బుధవారం, 19 మార్చి, 2025 ఎడిటర్ - మొహ్మద్ ఇమ్రాన్ పేజీలు - 12 + 8 జిల్లా అనుబంధం వెల - 1.00

### ఔరంగజేబు సమాధిపై వివాదం.. నాగ్‌పూర్‌లో కర్ఫ్యూ

మొఘల్ చక్రవర్తి ఔరంగజేబు సమాధి తొలగింపు డిమాండ్స్ హింసాత్మక ఘటనలకు దారి తీయడంతో నాగ్‌పూర్‌లోని పలు ప్రాంతాల్లో పోలీసులు కర్ఫ్యూ విధించారు.

భారతీయ నాగరిక సురక్షా సంహితలోని సెక్షన్ 163 ప్రకారం, నగర పోలీసు కమిషనర్ రవీందర్ కుమార్ సింఘాల్ పలు ప్రాంతాల్లో కర్ఫ్యూ విధిస్తూ ఆదేశాలు జారీ చేశారు. నగరంలోని కొత్వాలీ, గణేశ్‌పేట్, తెహ్‌సీల్, లకడ్‌గంజ్, పాంచ్‌పావులీ, శాంతినగర్, షక్కర్2డరా, నందన్‌వన్, ఇమామ్‌వాడా, యోధరానగర్, కపిల్‌నగర్ పోలీస్ స్టేషన్ల పరిధిలోని ప్రాంతాల్లో కర్ఫ్యూ విధించారు. తదుపరి ఆదేశాలు వెలువడే వరకూ కర్ఫ్యూ అమల్లో ఉంటుందని అన్నారు.

## అద్దిరిపాటుగా... 25 ఏళ్ళ బీఆర్ఎస్ సిల్వర్ జూబ్లీ..

# సంబురాలు!

## పటిష్ట ప్రణాళికతో ముందుకు సాగుతున్నా నాయకత్వం

హైదరాబాద్: భారత రాష్ట్ర సమితి 25 సంవత్సరాల సిల్వర్ జూబ్లీ సంబురాలను ఘనంగా నిర్వహించేందుకు పటిష్ట ప్రణాళికతో ముందుకు సాగుతోంది. ఇందులో భాగంగా పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో పర్యటించనున్నారు. ఈ సందర్భంగా జిల్లా కేంద్రాల్లో పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలతో సన్నాహక సమావేశాలు నిర్వహిస్తారు. ఇప్పటికే పార్టీ అధినేత కేసీఆర్ నేతృత్వంలో తెలంగాణ భవన్‌లో పార్టీ సీనియర్ నేతలు ప్రజాప్రతినిధులతో విస్తృతస్థాయి సమావేశం జరిగిన విషయం తెలిసిందే. అందులో భాగంగా వరంగల్‌లో లక్షలాదిమంది పాల్గొననున్న భారీ బహిరంగ సభను విజయవంతంగా నిర్వహించనునట్లు పార్టీ ప్రకటించింది. పార్టీ సిల్వర్ జూబ్లీ కార్యక్రమాల్లో భాగంగా అనేక కార్యక్రమాలు, సంబరాలను నిర్వహిస్తూ పార్టీని మరింత బలోపేతం చేసే దిశగా కార్యాచరణ రూపొందించబడింది. దీంతోపాటు రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ ప్రజలకు ఇచ్చిన హామీలను వేటిని అమలు చేయకుండా వంచిస్తున్న తీరుపై కూడా చేపట్టాల్సిన కార్యాచరణపై పార్టీ శ్రేణులకు, జిల్లా నేతలకు, కార్యకర్తలకు కేటీఆర్ స్వయంగా మార్గదర్శనం చేయనున్నారు. ఈ నేపథ్యంలో, మార్చి 20న సూర్యాపేట జిల్లా కార్యకర్తలతో, 23న కరీంనగర్ జిల్లా నాయకులతో ప్రత్యేక సమావేశాలు నిర్వహించనున్నారు. అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల అనంతరం కేటీఆర్ రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లో పర్యటించనున్నారు. 14 ఏండ్ల ఉద్యమ ప్రస్థానంతోపాటు, పదేండ్ల ప్రగతి ప్రస్థానంలో తెలంగాణ సమాజంతో బీఆర్ఎస్ పార్టీ పెనవేసుకున్న ఆత్మీయ అనుబంధాన్ని ఈ సమావేశాల సందర్భంగా మరోసారి గుర్తుచేసుకోనున్నారు. పార్టీకి ఎన్నిరకాల ఒడిదుడుకులు ఎదురైనా గులాబీ జెండాను గుండెల్లో పెట్టుకుని నిలబడ్డ పార్టీ శ్రేణులకు రానున్న రోజుల్లో మళ్లీ ఉజ్వల భవిష్యత్తు ఉండబోతున్న విషయాన్ని కేటీఆర్ తెలియజేయనున్నారు. ఏడాదిన్నరలోనే తీవ్రమైన ప్రజావ్యతిరేకతను మూటగట్టుకున్న కాంగ్రెస్ సర్కారుపై ప్రజలు దుమ్మెత్తి పోస్తున్నారని, తెలంగాణ ప్రజల భరోసా ఇప్పుడు బీఆర్ఎస్ పైన, కేసీఆర్ పైనే ఉన్న నేపథ్యంలో రానున్న రోజుల్లో మరింత క్రియాశీలకంగా పనిచేయాలని దిశానిర్దేశం చేయబోతున్నారు. కేటీఆర్ పర్యటనల వలన పార్టీ శ్రేణుల్లో నూతన ఉత్తేజం నిండనున్నది.



## రేపటి నుంచి రాష్ట్రవ్యాప్తంగా పర్యటించనున్న కేటీఆర్!




## ఎస్సీ వర్గీకరణ బిల్లుకు తెలంగాణ అసెంబ్లీ ఆమోదం

స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి దళితలకు కాంగ్రెస్ అండగా ఉంటోందన్నారు సీఎం రేవంత్ రెడ్డి. ఎస్సీ బిల్లుపై అసెంబ్లీలో చర్చ సందర్భంగా మాట్లాడిన రేవంత్..రాజకీయాలను పక్కన పెట్టి సంపూర్ణ మద్దతు పలికారని తెలిపారు. వర్గీకరణకు మద్దతిచ్చిన పార్టీలకు ధన్యవాదాలు తెలిపారు రేవంత్. వర్గీకరణ కోసం అనేక పోరాటాలు జరిగాయన్నారు. వర్గీకరణ కోసం ఎంతో మంది ప్రాణాలు కోల్పోయారని చెప్పారు . ఉమ్మడి ఏపీకి దళితుడిని సీఎం చేసిన చరిత్ర కాంగ్రెస్ దేనన్నారు రేవంత్. దళిత బిడ్డ మీరా కుమారిని స్పీకర్ చేసిన చరిత్ర .. దళితుల అభ్యున్నతనికి అనేక నిర్ణయాలు తీసుకుంది కాంగ్రెస్సేనన్నారు రేవంత్ సుప్రీంకోర్టులో తెలంగాణ ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా వాదనలు వినిపించిందన్నారు రేవంత్. సుప్రీం తీర్పు వచ్చిన గంటసేపటికే ఎస్సీ వర్గీకరణపై సభలో ప్రకటన చేశాం. నూటికి నూరు శాతం ఎస్సీ వర్గీకరణను అమలు చేస్తామని ఆనాడు చెప్పా. ఎస్సీ వర్గీకరణపై ఉత్తమ్ ఆధ్వర్యంలో మంత్రి వర్గ ఉప సంఘం వేశాం..ఆరుసార్లు ఈ కమిటీ భేటీ అయింది. 8 వేలకు పైగా వినతిపత్రాలను ఈ కమిషన్ తీసుకుంది. ఉపసంఘం సూచన మేరకు వన్ మ్యాన్ కమిషన్ వేసింది. ఏ ఒక్కరిక కూడా అన్యాయం జరగొద్దని కమిషన్ భావించింది. ఫిబ్రవరి 3న కమిషన్ రిపోర్ట్ ఇచ్చింది. ఫిబ్రవరి 4న ఈ రిపోర్ట్ ను కేబినెట్ ఆమోదించింది అని రేవంత్ అన్నారు. రేవంత్ స్పీచ్ అనంతరం ఎస్సీ వర్గీకరణ బిల్లుకు తెలంగాణ అసెంబ్లీ ఆమోదం తెలిపింది. ఎస్సీ వర్గీకరణ బిల్లును ఆమోదిస్తున్నట్లు స్పీకర్ గడ్డం ప్రసాద్ తెలిపారు. బిల్లు ఆమోదం తెలపడంతో సీఎంకు ధన్యవాదాలు తెలిపారు మంత్రి దామోదర రాజనర్సింహా.

## నేడు తెలంగాణ కేబినెట్ భేటీ

## రాష్ట్ర బడ్జెట్‌కు ఆమోదం

### అనంతరం బడ్జెట్‌ను ప్రవేశపెట్టనున్న భట్టి

హైదరాబాద్ : తెలంగాణ కేబినెట్ బుధవారం సమావేశం కానున్నది. ఉదయం 9:30 గంటలకు భేటీ అయి రాష్ట్ర బడ్జెట్‌కు ఆమోదం తెలపనుంది. ఆ తర్వాత ఉదయం 11:45 నిమిషాలకు డిప్యూటీ సీఎం, ఆర్థిక శాఖ మంత్రి భట్టి విక్రమార్క రాష్ట్ర బడ్జెట్‌ను శాసనసభలో ప్రవేశపెట్టనున్నారు. ఇది రేవంత్ సర్కార్ ప్రవేశపెడుతున్న



రెండో బడ్జెట్ కావడంతో ఎలాంటి నిర్ణయాలు ఉండబోతున్నాయని రాష్ట్ర ప్రజలు ఎదురు చూస్తున్నారు.

గత ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారెంటీల అమలుపై ప్రభుత్వం దృష్టి సారించింది. ఈ నేపథ్యంలో ఏ పథకానికి ఏ మేరకు కేటాయింపులు ఇవ్వబోతున్నది అనేది ఆసక్తిగా మారింది. అలాగే ప్రభుత్వ ఉద్యోగులు, రాష్ట్రంలోని ప్రాజెక్టుల విషయంలో కీలక ప్రకటనలు ఉండే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.




హైదరాబాద్ : తెలంగాణ ప్రభుత్వ తదుపరి ప్రధాన కార్యదర్శిగా కె.రామకృష్ణారావును నియమించాలని ప్రభుత్వం నిర్ణయించినట్టు తెలుస్తోంది. 1989 బ్యాచ్‌కు చెందిన ప్రస్తుత సీఎస్ శాంతికుమారి 2021 జనవరి నుంచి సీఎస్‌గా వ్యవహరిస్తున్నారు. కేసీఆర్ హయాం నుంచి రేవంత్ రెడ్డి వరకు ఈమెనే ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా వ్యవహరించారు. అటు బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలతో ఎక్కడా గొడవలు లేకుండా ప్రభుత్వాన్ని సజావుగా నడిపించడంలో శాంతి కుమారి కీలక పాత్ర పోషించారు. తాజాగా ఈమె పదవీ కాలం వచ్చే నెలతో ముగియనుంది.

ఈ నేపథ్యంలోనే తదుపరి సీఎస్‌గా రామకృష్ణారావు పేరును ప్రభుత్వం దాదాపు ఖరారు చేసినట్లు సమాచారం.సీనియారిటీ ప్రకారం ఆయన్నే నియమించే అవకాశం ఉంది. 1991 బ్యాచ్‌కు చెందిన ఆయన ప్రస్తుతం ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా ఉన్నారు. 2016 ఫిబ్రవరి నుంచి ఆర్థిక శాఖలో కీలక బాధ్యతలు నిర్వహిస్తున్నారు. రామకృష్ణారావు పదవీ కాలం ఈ ఏడాది ఆగస్టుతో ముగియనుంది. త్వరలో పదవీ కాలం ముగయనున్న ఈయన్ని ప్రధాన కార్యదర్శిగా నియమించి మరో రెండేళ్లు ఆయన పదవీ కాలం పొడిగిస్తారా లేదా అనేది చూడాలి.



# 'సూపర్ కాంబో'

## వైఎస్సార్ రోశయ్య జోడీలా రేవంత్ భట్టి సూపర్ !

హైదరాబాద్ : తెలంగాణాలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎంతో హాయిగా ఉన్నారు అంటే దానికి కారణం ఆయన డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క అని అంతా అంటున్నారు. నిజానికి సీఎం క్యాండిడేట్ ఫిగర్ గా ఉన్న భట్టి విక్రమార్క హైకమాండ్ మాట మేరకు ఉప ముఖ్యమంత్రిగా ఉండేందుకు అంగీకరించారు.

ఆయనది ఎంతో సుదీర్ఘమైన అనుభవం కలిగిన రాజకీయం పైగా కీలకమైన సామాజిక వర్గానికి చెందిన నాయకుడు. ఆయన ఎంతో సహనంతో ఉంటారు. బాధ్యతల పట్ల ఎంతో నిబద్ధతతో ఉంటారు. కాంగ్రెస్ కి విధేయత ఆయనకు ఒక వరంగా ఉంది. అలాగే ఆయన రేవంత్ రెడ్డికి ఏకంగా కుడి భుజంగా మారిపోయారు. రేవంత్ రెడ్డికి అన్ని విధాలుగా అండగా ఉంటూ ముఖ్యమంత్రి భారాన్ని తాను భరిస్తూ ఒక విధంగా బెస్ట్ జోడీ అయ్యారు.

రేవంత్ రెడ్డి అందుకే భట్టిని విపరీతంగా నమ్ముతూ ఆయనకు ఎనలేని ప్రాధాన్యత ఇస్తున్నారు ఆయన ఎపుడు ఢిల్లీ వెళ్ళినా వెంట భట్టి విక్రమార్క ఉండాల్సిందే. ఇద్దరూ హైకమాండ్ వద్ద ఒకే బాటగా ఒకే మాటగా ఉండడం చూసిన ఢిల్లీ పెద్దలు కూడా తెలంగాణాలో సూపర్ అని అనుకుంటున్నారు. ఎందుకంటే ఉప ముఖ్యమంత్రిలో ముఖ్యమంత్రి ఉంది. ఆ పదవిలోకి వచ్చిన వారు తరువాత టార్గెట్ సీఎం కే అంటారు. దాని కోసం కుర్చీ ఎక్కిన మొదటి రోజు నుంచి చేయాల్సిన రాజకీయం చేస్తారు. దాంతో సీఎం ది ఒక వర్గం డిప్యూటీ సీఎం ది మరో వర్గం అన్నట్లుగా ఉంటుంది. పార్టె లో ప్రభుత్వంలో ఇదే తీరు కనిపిస్తుంది.

ముఖ్యంగా కాంగ్రెస్ పాలిత రాష్ట్రాలలో ఇది సహజంగా ఉంటోంది. పక్కనే ఉన్న కర్ణాటకలో చూస్తే ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ ల మధ్య గ్యాప్ చాలానే ఉంది. రెండు శిబిరాలు అయ్యాయన్న వార్తలు ప్రచారంలో ఉన్నాయి. కానీ తెలంగాణాలో అలా కాదు ఒక ఆత్మలా రేవంత్ రెడ్డి భట్టి విక్రమార్క ఉంటున్నారు. తనకు పదవులు కంటే పార్టీ అప్పగించిన బాధ్యతలు ముఖ్యమనుకునే భట్టి ఉండడం రేవంత్ రెడ్డి అదృష్టం అని అంటున్నారు. అలాగే రేవంత్ రెడ్డి కూడా సీనియర్ నేతగా భట్టికి ఎనలేని విలువ ఇస్తున్నరు. ఆయన మాటనే చెల్లుబాటు అయ్యేలా చూస్తున్నారు. కీలకమైన మీటింగులు ఏమైనా ఆయననే అధ్యక్షత వహించమంటున్నారు.. అదే విధంగా పార్టీ ప్రభుత్వంతో కో ఆర్డినేషన్ కూడా భట్టి చూసుకుంటున్నారు. ప్రతిపక్షాలను పిలిచి అఖిల పక్షం మీటింగ్ ని కూడా భట్టి కండక్ట్ చేస్తున్నారు. మరో వైపు చూస్తే తెలంగాణా ఖజానాను బీఆర్ఎస్ పదేళ్ళ కాలంలో దివాళా తీయించింది అని రేవంత్ రెడ్డి తరచూ ఆరోపిస్తున్నారు. నిధులు లేవని అంటున్నారు. కానీ ముఖ్యమంత్రి ఇచ్చే హామీలకు కానీ పథకాలకు కానీ ఏదో విధంగా నిధులను సమకూరుస్తూ భట్టి విక్రమార్క ఎంతో కృషి చేస్తున్నారు. దాంతో రేవంత్ కి చాలా ఈజీ అవుతోంది అని అంటున్నారు.

ఈ ఇద్దరి కాంబోని చూసిన వారు నాటి వైఎస్సార్ రోశయ్యల జోడీని గుర్తు చేసుకుంటున్నారు. రోశయ్య వైఎస్సార్ కి పెద్దన్నగా ఉండేవారు. అలాగే రేవంత్ కి భట్టి అన్నగా ఉంటూ అండగా నిలుస్తున్నారు అని కాంగ్రెస్ లోనే అంతా అంటున్న మాటగా ఉంది.



## ఎస్సీ వర్గీకరణ బిల్లుకు తెలంగాణ అసెంబ్లీ ఆమోదం

హైదరాబాద్ : ఎస్సీ వర్గీకరణ బిల్లుకు తెలంగాణ అసెంబ్లీ ఆమోదం తెలిపింది. బిల్లుపై చర్చ అనంతరం ఎస్సీ వర్గీకరణ బిల్లును ఆమోదిస్తున్నట్లు స్పీకర్ గడ్డం ప్రసాద్ తెలిపారు. బిల్లు ఆమోదం తెలపడంతో సీఎంకు ధన్యవాదాలు తెలిపారు మంత్రి దామోదర రాజనర్సింహా. ఎస్సీ ఎమ్మెల్యేలు క్నూడా రేవంత్ కు అభినందనలు తెలిపారు. అసెంబ్లీలో బిల్లుపై చర్చ సందర్భంగా మాట్లాడిన సీఎం రేవంత్.. సమస్యకు శాశ్వత పరిష్కారం కోసమే ఎస్సీ బిల్లు తెచ్చామన్నారు రేవంత్. రాజకీయాలను పక్కన పెట్టి అన్ని పార్టీ సంపూర్ణ మద్దతు పలికాయని తెలిపారు. వర్గీకరణకు మద్దతిచ్చిన పార్టీలకు ధన్యవాదాలు తెలిపారు రేవంత్. వర్గీకరణ కోసం అనేక పోరాటాలు జరిగాయి. వర్గీకరణ కోసం ఎంతో మంది ప్రాణాలు కోల్పోయారు. ఉమ్మడి ఏపీకి దళితుడిని సీఎం చేసిన చరిత్ర కాంగ్రెస్ దే. దళిత బిడ్డ మీరాకుమారిని స్పీకర్ చేసిన చరిత్ర కాంగ్రెస్ దే. స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి దళితులకు కాంగ్రెస్ అండగా ఉంటుంది. దళితుల అభ్యున్నతనికి అనేక నిర్ణయాలు తీసుకుందే కాంగ్రెస్. సుప్రీంకోర్టులో తెలంగాణ ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా వాదనలు వినిపించింది. సుప్రీం తీర్పు వచ్చిన గంటసేపటికే ఎస్సీ వర్గీకరణపై సభలో ప్రకటన చేశాం. నూటికి నూరు శాతం ఎస్సీ వర్గీకరణను అమలు చేస్తామని ఆనాడు చెప్పా. ఎస్సీ వర్గీకరణపై ఉత్తమ్ ఆధ్వర్యంలో మంత్రి వర్గ ఉప సంఘం వేశాం..ఆరుసార్లు ఈ కమిటీ భేటీ అయింది. 8 వేలకు పైగా వినతిపత్రాలను ఈ కమిషన్ తీసుకుంది. ఉపసంఘం సూచన మేరకు వన్ మ్యాన్ కమిషన్ వేసింది. ఏ ఒక్కరిక కూడా అన్యాయం జరగొద్దని కమిషన్ భావించింది. ఫిబ్రవరి 3న కమిషన్ రిపోర్ట్ ఇచ్చింది. ఫిబ్రవరి 4న ఈ రిపోర్ట్ ను కేబినెట్ ఆమోదించింది అని రేవంత్ అన్నారు. 59 ఎస్సీ కులాలను మూడు గ్రూపులుగా విభజించాం . గ్రూప్ 1 లో 15 ఉపకులాలు ఒక శాతం రిజర్వేషన్ . గ్రూప్ 2 కింద 18 ఉపకులాలు..8 శాతం రిజర్వేషన్. గ్రూప్ 3 కింద 26 ఉపకులాలు చేర్చాం.. ఆరుశాతం రిజర్వేషన్ .15 శాతం రిజర్వేషన్లను ఈ మూడు గ్రూపులకు పంచాం. ఉద్యమంలో చనిపోయిన కుటుంబాలను ఆదుకుంటాం. ఇందిరమ్మ ఇండ్లలో వీళ్లకు ఫస్ట్ ప్రియారిటీ ఇస్తాం. రాజీవ్ యువ వికాసంలో అమరుల కుటుంబాలకు ప్రాధాన్యం ఇస్తాం. ఇకనైనా ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం దొరుకుతుంది. చెన్నూరు ఎమ్మెల్యే వివేక్ కోరినట్టు దామాషా ప్రకారం కోటా పెంచుతాం. 2026 జనాభా లెక్కల ప్రకారం ఎస్సీ రిజర్వేషన్లు పెంచుతాం.రిజర్వేషన్లు పెంచడం,న్యాయపరంగా పంచడం మా బాధ్యత అని రేవంత్ అన్నారు.



## హైకోర్టునే తప్పుదోవ పట్టించినందుకు కోటి రూపాయల ఫైన్ విధించిన జడ్జి

హైదరాబాద్: తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ నగేష్ సంచలన తీర్పు వెల్లడించారు. హైకోర్టును తప్పుదోవ పట్టించిన పిటిషనర్‌కు కోటి రూపాయల జరిమానా విధించారు. ప్రభుత్వ భూముల కబ్జా యత్నాలను హైకోర్టు అడ్డుకుంది. దీంతో.. హైకోర్టులో పెండింగ్ విషయం దాచి పిటిషనర్లు మరో బెంచ్ వద్దకు వెళ్లారు. హైకోర్టును తప్పుదోవ పట్టించేలా పిటిషన్లు వేయడంపై జస్టిస్ నగేష్ ఆగ్రహం వ్యక్తం చేశారు. పిటిషన్ పెండింగ్‌లో ఉండగా మరో బెంచ్‌లో ఆర్డర్ తీసుకోవడంతో పిటిషనర్లపై సీరియస్ యాక్షన్ తీసుకున్నారు. కోర్టును తప్పుదోవ పట్టిస్తే జరిమానా విధించిన సందర్భాలు గతంలో కూడా ఉన్నాయి. కానీ.. కోటి రూపాయల జరిమానా విధించడం ప్రస్తుతం చర్చనీయాంశంగా మారింది. వాస్తవాలను దాచి కోర్టును తప్పుదోవ పట్టించారనే కేసులో 2024 ఏప్రిల్?లో ఆదిబట్ల మాజీ చైర్‌పర్సన్ కె.ఆర్తికకు హైకోర్టు రూ.లక్ష జరిమానా విధిస్తూ ఉత్తర్వులు జారీ చేసిన సంగతి తెలిసిందే. కోర్టు సమయాన్ని వృథా చేశారని, అధికారులపై నిరాధార ఆరోపణలు చేశారని ఆ సమయంలో హైకోర్టు తప్పుపట్టింది. ఆధారం లేకుండా, పనికిమాలిన పిటిషన్ వేశారని ఆగ్రహాన్ని వ్యక్తం చేసింది. బీసీ మహిళనంటూ కోర్టు సానుభూతి పొందలేరని చెప్పింది. ఆమె దాఖలు చేసిన పిటిషన్‌ను కొట్టివేసిన కోర్టు, రూ.లక్ష జరిమానా సొమ్మును నాలుగు వారాల్లోగా లీగల్ సర్వీసెస్ అథారిటీకి జమ చేయాలని ఆదేశించడం అప్పట్లో చర్చనీయాంశమైంది.

## ఆర్ఆర్ఆర్ పూర్తయితే హైదరాబాద్ రూపురేఖలు మారిపోతాయి: కోమటిరెడ్డి



హైదరాబాద్: హైదరాబాద్ మహానగరం చుట్టూ నిర్మించే ఆర్ఆర్ఆర్ గురించి కేంద్ర మంత్రి గడ్కరీతో తో చర్చలు జరిపినట్లు మంత్రి కోమటిరెడ్డి తెలిపారు. ఆర్ఆర్ఆర్ దక్షిణభాగం అలైన్‌మెంట్ పూర్తి చేసి పంపుతామని చెప్పినట్లు వెల్లడించారు. శాసన మండలిలో మంత్రి మాట్లాడుతూ.. ఈ ప్రాజెక్టు పూర్తయితే హైదరాబాద్ రూపురేఖలు మారిపోతాయన్నారు. భారాస మాదిరిగా తమకు రోడ్లు అమ్ముకునే అలవాటు లేదని విమర్శించారు. "ఆర్ఆర్ఆర్ గురించి కేంద్ర మంత్రి గడ్కరీని ఏడుసార్లు కలిశాను. రెండు నెలల్లో పనుల ప్రారంభానికి కేంద్ర మంత్రి హామీ ఇచ్చారు. మూడున్నర నుంచి నాలుగేళ్లలో దీనిని పూర్తి చేస్తాం" అని కోమటిరెడ్డి స్పష్టం చేశారు.



## ఎండల నుంచి రిలీఫ్.. మార్చి 21 నుంచి వర్షాలు

తెలంగాణలో ఎండలు అపుడే దంచికొడుతున్నాయి. ఉదయం తొమ్మిది నుంచే బయటకు వెళ్లాలంటే జనం జంకుతున్నారు. ఇక మధ్యాహ్నం అయితే ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. కాసేపు ఉంటే చాలు మాడు పగుల్తదేమోనని అనిపిస్తోంది. అయితే హాట్ హాట్ సమ్మర్ లో చల్లటి కబురు చెప్పింది వాతావరణ శాఖ. వచ్చే మూడు రోజులు కాస్త ఉష్ణోగ్రతలు తగ్గనున్నాయని తెలిపింది. బంగాళాఖాతంలో కొనసాగుతున్న ద్రోణి కారణంగా తెలంగాణలో వర్షాలు పడతాయని వెల్లడించింది వాతావరణ శాఖ. మార్చి 21 నుంచి తెలంగాణలో వర్షాలు పడతాయని.. 22 న ఉరుములు మెరుపులు ఈదురుగాలితో కూడిన వర్షాలకు ఛాన్స్ ఉందని తెలిపింది. మార్చి 22న జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, జయశంకర్ భూపాలపల్లి, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ, జనగాం మరియు సిద్దిపేట జిల్లాలలో అక్కడక్కడ ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉంది. అయితే ఎలాంటి హెచ్చరికలు జారీ చేయలేదు. దక్షిణ ఆగ్నేయ దిశల నుంచి వీస్తున్న క్రింది స్థాయి గాలులు, ద్రోణి కారణంగా వచ్చే మూడు రోజులపాటు కాస్త ఉష్ణోగ్రతలు తగ్గనున్నాయి. తెలంగాణ వ్యాప్తంగా వచ్చే మూడు రోజులు గరిష్ట ఉష్ణోగ్రతలు 36 డిగ్రీల నుంచి 40 డిగ్రీల మధ్య నమోదు కానున్నాయని తెలిపింది వాతావరణ శాఖ

## యాదగిరిగుట్ట ఆలయానికి ధర్మకర్తల మండలి

హైదరాబాద్: యాదగిరిగుట్ట ఆలయానికి ధర్మకర్తల మండలిని ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించినట్టు మంత్రి కొండా సురేఖ తెలిపారు. మంగళవారం అసెంబ్లీలో మంత్రి మాట్లాడుతూ.. 18 మంది సభ్యులతో వైటీడీ బోర్డు ఉంటుందని చెప్పారు. బోర్డు పదవీకాలం రెండు సంవత్సరాలుగా నిర్ణయించామని, బోర్డు ఛైర్మన్, సభ్యులకు ఎలాంటి జీత భత్యాలు ఉండవన్నారు. "వైటీడీ బోర్డు కూడా విద్యా సంస్థలను స్థాపించవచ్చు, నిర్వహించవచ్చు. యాదగిరి




గుట్టలో ఆధ్యాత్మిక, వేద విద్యా సంస్థలను స్థాపించవచ్చు. వైటీడీకి బడ్జెట్ ఆమోదం ప్రభుత్వం ద్వారానే జరుగుతుంది. ఐఏఎస్ అధికారి ఈవోగా ఉంటారు. గతంలో యాదగిరిగుట్టలో భక్తులకు సరైన వసతులు లేవు. ఈ ప్రభుత్వం రూ.కోట్లు ఖర్చు చేసి వసతులు కల్పించింది. ఇంకా మెరుగు పరిచేందుకే యాదగిరిగుట్ట పాలక మండలి ఏర్పాటు చేయాలని నిర్ణయించాం. సమర్ధమైన పాలక మండలిని నియమించి యాదగిరిగుట్ట క్షేత్రాన్ని మరింత అభివృద్ధి చేస్తాం. ఏడాదికి రూ.100 కోట్ల ఆదాయం వచ్చే ఆలయాలన్నీ దేవాదాయశాఖ పరిధిలోకి వస్తాయి" అని మంత్రి కొండా సురేఖ తెలిపారు.

## కృష్ణా ప్రాజెక్టులు కేఆర్ఎంబీకి.. కేంద్రం నోటిఫికేషన్‌పై సుప్రీంలో విచారణ

దిల్లీ: కృష్ణానది ప్రాజెక్టులను కేఆర్ఎంబీకి అప్పగించాలని కేంద్ర ప్రభుత్వం జారీ చేసిన నోటిఫికేషన్‌పై సుప్రీంకోర్టులో విచారణ జరిగింది. 2021లో కేంద్రం జారీ చేసిన నోటిఫికేషన్‌ను తెలంగాణ ప్రభుత్వం సర్వోన్నత న్యాయస్థానంలో సవాల్ చేసింది. మరోవైపు అక్రమంగా విద్యుత్ ఉత్పత్తి చేస్తూ తెలంగాణ నీటిని వాడుకుంటోందని ఏపీ ప్రభుత్వం సైతం సుప్రీంలో పిటిషన్ దాఖలు చేసింది. తెలంగాణ



జారీ చేసిన జీవోను రద్దు చేయాలని పిటిషన్‌లో ఏపీ కోరింది. ఈ మేరకు ఏపీ, తెలంగాణ ప్రభుత్వాలు దాఖలు చేసిన పిటిషన్లపై సుప్రీం కోర్టు విచారణ చేపట్టింది. కేంద్రం ఇచ్చిన పిటిషన్‌పై స్టే ఇవ్వాలని తెలంగాణ మరో పిటిషన్ వేసింది. స్టే ఇవ్వాలని తెలంగాణ వేసిన రిట్ పిటిషన్లపై 2 వారాల్లో కౌంటర్ వేయాలని కేంద్రం, ఏపీ ప్రభుత్వానికి సుప్రీంకోర్టు నోటీసులు జారీ చేసింది. ఇరు ప్రభుత్వాలు కౌంటర్ దాఖలు చేసిన వారం రోజుల్లో రిజాయిండర్ ఫైల్ చేయాలని జస్టిస్ అభయ్ ఒకా, జస్టిస్ ఉజ్జల్ భుయాన్‌ల ధర్మాసనం ఆదేశాలు జారీ చేసింది.



## హైదరాబాద్ స్థిరాస్తి ప్రత్యేకతను చెప్పిన అన్ రాక్ తాజా నివేదిక!

హైదరాబాద్ : అన్ రాక్ స్థిరాస్తి కన్సల్టెంట్ సంస్థ గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. తరచూ దేశంలోని వివిధ నగరాల్లోని రియల్ ఎస్టేట్ స్థితిగతుల్ని.. మార్కెట్ లో చోటు చేసుకుంటున్న పరిణామాల్ని విశ్లేషిస్తూ.. ఆసక్తికర అంశాల్ని వెల్లడిస్తూ ఉంటుంది. అలాంటి అన్ రాక్ తాజాగా విడుదల చేసిన నివేదిక ఒకటి అందరిని ఆకర్షిస్తోంది. గతానికి భిన్నంగా తాజా నివేదిక ప్రత్యేకత ఏమంటే.. ఇళ్ల ధరలు వర్సెస్ అద్దె ధరలు. అంటే.. ఇంటి విలువ ఎక్కువగా పెరుగుతోందా? అద్దె విలువ ఎక్కువగా పెరుగుతుందా? అన్న అంశాల్ని విశ్లేషించింది.

దేశంలోని ఏడు ప్రధాన నగరాల్లో చోటు చేసుకుంటున్న పరిణామాల్ని చెప్పటంతో పాటు.. హైదరాబాద్ లోని వివిధ ప్రాంతాల్లో ఈ వ్యత్యాసాన్ని కళ్లకు కట్టినట్లుగా చెప్పటం ఆసక్తికరంగా మారింది. తాజా రిపోర్టును దేశంలోని ఏడు ప్రధాన నగరాలైన ఢిల్లీ ఎన్ సీఆర్.. బెంగళూరు.. పుణె.. కోల్ కతా.. హైదరాబాద్.. చెన్నై నగరాల్లోని స్థితిగతుల్ని ఈ సంస్థ విశ్లేషించింది. 2021 నుంచి 2024 మధ్య కాలంలో పరిస్థితుల్ని మదింపు చేసింది. ఆసక్తికరమైన అంశం ఏమంటే 2021 - 2024మధ్య కాలంలో ఈ నగరాల్లో ఇళ్ల ధరలు 128 శాతం పెరిగినట్లు చెప్పింది. బెంగళూరు.. ఎన్ సీఆర్ ఢిల్లీ.. హైదరాబాద్ నగరాల్లో అద్దెల పెరుగుదలతో పోలిస్తే.. ఇళ్ల ధరలు పెరిగినట్లుగా పేర్కొంది. అదే సమయంలో పుణె.. కోల్ కతా.. చెన్నై నగరాల్లో మాత్రం ఇళ్ల ధరల కంటే కూడా అద్దెలు ఎక్కువైనట్లుగా గణాంకాల సహితంగా వివరించింది. హైదరాబాద్ మహానగరాన్నే తీసుకుంటే గచ్చిబౌలి.. హైటెక్ సిటీ ప్రాంతాల్లో అద్దె పెరుగుదల.. ఇంటి ధరల కంటే ఎక్కువగా ఉన్నట్లుగా పేర్కొంది.

హైటెక్ సిటీలో ఇళ్ల ధరల్లో వృద్ధి 62 శాతం ఉంటే.. అద్దెల్లో పెరుగుదల 54 శాతమేనని చెప్పింది. గచ్చిబౌలిలో ఇళ్ల ధరల్లో 78 శాతం ఉండగా.. అద్దెల్లో 62 శాతం వృద్ధి ఉన్నట్లు చెప్పింది. ఇళ్ల విలువ పెరగాలని ఆశించే వారికి హైదరాబాద్.. నోయిడా.. ముంబయి మెట్రోపాలిటన్ రీజియన్ అనుకూలమని చెబుతూ.. అద్దెల విలువ ఎక్కువగా ఉండాలని భావించే వారికి మాత్రం.. మిగిలిన నగరాలు బాగుంటాయని పేర్కొంది. ఈ రిపోర్టును చూస్తే.. హైదరాబాద్ రియల్ ఎస్టేట్ మార్కెట్ ఇస్పెషాలిటీ ఇట్టే అర్థమవుతుందని చెప్పక తప్పదు.

## తెలంగాణలో ఎంట్రీ ఇవ్వనున్న 37 మద్యం బ్రాండ్లు

హైదరాబాద్ : తెలంగాణ మందుబాబులకు మరింత కిక్కు ఇచ్చే నిర్ణయాన్ని ప్రభుత్వం తీసుకుంది. అతి త్వరలో మార్కెట్ లోకి సరికొత్త మద్యం బ్రాండ్లు అందుబాటులోకి రానున్నాయి. అది కూడా ఒకట్రెండు కాదు ఏకంగా 37 కొత్త మద్యం బ్రాండ్లు ముందుకు వచ్చాయి. మద్యం సరఫరా కోసం గత నెల 23న బేవరేజెస్ కార్పొరేషన్ కొత్త సరఫరాదారుల నుంచి అప్లికేషన్లకు ఆహ్వానించింది. ఇప్పటికే దేశీయంగా తయారయ్యే మద్యం బ్రాండ్లలో 95 శాతం కార్పొరేషన్ తో రిజిస్టర్ అయిన నేపథ్యంలో మిగిలిన బ్రాండ్లు అప్లై చేస్తాయని భావించారు. ఆసక్తికరమైన అంశం ఏమంటే.. గడువు ముగిసేనాటికి ఏకంగా 37 బ్రాండ్లు దరఖాస్తు వేస్నుకున్నాయి. ఇందులో 15 విదేశీ మద్యం బ్రాండ్లు కాగా మరో 15దేశీయ మద్యం బ్రాండ్లు. ఏడు అప్లికేషన్లు బీర్ల సరఫరాకు ముందుకు వచ్చాయి. ఇక్కడో ఆసక్తికర పరిణామం చోటు చేసుకుంది. నోటిఫికేషన్ లేకుండా కొత్త బ్రాండ్ల సరఫరా కోసం అనుమతి ఇవ్వటం ఏమిటంటూ ప్రభుత్వం మీద విమర్శలు చేసి.. వివాదాస్పద జాబితాలోకి ఎక్కిన సోం డిస్టలరీస్ కూడా ఈ జాబితాలో ఉన్నట్లుగా చెబుతున్నారు. బీర్ తో పాటు లిక్కర్ సంస్థలు కూడా అప్లికేషన్ పెట్టిన వైనం బయటకు వచ్చింది. మొత్తం



ఫార్మాలిటీస్ పూర్తి చేసేందుకు నెల రోజులు పడుతుందని చెబుతున్నారు. అదే సమయంలో లిక్కర్ బేసిక్ ధరల్ని పెంచాలన్న దానిపై కసరత్తు జరుగుతోంది. అదే జరిగితే.. మద్యం ధరలు పెరిగే అవకాశం ఉందన్న వ్యాఖ్య వినిపిస్తోంది. ఈ కొత్త బ్రాండ్ల కారణంగా రూ.5 వేల వరకు ఆదాయం సమకూరుతుందని భావిస్తున్నారు.

## ఆస్ట్రనాట్ సునీతా విలియమ్స్‌కు ప్రధాని మోదీ లేఖ

నాసా ఆస్ట్రనాట్ సునీతా విలియమ్స్‌కు ప్రధాని మోదీ భావోద్వేగపూరిత లేఖ రాశారు. ఆ లేఖలో .. ' నువ్వు సాధించిన విజయానికి 1.4 బిలియన్ల భారతీయులు ఎంతో గర్విస్తున్నారు. నువ్వు వేల మైళ్ల అవతల ఉన్నావని తెలుసు. అయినా కానీ, నువ్వు ఎప్పుడూ మా గుండెలకు చాలా దగ్గరగా ఉంటావు. భారతదేశంలోని ప్రజలు నువ్వు ఆరోగ్యంగా ఉండాలని, విజయం సాధించాలని కోరుకుంటున్నారు. నువ్వు భూమి పైకి తిరిగి వచ్చిన తర్వాత తప్పకుండా ఇండియాకు రా. భారత ఖ్యాతిని పెంచే నీలాంటి కూతుళ్లకు ఆతిథ్యం ఇవ్వటాన్ని భారత్ ఎంతో గౌరవంగా భావిస్తుంది. నువ్వు, మిస్టర్ బ్యారీ విల్‌మోర్ క్షేమంగా ఇంటికి తిరిగి రావాలని కోరుకుంటున్నాను' అని పేర్కొన్నారు. ఈ లేఖను కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్ తన ట్విటర్ ఖాతాలో షేర్ చేశారు. సునీతా విలియమ్స్‌తో పాటు మరో ఆస్ట్రనాట్ బచ్ విల్మోర్ అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రంలో చిక్కుకుపోయారు. దాదాపు 9 నెలల నుంచి అక్కడే ఉన్నారు. 9 నెలల నుంచి నాసా వారిని భూమ్మీదకు తీసుకువచ్చే ప్రయత్నం చేస్తూనే వచ్చింది. ఇప్పటికి ఆ ప్రయత్నం విజయం సాధించింది. బుధవారం ఉదయం వారిద్దరూ భూమ్మీదకు అడుగుపెట్టనున్నారు. అమెరికాలోని ఫ్లోరిడా కాలమానం ప్రకారం సాయంత్రం 5.57 గంటలకు అంటే మన భారత కాలమానం ప్రకారం బుధవారం వేకువజామున 3.37 గంటలకు వారు ప్రయాణించిన క్యాప్సూల్ ఫ్లోరిడా సమీపంలోని సముద్రంలో దిగనుంది. వాళ్లను తీసుకురావడానికి నలుగురు ఆస్ట్రనాట్‌లు వెళ్లారు. క్రూ డ్రాగన్ వ్యోమనౌకలో అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రానికి వెళ్లారు. అక్కడ ఇరుక్కుపోయిన ఇద్దరు.. వారిని తీసుకురావడానికి వెళ్లిన ఈ నలుగురు మొత్తం ఆరుగురు రేపు భూమ్మీదకు వస్తారు. సముద్రం నుంచి ఒక్కొక్కరిగా అందరినీ బయటకు తీసుకువస్తారు. వారు కిందకు దిగే కార్యక్రమాన్ని నాసా ప్రత్యక్ష ప్రసారం చేయనుంది. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న కొన్ని కోట్ల మంది వారు భూమ్మీదకు వచ్చే ఘట్టం కోసం వెయ్యి కళ్లతో ఎదురు చూస్తూ ఉన్నారు. రేపు పెద్ద సంఖ్యలో జనం దాన్ని ప్రత్యక్ష ప్రసారం ద్వారా వీక్షించే అవకాశం ఉంది.

## ప్రధాని మోదీని కలిసిన ఇళయరాజా



ప్రధాని నరేంద్ర మోదీని ప్రముఖ సంగీత దర్శకుడు ఇళయరాజా మర్యాదపూర్వకంగా కలిశారు. సంబంధిత ఫొటోలను మ్యూజిక్ డైరెక్టర్ సోషల్ మీడియా వేదికగా షేర్ చేశారు. "మోదీజీతో ఎప్పటికీ మర్చిపోలేని సమావేశమిది. నా 'సింఫొనీ- వాలియంట్' సహా పలు అంశాలపై చర్చించాం. ఆయన ప్రశంసలు, మద్దతుకు కృతజ్ఞుడిని" అని పేర్కొన్నారు. లండన్‌లో ఇటీవల ఇళయరాజా 'వాలియంట్' పేరిట మ్యూజికల్ ఈవెంట్ నిర్వహించిన సంగతి తెలిసిందే. లండన్‌లో వెస్టర్న్ క్లాసికల్ సింఫొనీ నిర్వహించిన తొలి ఆసియా మ్యూజిక్ కంపోజర్‌గా ఇళయరాజా రికార్డు సృష్టించారు. కొన్ని రోజుల క్రితం చెన్నై తిరిగొచ్చిన ఆయన ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. సంగీతానికి వయసుతో సంబంధంలేదన్నారు. భవిష్యత్తులో.. 13 దేశాల్లో 'వాలియంట్' నిర్వహించనున్నారు.


చురకలు






పాకిస్థాన్‌లోని వేర్పాటువాద బలూచ్ మిలిటెంట్లు మంగళవారం ప్రయాణికుల రైలును హైజాక్ చేసిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో బలూచ్ లిబరేషన్ ఆర్మీ కీలక ప్రకటన చేసింది. తమ రాజకీయ ఖైదీలను విడుదల చేసేందుకు పాకిస్థాన్ ప్రభుత్వానికి ఇచ్చిన సమయం ముగియడంతో తమ చెరలో ఉన్న 214 మంది పాక్ సైన్యాన్ని చంపేశామని పేర్కొంది. ఆపరేషన్ ముగిసిందంటూ ఇస్లామాబాద్ ప్రభుత్వం చేసిన ప్రకటనను కూడా ఖండించింది. 'మా రాజకీయ ఖైదీల విడుదలకు పాకిస్థాన్ సైన్యానికి 48 గంటల సమయం ఇచ్చాం. మా చెరలో బందీలుగా ఉన్న వారిని రక్షించుకునేందుకు సైన్యానికి మేము ఇచ్చిన చివరి అవకాశం. కానీ, పాక్ తన మొండితనాన్ని, సైనిక దురహంకారాన్ని ప్రదర్శించింది. ఫలితంగా శత్రు సైన్యానికి చెందిన 214 మందిని మేం హతమార్చాం. బీఎల్ఏ ఎప్పుడూ అంతర్జాతీయ చట్టాలకు అనుగుణంగానే వ్యవహరిస్తుంది. అయితే ఇస్లామాబాద్ సైన్యం తమ సిబ్బందిని కాపాడుకునేందుకు బదులుగా మాతో పోరాడాలని ప్రయత్నించింది. ఫలితంగా బందీలను కోల్పోయింది. జాఫర్ ఎక్స్‌ప్రెస్ బోగీల్లోని బందీలను రక్షించేందుకు పాకిస్థాన్‌లోని ఎస్ఎస్‌జీ కమాండోలు రాగానే మా యోధులు వారిని చుట్టిముట్టి భీకర దాడి చేశారు. గంటల పాటు సాగిన ఈ దాడుల్లో పలువురు బందీలను ఉరితీయగా.. ఎస్ఎస్‌జీ కమాండోలు భారీ ప్రాణనష్టాన్ని చవిచూశారు. మా వాళ్లు చివరి బుల్లెట్ వరకు పోరాడారు.

**భయానక అనుభవం.. కఠినపరీక్ష..** చనిపోయిన తిరుగుబాటుదారుల మృతదేహాలను చూపించి విజయం సాధించామని ఇస్లామాబాద్ ప్రభుత్వం వాస్తవాలను కూడా కప్పిపుచ్చుతోంది. సైన్యం, ఇంటెలిజెన్స్ బృందం ఉన్నప్పటికీ బందీలను రక్షించుకోవడంలో శత్రు సైన్యం విఫలమైంది. యుద్ధ సూత్రాలకు కట్టుబడి మేం విడుదల చేసిన వారిని కాపాడినట్లు ప్రకటించుకుంటుంది. ఈ యుద్ధం ఇంకా ముగియలేదు. బలూచ్ యోధులు వివిధ ప్రాంతాల్లో మెరుపుదాడులతో ఆక్రమిత సైన్యాన్ని లక్ష్యంగా చేసుకుంటున్నారు. ఈ ఆపరేషన్‌లో బలూచ్ విజయం సాధించింది' అని మిలిటెంట్ సంస్థ పేర్కొంది. ఇక, హైజాక్ సమయంలో మరణించిన బీఎల్ఏకు మిలిటెంట్ సంస్థ నివాళులర్పించింది. పాక్‌లోని క్వెట్టా నుంచి పెషావర్‌కు 440 మంది ప్రయాణికులతో వెళ్తున్న జాఫర్ ఎక్స్‌ప్రెస్ (%ఝుటటఖుతీ ఱఞఞతీవం%)ను బలూచ్ వేర్పాటువాదులు హైజాక్ చేసిన విషయం తెలిసిందే. ఈ ఘటనలో 26 మంది బందీలు మరణించగా.. దాదాపు 33 మంది వేర్పాటువాదులను మట్టుబెట్టి మిగతా ప్రయాణికులను అందరినీ సురక్షితంగా విడిపించామని పాకిస్థాన్ సైన్యం ప్రకటించింది. బలూచ్ మిలిటెంట్లు చంపిన 26 మంది బందీల్లో 18 మంది సైనికులని పాక్ ఆర్మీ కూడా పేర్కొంది. ఇక, ఈ ఆపరేషన్ ముగిసినట్లు ప్రకటన విడుదల చేసింది. అయితే, బలూచ్ మిలిటెంట్లు ఇందుకు విరుద్ధంగా పేర్కొనడం గమనార్హం.




పాలస్తీనాకు మద్దతుగా కొలంబియా యూనివర్శిటీ విద్యార్థులు ఇటీవల అమెరికాలో పెద్దఎత్తున నిరసనలు తెలిపారు. ఈ నిరసనలకు భారతదేశానికి చెందిన ఓ విద్యార్థిని మద్దతు తెలిపినట్లు అభియోగాలు నమోదయ్యాయి. ఈక్రమంలో ఆమె వీసాను రద్దు చేయగా.. ఆమె స్వీయ బహిష్కరణకు గురైనట్లు యూఎస్ డిపార్ట్‌మెంట్ ఆఫ్ హోమ్‌ల్యాండ్ సెక్యూరిటీ ప్రకటించింది. భారత్‌కు చెందిన రంజనీ శ్రీనివాసన్ ఎఫ్-1 విద్యార్థి వీసాపై అమెరికాలో ఉంటున్నారు. ఇటీవల జరిగిన నిరసనలకు ఆమె మద్దతిచ్చినట్లు అక్కడి అధికారులు ఆరోపించారు. దీంతో ఆమె వీసాను రద్దు చేస్తున్నట్లు యూఎస్ డిపార్ట్‌మెంట్ ఆఫ్ హోమ్‌ల్యాండ్ సెక్యూరిటీ (%ణఖూ%) మార్చి 5న ప్రకటించింది. అయితే, సీబీపీ హోమ్ అనే ఆప్‌ను ఉపయోగించి ఆమె మార్చి 11న స్వీయ బహిష్కరణకు గురైనట్లు డీహెచ్ఎస్ పేర్కొంది. అందుకు సంబంధించిన వీడియోను విడుదల చేసింది. ఇక, డీహెచ్ఎస్ సెక్రటరీ క్రిస్టీ నోయెమ్ దీనిపై ఓ ప్రకటనను విడుదల చేశారు. 'అమెరికాలో నివసించడానికి, చదువుకోవడానికి వీసా మంజూరుచేస్తాం. కానీ, మీరు ఉగ్రవాద సంస్థలకు మద్దతుగా నిరసనలు తెలిపినప్పుడు వాటిని ర ద్దు చేస్తాం. అలాంటివారు ఈ దేశంలో ఉండకూడదు. మిలిటెంట్ సంస్థలకు మద్దతుగా నిరసనలు తెలిపిన కొలంబియా యూనివర్శిటీ విద్యార్థిని ఒకరు స్వీయ బహిష్కరణ కోసం సీబీపీ హోమ్ ఆప్ ఉపయోగించిందనందుకు సంతోషిస్తున్నా' అని ఆమె పేర్కొన్నారు. ఇక, డీహెచ్ఎస్ ఇటీవలే ఈ సీబీపీ హోమ్ ఆప్‌ను ప్రారంభించింది. ఈ ఆప్‌లోని టూల్‌ను ఉపయోగించి స్వచ్ఛందంగా దేశాన్ని వీడే అవకాశాన్ని కల్పిస్తుంది.

# బండి సంజయ్ ఓ గేమ్‌ఛేంజర్.. అధిష్టానం నుంచి రిటర్న్ గిఫ్ట్..!

తెలంగాణ ఎమ్మెల్సీ ఎన్నికల్లో మరోసారి కాషాయ జెండా రెపరెపలాడింది. టీచర్, గ్యాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో సత్తా చాటింది. కరీంనగర్, ఆదిలాబాద్, నిజామాబాద్, మెదక్ జిల్లాల నుంచి టీచర్స్ కోటాలో పోటీచేసిన మల్క కొమురయ్య భారీ విజయం సాధించారు. గత రికార్డులను తిరగరాస్తూ.. ఫస్ట్ ప్రియారిటీ ఓట్లలోనే ఆయన గెలుపొందారు. మల్క కొమురయ్య గెలుపును బీజేపీ హైకమాండ్ ముందుగానే అంచనా వేసింది. అందుకే కేంద్రమంత్రి బండిసంజయ్‌కు కీలక బాధ్యతలు అప్పగించింది. దాంతో మూడు నెలలుగా బండి సంజయ్ ఉత్తర తెలంగాణలో అభ్యర్థుల గెలుపు కోసం నిరంతరం కష్టపడారు. ప్రతి 25 మంది ఓటర్లకు ఓ ఇంచార్జ్‌ను నియమించి వారికి బాధ్యతలను అప్పగించారు. దాంతో మూడు నెలలుగా అనేక సమావేశాలు నిర్వహిస్తూ.. క్యాడర్‌ను పరుగులు పెట్టించారు. మూడు నెలలుగా తమ అభ్యర్థులను గెలిపించుకునేందుకు ప్రతి ఓటర్ను కలిసి అన్నితానై వ్యవహరించారు కేంద్రమంత్రి బండి సంజయ్.. ఇక కరీంనగర్- మెదక్- నిజామాబాద్- ఆదిలాబాద్ జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఘన విజయం సాధించిన మల్క కొమురయ్యకు బండి సంజయ్ శుభాకాంక్షలు తెలిపారు. ఇంతటి చారిత్రాత్మక విజయాన్ని అందించిన ఉపాధ్యాయులకు ధన్యవాదాలు చెప్పారు. ఇది మామూలు విజయం కాదు.. మల్క కొమురయ్య ఐదు వేలకు పైగా ఓట్ల తేడాతో విజయం సాధించడం చాలా గొప్ప విషయమన్నారు. మోడీ మీదున్న నమ్మకమే దేశ వ్యాప్తంగా బీజేపీ విజయానికి బాటలు వేస్తోందని తెలిపారు. ఉపాధ్యాయుల సమస్యల కోసం మల్క కొమురయ్య కృషి చేస్తారు అని కేంద్ర మంత్రి బండి సంజయ్ తెలిపారు. అటు గ్రాడ్యుయేట్ ఎన్నికల్లో అధికార కాంగ్రెస్ పార్టీ నుంచి ఆల్ఫోర్స్ నరేందర్ రెడ్డి బరిలో నిలిచారు. నరేందర్‌రెడ్డి గెలుపు కోసం ఏకంగా సీఎం రేవంత్ రెడ్డి మూడుచోట్ల భారీ బహిరంగ సభలు నిర్వహించారు. గతంలో ఏ సీఎం కూడా ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఈ స్థాయిలో ప్రచారం చేయలేదు. అయినప్పటికీ గ్రాడ్యుయేట్లు కాంగ్రెస్ పార్టీకి దిమ్మతిరిగే షాక్ ఇచ్చారు. తెలంగాణలో బీసీ వాదం బలంగా ఉన్నప్పటికీ.. గ్రాడ్యుయేట్లు మాత్రం.. బీజేపీ వైపే మొగ్గుచూపారు. ఉమ్మడి కరీంనగర్- ఆదిలాబాద్- నిజామాబాద్- మెదక్ జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీగా బీజేపీ అభ్యర్థిని చిన్నమైల్ అంజిరెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించారు. దీంతో ఉత్తర తెలంగాణలో కీలకమైన రెండు ఎమ్మెల్సీ స్థానాలను %దీజీూ% తన ఖాతాలో ఇక ఉత్తర తెలంగాణలో ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ గెలుపు బాధ్యతను బండి సంజయ్ సవాల్‌గా తీసుకున్నారు. అటు కాంగ్రెస్ అభ్యర్థి అల్ఫోర్స్ నరేందర్ రెడ్డి కూడా కరీంనగర్ వాస్తవ్యుడే కావడం.. ఆయనకు పలు విద్యాసంస్థలు ఉండటంతో బండి అనుక్షణం ఎన్నికల్లో గెలుపై వ్యూహాలు రచించారు. కేంద్ర హోంశాఖ సహాయమంత్రి హోదాలో దేశమంతటా తిరగాల్సి ఉన్న.. కరీంనగర్‌లోనే ఆయన చాలా రోజులు మకాం వేశారు. ఉమ్మడి జిల్లాలో మొత్తం 3 లక్షల యాభై వేల ఓట్లు ఉండగా.. వీరిలో లక్షా 8 వేల ఓట్లు కేవలం కరీంనగర్‌లోనే ఉన్నాయి. దాంతో ప్రతిఓటర్‌ను కలిసే ప్రయత్నం చేశారు. అంతేకాకుండా అప్పట్లో జీవో నెంబర్ 317 పై తాను పోరాడిన విషయాన్ని ప్రజలకు గుర్తు చేశారు. గతంలో 317 జీవోకు వ్యతిరేకంగా బండి సంజయ్ నిరహార దీక్షకు దిగారు. ఆయన దీక్షను భగ్నం చేస్తూ కేసీఆర్ సర్కార్ బండి సంజయ్‌కు అరెస్టు చేసింది. అప్పట్లో తనకు జరిగిన అవమానాన్ని తాజా ఎమ్మెల్సీ ఎన్నికల్లో బదులు తీర్చుకునేలా ప్రణాళికలతో దూసుకెళ్లారు.. ప్రతిరోజు కొత్త స్ట్రాటజీతో ఓటర్లను ఆకట్టుకున్నారు. బీసీ కులగణన, కాంగ్రెస్ పార్టీపై ప్రజల్లో వ్యతిరేకత పెరిగేలా చూసుకున్నారు. ఇలా ప్రతిరోజు మీడియాలో బీజేపీ గెలుపుపై అంచనాలు పెరిగేలా చేయడంలో సక్సెస్ అయ్యారు. ఆయన స్ట్రాటజీ కారణంగానే రెండు సీట్లను బీజేపీ గెలుపు నల్లేరు మీద నడకలా మారిందని బీజేపీ శ్రేణులే అంటున్నాయి.. అంతేకాదు బీజేపీ అభ్యర్థి అంజిరెడ్డి విజయంపై కాంగ్రెస్ పార్టీకి పట్టభద్రులు రంజాన్ గిఫ్ట్ ఇచ్చారని సెటైర్లు వేశారు కేంద్రమంత్రి బండి సంజయ్. ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలిచేందుకు కాంగ్రెస్ నేతలకు ఓటుకు 5 వేల రూపాయలు పంచిపెట్టారని విమర్శిఆంచారు. అటు బీజేపీని ఓడగొట్టేందుకు కాంగ్రెస్, బీఆర్ఎస్ ఒక్కటైందన్న బండి సంజయ్.. కేంద్రం నిధులిస్తే ఇక్కడి ప్రభుత్వం తానే గొప్పలు పోతోందని ఎద్దేవా చేశారు. సీఎం రేవంత్ రెడ్డికి దమ్ముంటే వెంటనే స్థానిక సంస్థల ఎన్నికలను నిర్వహించాలని డిమాండ్ చేశారు. మరోవైపు తెలంగాణ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ పట్టు నిలుపుకోవడంపై ప్రధాని మోడీ హర్షం వ్యక్తం చేశారు. కరీంనగర్- ఆదిలాబాద్- నిజామాబాద్- మెదక్ జిల్లాల గ్రాడ్యుయేట్ స్థానంతో పాటు.. టీచర్ ఎమ్మెల్సీ సీటును బీజేపీ దక్కించుకోవడంపై ప్రశంసలు కురిపించారు. ఈ సందర్భంగా కొత్తగా ఎన్నికైన ఎమ్మెల్సీలకు విషేస్ చెబుతూ ట్వీట్ చేశారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో అద్వితీయమైన మద్దతును ఇచ్చి తెలంగాణలో బీజేపీ పార్టీ ఆదరించిన ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. ప్రజల మధ్య చాలా శ్రద్ధగా పనిచేస్తున్న నేతలు, కార్యకర్తలను చూసి నేను చాలా గర్వపడుతున్నానన్నానని ట్వీట్‌లో రాసుకొచ్చారు. మొత్తంగా ఎమ్మెల్సీ ఎన్నికల్లో కమలం పార్టీ అభ్యర్థుల గెలుపులో కీ రోల్ పోషించిన బండి సంజయ్‌ను పార్టీ హైకమాండ్ అభినందించినట్టు తెలుస్తోంది.

ఉత్తర తెలంగాణలో పార్టీని బలోపేతం చేస్తూనే.. ఓటర్లను ఆకట్టుకున్నందుకు మోడీ, అమిత్ షా ప్రశంసించినట్టు సమాచారం. రానున్న రోజుల్లోనూ ఇదే స్పీడ్‌ను కంటిన్యూ చేస్తూ.. టార్గెట్ తెలంగాణగా దూసుకెళ్లాలని ఆదేశించినట్టు సమాచారం. మొత్తం మీద రెండు చోట్ల కమలం పార్టీ అభ్యర్థులు ఘన విజయం సాధించడంపై కమలం పార్టీలో కొత్త జోష్ వచ్చింది. దీంతో త్వరలో బండి సంజయ్‌కు బీజేపీ అధిష్టానం నుంచి కీలక పదవి రూపంలో రిటర్న్ గిఫ్ట్ రానుందని కమలం శ్రేణులు అంటున్నాయి.

# చేతులు కాలాక ఆకులు పట్టుకుంటున్న సెలబ్రెటీలు




డబ్బుల కోసం అర్రులు చాచారు. బెట్టింగ్ యాప్స్ ను ప్రమోట్ చేశారు. కట్ చేస్తే కాలం ఎప్పుడూ ఒకేలా ఉండదు కదా.. ప్రభుత్వాలు మారాయి.. వారి ప్రాధాన్యాలు పెరిగాయి.. ఎవరైతే బెట్టింగ్ యాప్స్ ను కాసుల కక్కుర్తి కోసం వాడుకున్నారో వారందరిపై తాజాగా కేసుల నమోదయ్యాయి.. 'డబ్బులు సంపాదించడం ఇంత సులభమా?' అన్నట్లుగా బెట్టింగ్ యాప్‌లను ప్రమోట్ చేస్తున్న సెలబ్రెటీలకు ఇప్పుడు ఉచ్చు బిగుస్తోంది. బెట్టింగ్ యాప్స్ మాయలో ఎంతోమంది అమాయక ప్రజలను ముంచేస్తున్న పరిస్థితి నెలకొంది.. కర్నూలుకు చెందిన రాము.. డిగ్రీ పూర్తి చేసి ఉద్యోగం కోసం ప్రయత్నిస్తున్నాడు. ఖాళీ సమయాల్లో సోషల్ మీడియాలో వీడియోలు చూసేవాడు. ఒకరోజు తన అభిమాన నటుడు ఒక బెట్టింగ్ యాప్‌ను ప్రమోట్ చేస్తూ కనిపించాడు. 'తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభం' అంటూ ఆ నటుడు చెప్పిన మాటలు రామును ఆకర్షించాయి.

మొదట్లో సరదాగా కొద్ది మొత్తంలో డబ్బులు పెట్టాడు. కొన్నిసార్లు గెలుపు రావడంతో అతడికి మరింత ఆశ పెరిగింది.క్రమంగా రాము తనకున్న కొద్దిపాటి పొదుపునంతా బెట్టింగ్‌లో పెట్టడం మొదలుపెట్టాడు. గెలవడం కన్నా ఓడిపోవడమే ఎక్కువైంది. అప్పులు పెరిగిపోయాయి. కుటుంబ సభ్యులకు ఏం చెప్పాలో తెలియక తీవ్ర వేదనకు గురయ్యాడు. రాము ఒక్కడే కాదు.. ఇలా ఎంతోమంది యువకులు బెట్టింగ్ యాప్‌ల వలలో చిక్కుకుని తమ భవిష్యత్తును నాశనం చేసుకుంటున్నారు. ఈ విషయం పోలీసుల దృష్టికి రావడంతో సీనియర్ ఐపీఎస్ అధికారి సజ్జనార్ రంగంలోకి దిగారు. బెట్టింగ్ యాప్‌ల ప్రమోషన్ల వల్ల సమాజం ఎంతగానో నష్టపోతోందని ఆయన ఎప్పటినుంచో హెచ్చరిస్తూనే ఉన్నారు. ఇప్పుడు ఆర్టీసీ ఎండీగా బాధ్యతలు నిర్వహిస్తున్నప్పటికీ, ఈ సామాజిక సమస్యపై ఆయన ప్రత్యేక దృష్టి సారించారు. మొదటగా సోషల్ మీడియాలో బాగా పాపులర్ అయిన హర్ష సాయి మీద పోలీసులు కేసు ఫైల్ చేశారు. ఇది మిగతా సెలబ్రెటీలు, ఇన్ఫ్లుయెన్సర్లలో కలకలం రేపింది. గతంలో ఎంతో మంది టాలీవుడ్ చిన్న నటులు, సెలబ్రెటీలు ఎంతోమంది బెట్టింగ్ యాప్‌లను ప్రమోట్ చేసిన విషయం అందరికీ తెలిసిందే. హర్ష సాయి అరెస్ట్ కావడంతో వీరంతా ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. తమ పాత వీడియోలను సోషల్ మీడియా నుండి తొలగించడం మొదలుపెట్టారు. 'గతంలో తెలియక ప్రమోట్ చేశాం. ఎవ్వరూ ఈ యాప్‌ల జోలికి వెళ్లొద్దు' అంటూ క్షమాపణలు చెబుతూ వీడియోలు విడుదల చేస్తున్నారు. నిజానికి పోలీసుల భయంతోనే వీరంతా ఇలా చేస్తున్నారన్నది స్పష్టంగా తెలుస్తోంది. సజ్జనార్ తీసుకున్న చర్యతో ఇప్పుడు చాలా మందిలో మార్పు కనిపిస్తోంది. బెట్టింగ్ యాప్‌ల వల్ల కలిగే నష్టాల గురించి ప్రజలు మాట్లాడుకుంటున్నారు.

సెలబ్రెటీలు కూడా డబ్బు కోసం కళ్లు మూసుకుని ప్రమోషన్లు చేయకూడదని గ్రహిస్తున్నారు. ఇదొక మంచి పరిణామం. పోలీసులు మరింత కఠినంగా వ్యవహరిస్తే, భవిష్యత్తులో ఇలాంటి మోసాలు జరగకుండా అరికట్టవచ్చు. అమాయక ప్రజల జీవితాలను కాపాడవచ్చు. డబ్బు సంపాదనే ధ్యేయంగా కాకుండా, బాధ్యతగా ప్రవర్తించే సెలబ్రెటీలను మనం ప్రోత్సహించాలి. అప్పుడే సమాజం సరైన మార్గంలో పయనిస్తుంది.

# అమెరికాలో గ్రీన్ కార్డ్ హోల్డర్ కు అవమానం... బట్టలు విప్పి..!


అమెరికాలో డొనాల్డ్ ట్రంప్ ప్రెసిడెంట్ గా బాధ్యతలు చేపట్టినప్పటి నుంచీ దేశంలో పలు ఆంక్షలు అమలవుతున్న సంగతి తెలిసిందే. ప్రధానంగా నిన్నటివరకూ వలసదారులపై పలు కండిషన్స్ పెట్టిన ట్రంప్.. ఇప్పుడు గ్రీన్ కార్డ్ హోల్డర్స్ ని కూడా టార్గెట్ చేసినట్లు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో ఓ గ్రీన్ కార్డ్ హోల్డర్ కు సంబంధించి షాకింగ్ ఘటన తెరపైకి వచ్చింది. అవును... అమెరికాలో ట్రంప్ అధికారం చేపట్టిన తర్వాత పలు ఆంక్షలు అమలవుతోన్న సంగతి తెలిసిందే. ఈ క్రమంలో.. అమెరికన్ గ్రీన్ కార్డు కలిగిన ఓ వ్యక్తికి విమానాశ్రయంలో ఘోర అవమానం జరిగిన ఉదతం కాస్త ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఈ ఘటన మార్చి 7న మసాచుసెట్స్ లోని లోగాన్ విమానాశ్రయంలో జరిగింది. వివరాల్లోకి వెళ్తే... అమెరికా గ్రీన్ కార్డ్ హోల్డర్ ఫాబియన్ స్మిత్ ను మసాచుసెట్స్ లోని లోగాన్ విమానాశ్రయంలో ఇమ్మిగ్రేషన్ అధికారులు అదుపులోకి తీసుకున్నారు. వాస్తవానికి స్మిత్ తన టీనేజ్ నుంచి యునైటెడ్ స్టేట్స్ లోనే నివసిస్తున్నారు. ప్రస్తుతం న్యూ హాంప్ షైర్ లో ఉంటున్నారు. ఈ సమయంలో.. స్మిత్ లక్సెంబర్ పర్యటన అనంతరం తిరిగి వస్తుండగా ఇది జరిగింది. ఇందులో భాగంగా... ఎయిర్ పోర్ట్ లో ఇమ్మిగ్రేషన్ అధికారులు అదుపులోకి తీసుకున్నారు. నివేదికల




ప్రకారం... స్మిత్ ను ఎయిర్ పోర్ట్ లో అదుపులోకి తీసుకున్న అనంతరం అతని దుస్తులను తొలగించి, విచారణకు తీసుకెళ్లారని అతని కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. ఇదే సమయంలో.. అసలు అతన్ని ఎందుకు నిర్భందించారో తమకు తెలియదని వారు పేర్కొన్నారు. దీనిపై స్పందించిన స్మిత్ భాగస్వామి... స్మిత్ గతంలో తన గ్రీన్ కార్డును పునరుద్ధరించుకున్నారని.. అతనిపై ఎలాంటి కేసులు పెండింగ్ లో లేవని.. అతన్ని ఆహ్వానించేందుకు ఎయిర్ పోర్ట్ కి అతని స్నేహితులు వచ్చారని.. ఎంతసేపు చూసినా రాకపోయేసారికి అధికారులను సంప్రదించేందుకు నాలుగు గంటలు పట్టిందని చెబుతున్నారు! ఇదే సమయంలో.. తన కుమారుని గ్రీన్ కార్డ్ ఫ్లాగ్ అయ్యిందని అధికారులు తనకు చెప్పారని.. స్మిత్ తల్లి మీడియాతో అన్నారు. వాస్తవానికి తన కుమారుడికి 2023లోనె గ్రీన్ కార్డ్ ను చట్టబద్ధంగా తిరిగి జారీ చేశారని ఆమె తెలిపారు. అది చెల్లుబాటులో ఉన్నప్పటికీ స్మిత్ ను అడ్డుకున్నారని ఆమె ఆరోపించారు. ఈ సందర్భంగా స్పందించిన యూఎస్ కస్టమ్స్ అండ్ బోర్డర్ ప్రొటెక్షన్ అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పబ్లిక్ అఫైర్స్ హిట్లన్ బెక్హాం... చట్టాలు లేదా వీసా నిబంధనలు ఉల్లంఘించినట్లయితే ప్రయాణికులను నిర్బంధించడం.. లేదా, తిరిగి వెనక్కి పంపడం జరుగుతుందని తెలిపారు. గోప్యతా నిబంధనల కారణంగా నిర్దిష్ట కేసుల వివరాలను వెల్లడించమని పేర్కొన్నారు.

# యూపీ సర్కార్ కు అండగా అయోధ్య రామాలయ ట్రస్ట్.. ఏం చేసిందంటే?

రామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ గత ఐదేళ్లలో ప్రభుత్వానికి అండగా నిలుస్తూ భారీగా పన్నులు చెల్లించింది. 2020 ఫిబ్రవరి 5 నుంచి 2025 ఫిబ్రవరి 5 మధ్య కాలంలో ట్రస్ట్ ఏకంగా రూ. 400 కోట్ల పన్నులు చెల్లించిందని ట్రస్ట్ కార్యదర్శి చంపత్ రాయ్ ఆదివారం తెలిపారు. మతపరమైన పర్యాటకం ఊహించని విధంగా పెరగడంతోనే ఈ భారీ మొత్తం ప్రభుత్వానికి చేరిందని ఆయన వెల్లడించారు. ఇందులో వస్తు, సేవల పన్ను (%+ూ%) కింద రూ. 270 కోట్లు ఉండగా, మిగిలిన రూ. 130 కోట్లు ఇతర పన్నుల రూపంలో చెల్లించినట్లు ఆయన వివరించారు. అయోధ్య ఇప్పుడు ఆధ్యాత్మిక కాంతులతో నిండి ఉందని, భక్తులు , పర్యాటకుల సంఖ్య పది రెట్లు పెరిగిందని చంపత్ రాయ్ సంతోషం వ్యక్తం చేశారు. అయోధ్య ఒక ముఖ్యమైన మతపరమైన పర్యాటక కేంద్రంగా మారడంతో స్థానికులకు ఉపాధి అవకాశాలు కూడా గణనీయంగా పెరిగాయని ఆయన



పేర్కొన్నారు. మహా కుంభమేళా సమయంలో దాదాపు 1.26 కోట్ల మంది భక్తులు అయోధ్యను సందర్శించారని ఆయన గుర్తు చేశారు. గత ఏడాదిలో అయోధ్యకు 16 కోట్ల మంది సందర్శకులు రాగా, వారిలో 5 కోట్ల మంది శ్రీ రామ మందిరాన్ని దర్శించుకున్నారని రాయ్ తెలిపారు. ట్రస్ట్ యొక్క ఆర్థిక లావాదేవీలు మరియు రికార్డులను కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ అధికారులు ఎప్పటికప్పుడు పరిశీలిస్తారని ఆయన స్పష్టం చేశారు. అయోధ్యలో మతపరమైన పర్యాటకం అభివృద్ధి చెందడానికి , ఆలయ ట్రస్ట్ యొక్క పారదర్శక ఆర్థిక నిర్వహణకు ఈ భారీ పన్నుల చెల్లింపు ఒక ముఖ్యమైన ఉదాహరణగా నిలుస్తోంది. కాగా రామమందిర ప్రతిష్టాపన (ప్రాణ ప్రతిష్ఠ) 2024 జనవరి 22న జరిగింది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రత్యేక పూజలు చేసి బాలరాముడి విగ్రహాన్ని ప్రతిష్టించారు. ఈ వేడుకకు దేశ విదేశాల నుంచి అనేక మంది మత పెద్దలు, రాజకీయ నాయకులు , ప్రముఖులు హాజరయ్యారు. 2019లో సుప్రీంకోర్టు తీర్పుతో ఆలయ నిర్మాణానికి మార్గం సుగమం అయిన తర్వాత, అయోధ్యలో రామమందిర నిర్మాణాన్ని పర్యవేక్షించడానికి 2020లో శ్రీ రామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ ఏర్పాటైంది.


చురకలు

## సంపాదకీయం

# అమరావతికి అప్పు కాదు భారీ గ్రాంట్ ఇస్తారా ?

అమరావతి రాజధాని పునర్నిర్మాణ పనులకు మరోసారి దేశ ప్రధాని హోదాలో నరేంద్ర మోడీ వస్తున్నారు. ఆయన చేతుల మీదుగా ఏప్రిల్ 15న ఏకంగా 47 వేల కోట్ల అమరావతి రాజధాని పనులకు శ్రీకారం చుడతారు. ఈ నేపథ్యంలో ప్రధాని మోడీని ఆహ్వానించడానికి ముఖ్యమంత్రి చంద్రబాబు ఈ నెల 18న ఢిల్లీకి వెళ్తున్నారు. ఆయన బుధవారం ప్రధానితో భేటీ అయి అమరావతి రాజధాని సహా అనేక విషయాలు చర్చిస్తారు అని అంటున్నారు. అమరావతి రాజధాని అన్నది ఏపీ ప్రభుత్వానికి టాప్ ప్రయారిటీగా ఉంది. దాంతో ఈ విషయం మీద ఫుల్ ఫోకస్ పెడుతోంది. ఇక అమరావతి రాజధాని కోసం ప్రపంచ బ్యాంక్, ఆసియన్ బ్యాంక్ హడ్కో నుంచి పెద్ద ఎత్తున రుణాలు అయితే వస్తున్నాయి. వీటితో పాటు ఏపీ ప్రభుత్వం తన బడ్జెట్ లో ఆరేడు వేల కోట్ల రూపాయలు దాకా కేటాయించింది. వీటితో అమరావతి రాజధాని పనులు వేగంగా మొదలవుతాయని అంటున్నారు. ఒక నిర్దిష్ట కాలపరిమితి పెట్టుకుని అమరావతి రాజధాని నిర్మాణం కోసం ప్రభుత్వం చురుకుగా అడుగులు వేస్తోంది. 2028 నాటికి తొలి దశను పూర్తి చేయాలని గట్టి సంకల్పంతో ఉంది. అయితే అమరావతి రాజధానికి ప్రధాని హోదాలో నరేంద్ర మోడీ ఇప్పటికి పదేళ్ళ క్రితం 2015 అక్టోబర్ 22న వచ్చారు. శంకుస్థాపన చేశారు. ఆ రోజున విజయదశమి కూడా. దాంతో విజయవంతంగా రాజధాని పూర్తి అవుతుంది అని అంతా అనుకున్నారు. కానీ పెద్దగా ఏమీ కాకుండానే 2019లో టీడీపీ గద్దె దిగాల్సి వచ్చింది. ఇక అమరావతి రాజధాని విషయంలో టీడీపీ బిగ్ కాన్వాస్ మీద డిజైన్లు వేస్తోంది. అది లక్షల కోట్ల వ్యవహారంగా ఉంది అని అంటున్నారు. కేంద్రం అయితే తాము ఇవ్వాల్సింది ఎంతో అది మాత్రమే ఇస్తున్నామని అంటోంది. 2015 నుంచి 2019 మధ్యలో మౌలిక సదుపాయాల కల్పనకు కేంద్రం ఇచ్చింది గ్రాంట్ గా చూస్తే 2,500 కోట్ల రూపాయలు. వీటితో అసెంబ్లీ, హైకోర్టు సెక్రటేరియట్ ని నిర్మించుకోవాలని కేంద్రం ఇచ్చింది. ఇక ఈసారి మరో 1500 కోట్ల దాకా గ్రాంట్ గా ఇస్తున్నారని కేంద్ర వర్గాలు చెబుతున్నాయి. అంటే టోటల్ గా కేంద్రం నాలుగు వేల కోట్ల రూపాయలు మాత్రమే ఇస్తున్నాయని అర్థం అవుతోంది అని అంటున్నారు. కానీ అమరావతి రాజధాని పరిపూర్తికి లక్షల కోట్లు ఖర్చు అవుతున్న వేళ ఈ నిధులు ఏ మాత్రం అన్న చర్చ కూడా ఉంది. ఏపీకి రాజధాని లేకుండా విడగొట్టారు. అందువల్ల కేంద్రమే మంచి రాజధాని కట్టించి ఇవ్వాలి. విభజన హామీలలో కూడా అలాగే ఉంది. ఇక బీహార్ నుంచి జార?ండ్ విడిపోయినపుడు కానీ ఉత్తరప్రదేశ్ నుంచి ఉత్తరాఖండ్ వేరు అయినపుడు కానీ మధ్యప్రదేశ్ నుంచి చత్తీస్ ఘడ్ విడిపోయినపుడు కానీ కేంద్రమే కొత్త రాజధానులకు నిధులు ఇచ్చి నిర్మాణం చేసింది. ఏపీ విషయంలో భారీగా ఎందుకు గ్రాంట్ ఇవ్వదు అన్న చర్చ ఉంది. అదే సమయంలో ఏపీ ప్రభుత్వం కూడా అప్పులు ఇస్తే చాలు అన్నట్లుగా వ్యవహరించడం కూడా అంతా ఆలోచిస్తున్నారు. అమరావతి సెల్ఫ్ ఫైనాన్షియల్ క్యాపిటల్ అని అంటున్నారు. కానీ తెస్తున్న అప్పులు వాటికి అయ్యే వడ్డీలు తడిసి మోపెడు అవుతాయన్న ఆందోళన అయితే ఉంది.అదే సమయంలో అమరావతిలో మిగులు భూములు ఒక నాలుగు వేల వరకూ ఉంటాయని వాటిని అమ్మి అన్ని అప్పులు తీర్చేస్తామని చెబుతున్నారు. కానీ ఈ వడ్డీలకు ఆ భూముల పెరిగిన రేట్లకు బ్యాలెన్స్ అయితే ఒకే కానీ అలా కాకుండా తేడా వస్తే మాత్రం భవిష్యత్తు తరాల మీద అమరావతి రాజధాని అప్పుల భారం పెద్ద ఎత్తున పేరుకుపోతుందని అంటున్నారు నిపుణులు. ఈ నేపథ్యంలో కేంద్రం మీద ఒత్తిడి బాగా పెట్టి కనీసంగా పాతిక వేల కోట్లు అయినా అమరావతి రాజధాని కోసం కూటమి ప్రభుత్వం అడిగితే బాగుంటుంది అని అంటున్నారు. అప్పులు అంటే ఎప్పటికి అయినా తిప్పలే కాబట్టి కేంద్రం ఏపీ పరిస్థితి చూసి ఉదారంగా గ్రాంట్లు ఇస్తేనే ఏపీ బతికి బట్టకడుతుందని అంటున్నారు. కేంద్రంలో ఎన్డీయే ప్రభుత్వం ఏపీ ఎంపీల మీద ఆధారపడిన ఈ నేపథ్యంలో మోడీ ఏప్రిల్ 15న అమరావతికి వచ్చేటపుడు భారీ గ్రాంట్లు రాజధాని కోసం ఇస్తామని ప్రకటించేలా చూడాలని కోరుతున్నారు.


# కాకలు తీరిన కమ్యునిస్టు యోధుడు నంబూద్రిపాద్ - మార్చి 19...నంబూద్రిపాద్ వర్ధంతి



నంబూద్రిపాద్ భారతీయ కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాతల్లో ఒకరైన రాజకీయవేత్త, సిద్ధాంతకర్త, దేశ చరిత్ర లో గుర్తింపు పొందిన గొప్ప కమ్యూనిస్టు నాయకులు. భారత దేశంలో కాంగ్రెసేతర సంబంధిత కమ్యూనిస్టు పార్టీ పక్షాన ఎన్నికైన తొలి ముఖ్యమంత్రిగా విసుతి కెక్కారు. మార్క్స్ వాద సూత్ర బద్దుడు, విప్లవవాది, రచయిత, చరిత్ర కారుడు. మార్క్స్ వాద కమ్యూనిస్టు పార్టీ ఆచరణ వాదిగా, క్రియా శీలక నేతగా, 14 యేళ్ళ పాటు జాతీయ ప్రధాన కార్యదర్శిగా ఆయన తీసుకున్న చొరవ, ముందు చూపు గల నిర్ణయాలవలనే దేశంలో ఈనాడు జాతీయ స్థాయి సంకీర్ణ ప్రభుత్వ రాజకీయాలకు భూమిక అయిందన్న మాట వాస్తవం. నంబూద్రిపాద్ కేరళలో శ్రీకారం చుట్టిన మౌలికమైన భూ సంస్కరణలు, విద్యా సంస్కరణ లను అనుకరించే ప్రయత్నాలు ఈ నాటికి ఇతర భారతీయ రాష్ట్రా లలో జరుగుతూనే ఉన్నాయి. సాంప్రదాయ బ్రాహ్మణ కుటుంబ నేపథ్యం కలిగి ఉన్నా, భూస్వామి కుటుంబంలో పుట్టినా శ్రామిక వర్గ లక్ష్యాలకు అంకితమై శ్రామిక విప్లవ ఉద్యమంలో అగ్ర నాయకుడిగా ఎదిగారు. ఇఎంఎస్ నంబూద్రిపాద్ బహు ముఖ ప్రజ్ఞాశాలి, మార్క్సిస్టు రుషి, నిరంతర క్రియాశీలి. అవిశ్రాంత కలం యోధులు. సాహితీ విమర్శకులు. సాంస్కృతిక సైనికుడు. పాలనా చతురులు. సిద్ధాంత, ఆచరణల సంగమం. విప్లవ మేధావి. భావితరాలకు చెరగని ఆదర్శం. ఒకనాటి భారత రాష్ట్ర పతి కెఆర్ నారాయణన్ అభివర్ణించి నట్లుగా 20వ శతాబ్దపు మహోన్నత వ్యక్తి. ఇ.ఎం.ఎస్. అనే పేరుతో ప్రసిద్ధి కెక్కిన ఏలంకులం మనక్కల్ శంకరన్ నంబూద్రిపాద్, (1909 జూన్ 13 - 1998 మార్చి 19) 1909 జూన్ 13 నాడు, ప్రస్తుత మలప్పురం జిల్లా పెరింతాల్ మన్న తాలూకా ఏలంకుళం గ్రామంలోని అగ్ర బ్రాహ్మణ కుటుంబంలో జన్మించారు. తండ్రి పేరు పరమేశ్వరన్ నంబూద్రిపాద్. విద్యార్థి దశనుంచే జాతీయ భావాలు అలవరచు కున్నారు. స్వాతంత్ర్య పోరాటంలో ప్రముఖ పాత్ర వహించారు. చిన్న వయసులోనే ఆయన వి.టి.భట్టాద్రిపాద్ మొదలయిన పెద్దవారికి చేయూతగా, కేరళ నంబూద్రి కుటుంబాలలో పాతుకు పోయిన కులవివక్ష, సాంప్రదాయ వాదం ధోరణులకు వ్యతిరేకంగా పోరాడారు. చదువుకునే రోజుల్లో భారత జాతీయ కాంగ్రెస్ సహ చర్యంతో స్వాతంత్ర్య సంగ్రామంలో తీవ్ర కృషి చేసారు. 1931 లో కాలేజీని వదిలి స్వాతంత్ర్య పోరాటంలో చేరారు. సత్యా గ్రహ ఉద్యమంలో పాల్గొని జైలు శిక్ష అనుభవించారు. అప్పటినుంచి ఆయన దేశ స్వాతంత్ర్యం కోసం సాగిన కాంగ్రెస్ ఉద్యమంలో ముఖ్య పాత్ర పోషించారు. కేరళలో కాంగ్రెస్ సోషలిస్టు పార్టీ స్థాపకుల్లో ఒకరుగా ఉన్నారు. 1934 లో ఆయన కాంగ్రెస్ పార్టీ సోషలిస్టు పార్టీ అఖిల భారత ఉమ్మడి కాలంలో కాంగ్రెస్ పార్టీకి, కేరళ ప్రదేశ్ కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శిగా మార్క్సిజంతో పరిచయం చేశారు. 1936 లో కేరళలో కమ్యూనిస్టు పార్టీ వ్యవస్థాపక బృందాన్ని ఏర్పాటు చేసిన ఐదుగురు సభ్యుల్లో ఆయన ఒకరు. నంబూద్రిపాద్ కేరళలో ఒక శక్తివంతమైన కమ్యూనిస్టు ఉద్యమం అభివృద్ధికి పునాదులు వేశారు. సామ్రాజ్యవాద వ్యతిరేక పోరాటం, భూస్వామ్య వ్యతిరేక పోరాటం. రెండు పోరాటాలకు ఆయన ప్రాతినిధ్యం వహించారు. కేరళను ఏకీకృత భాషా రాష్ట్రంగా ఏర్పర్చడానికి దారితీసిన ఐక్య కేరళ ముఖ్య ప్రతిపాదకులలో ఆయన ఒకరు. నంబూద్రిపాద్ మొట్టమొదట 1939 లో మద్రాసు ప్రొవిన్షియల్ శాసనసభకు ఎన్నికయ్యారు. కమ్యూనిస్ట్ పార్టీని విస్తృత పరచడానికి ఆయన తన వాటాగా వచ్చిన ఆస్తిని పార్టీకి విరాళంగా ఇచ్చారు. అతను 1939-42 మరియు 1948-50 మధ్య అజ్ఞాతం లోకి వెళ్ళారు. ఆయన 1941 లో భారత కమ్యూనిస్టు పార్టీ సెంట్రల్ కమిటీకి ఎన్నికయ్యారు. డిసెంబరు, 1950 లో సిపిఐ పొలిట్ బ్యూరో సభ్యుడిగా, సెక్రటేరియట్ సభ్యునిగా పనిచేశారు. 1957 లో కేరళ రాష్ట్రం ఏర్పడిన తరువాత జరిగిన మొదటి ఎన్నిక లలో కమ్యూనిస్ట్ పార్టీ మెజారిటీ సాధించడంతో 1957 ఏప్రిల్ 5 నాడు కేరళ రాష్ట్ర ప్రథమ ముఖ్య మంత్రిగా పగ్గాలు చేపట్టి భారత దేశంలో మొట్టమొదటి కమ్యూనిస్ట్ ముఖ్యమంత్రిగా రికార్డులకెక్కారు. త్వరలోనే భూ సంస్కరణల చట్టాన్ని,విద్యా చట్టాన్ని తీసుకు వచ్చారు. వివాదాస్పదమైన పరిస్థితి లో 1959 లో కేంద్ర ప్రభుత్వం, భారత రాజ్యాంగం లోని 356 వ ప్రకరణం అనుసరించి రాష్ట్రపతి పాలన విధిస్తూ ఆ ప్రభుత్వాన్ని కూల్చి వేసింది. కేరళ శాసన సభకు 1960-64, తిరిగి 1970-77 కాలం లో ప్రతిపక్ష నాయకునిగా వ్యవహరించారు. 1967 లో రెండవసారి ముఖ్యమంత్రి కావడానికి నంబూద్రిపాద్ ముస్లిమ్ లీగ్ తో సహా 7 పార్టీల మద్దతు స్వీకరించారు. 1964 లో సిపిఐ (ఎం) ను స్థాపించిన తరువాత ఉమ్మడి కమ్యూనిస్టు పార్టీ నుండి అందులో చేరారు. 1964 లో జరిగిన అఖిల భారత మహాసభలో పార్టీలో కేంద్ర కమిటీ మరియు పార్టీ పొలిట్ బ్యూరోకు ఎన్నికయ్యారు. ఆయన మరణం వరకు ఈ పదవిలో కొనసాగారు. 1977 లో కమ్యూనిస్ట్ పార్టీ ఆఫ్ ఇండియా (మార్క్సిస్టు) ప్రధాన కార్యదర్శిగా పదవిని చేపట్టి 1992 వరకు ఆ బాధ్యతలను నిర్వహించారు. అన్ని వామపక్ష, ప్రజాస్వామ్య, లౌకిక శక్తులను సమీకరణ చడంలో ఆయన నాయకత్వం అమూల్యమైనది. ఒక తెలివైన మార్క్సిస్ట్ సిద్ధాంత కర్తగా, భారతీయ సమాజంలో ఉన్న వాస్తవాలకు అనుగుణంగా మార్క్సిజం - లెనినిజం అన్వయించడంతో పాటు భారతీయ విప్లవం యొక్క వ్యూహానికి అనుగుణంగా సాగించాల్సిన, సాగించిన కృషిని ఆయన రచించారు. ఆయన వ్రాసిన పలు గ్రంథాలలో కేరళ చరిత్ర అనే పుస్తకం బహుళ ప్రాచుర్యం పొందింది. భూమి సంబంధాలు, కేరళ, సహజం, రాజకీయాలు, మార్క్సిస్టు తత్వశాస్త్రం, సాహిత్యం మరియు చరిత్రలపై ఆయన వ్రాసిన రచనల తో ఆయనను దేశంలోనే గాక ప్రపంచంలోనే అత్యంత ప్రభావ వంతమైన కమ్యూనిస్టు ఆలోచనా పరులలో ఒకరిగా గుర్తించ బడ్డారు. విశిష్ట మార్క్సిస్ట్ సూత్రవేత్త, బహుముఖ ప్రజ్ఞాశాలి, ఆయన ముందు చూపుకు నిజాయితీ నిబద్ధతలకు కేరళ సాధించిన అభివృద్ధే తార్కాణం. ప్రజల యోజన ద్వారా కేరళలో అధికార, వనరుల వికేంద్రీకరణకు, అక్షరాస్యతా ఉద్యమానికి కృషి చేసారు. ఆంగ్ల, మలయాళ భాషల్లో అనేక పుస్తకాలు రచించిన నంబూద్రిపాద్ పత్రికా విలేఖరిగా కూడా సుపరిచితులే. ఈ నాటికీ కేరళలో ఆయన పేరు, ఒకప్పటి ఆయన ప్రభుత్వ పనితీరుల గురించి దినదినం గొప్పగా చెప్పుకుంటూనే ఉంటారు. నంబూద్రిపాద్ 1998 మార్చి 19 న మరణించారు.

**రామ కిష్టయ్య సంగన భట్ల - 9440595494**

# మాడభూషి జీవితం... నేటి తరానికి ఆదర్శం - మార్చి 19...మాడభూషి అనంత శయనం అయ్యంగార్ వర్ధంతి




M. A. Ayyangar
8 March 1956 – 16 April, 1962

మాడభూషి అనంత శయనం అయ్యంగార్ ప్రముఖ న్యాయవాదిగా, సామాజిక కార్యకర్తగా, స్వాతంత్ర్య సమర యోధుడుగా, అత్యుత్తమ పార్లమెంటు సభ్యుడిగా, వక్తగా, విశిష్ట పండితుడిగా, లోకసభ స్పీకర్ గా, పాత తరానికి చెందిన జాతీయ నాయకులలో విశిష్ట స్థానం దక్కించు కున్నారు. అయ్యంగార్ 1891 ఫిబ్రవరి 4 న ఆంధ్రప్రదేశ్ లోని ఆధ్యాత్మిక పట్టణం తిరుపతి సమీపంలో తిరుచనూరులో జన్మించారు. తిరుపతిలోని దేవస్థానం ఉన్నత పాఠశాలలో ప్రారంభ విద్యను పూర్తి చేసి, ఉన్నత చదువుల కోసం మద్రాసుకు వెళ్లారు. మద్రాసులోని పచయ్యప్ప కళాశాల నుండి బిఎ పట్టా పొందిన తరువాత, 1913 లో మద్రాస్ లా కాలేజీ నుండి న్యాయశాస్త్రంలో పట్టా పొందారు.1912 లో గణిత విషయ ఉపాధ్యాయుడిగా నియుక్తులై, 1915లో న్యాయవాద వృత్తిలోకి ప్రవేశించారు. స్వల్ప వ్యవధిలో, ఒక ప్రొఫెషనల్ న్యాయవాదిగా, అసాధారణ సామర్థ్యంతో ఖ్యాతిని పొందారు. జీవనోపాధిని సంపాదించే సాధనంగా మాత్రమే న్యాయవాద వృత్తిని చూడక, భారత ప్రజల అవసరాలకు అనుగుణంగా దేశ న్యాయ వ్యవస్థను మెరుగు పరచడంలో ఆసక్తి చూపారు. అయ్యంగార్ చాలా చిన్న వయస్సులోనే స్వాతంత్ర్య ఉద్యమంలోకి ప్రవేశించారు. తన సొంత రాష్ట్రంలోనే, బ్రిటిష్ వలస వాదానికి వ్యతిరేకంగా జాతీయ ఉద్యమానికి నాయకత్వం వహిస్తున్న ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ ప్రముఖ వ్యక్తులలో ఒకరిగా ఎదిగారు. కాంగ్రెస్ పార్టీ, ప్రభుత్వంలో ఉండి, పోరాడటమే లక్ష్యంగా, 1934 లో కేంద్ర శాసనసభ ఎన్నికలలో పోటీ చేయాలని నిర్ణయించు కున్నప్పుడు, అయ్యంగార్ అధిక మెజారిటీతో సభకు ఎన్నికయ్యారు. వాస్తవాలు మరియు గణాంకాలతో అతని సహజమైన చర్చా నైపుణ్యాల ద్వారా, అయ్యంగార్ త్వరలోనే అసెంబ్లీలో తన వాదనా పటిమతో తనదైన ముద్ర వేశారు. మొదట వ్యక్తిగత సత్యాగ్రహ ప్రచారంలో తరువాత 1942 'క్విట్ ఇండియా ఉద్యమంలో' పాల్గొన్నందుకు 1940, 1944 మధ్య అయ్యంగార్ దాదాపు మూడు సంవత్సరాలు జైలు శిక్ష అనుభవించారు. రాజకీయ స్వేచ్ఛ కోసం ఉద్యమంలో చురుకుగా పాల్గొనడమే కాకుండా, సమాజం లోని అణగారిన వర్గాల, సామాజిక విముక్తి దిశగా, నిర్దేశించిన వివిధ కార్యకలాపాలలో అయ్యంగార్ పాల్గొన్నారు. అంటరాని సామర్థ్యం వంటి సామాజిక చెడులతో పోరాడటానికి గాంధీజీ నిర్మాణాత్మక కార్యక్రమాల నుండి ప్రేరణ పొందిన అయ్యంగార్, హరిజనులకు ఆలయ ప్రవేశం, అంటరాని తనం నిర్మూలన కోసం ఉద్యమాలలో ముందంజలో ఉన్నారు. తరువాత, హరిజన్ సేవక్ సంఘ అధ్యక్షుడిగా తమ సామర్థ్యంలో, హరిజనుల ఆర్థిక, సామాజిక అభ్యున్నతి కోసం అనేక కార్యక్రమాలను చేపట్టారు. ఆయన మొట్టమొదటి సారిగా చిత్తూరు మున్సిపల్ కౌన్సిల్ కు ఎన్నిక అయ్యారు. తరువాత, చిత్తూరు కో - ఆపరేటివ్ డిస్ట్రిక్ట్ బ్యాంక్ డైరెక్టర్‌గా ఎన్నికయ్యారు. చిత్తూరు జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడిగా పనిచేశారు. అనంతరం ఆంధ్ర ప్రావిన్షియల్ కాంగ్రెస్ కమిటీ, అఖిల భారత కాంగ్రెస్ కమిటీకి ఎంపిక అయినారు. 1946-47 మధ్య కాలంలో పార్లమెంటులో కాంగ్రెస్ పార్టీ కార్యదర్శిగా కూడా పని చేశారు. రాజ్యాంగ అసెంబ్లీ సభ్యునిగా పని చేశారు. జి.వి.మవలంకర్‌ను రాజ్యాంగ అసెంబ్లీ (శాసనసభ) స్పీకర్‌గా ఎన్నుకున్న నేపథ్యంలో, అయ్యంగార్‌ను దాని డిప్యూటీ స్పీకర్‌గా ఎంపిక చేశారు. రాజ్యాంగ అసెంబ్లీ స్టీరింగ్ కమిటీలో కూడా పని చేశారు. 1950-52 మధ్య కాలంలో అయ్యంగార్ తాత్కాలిక పార్లమెంటు డిప్యూటీ స్పీకర్‌గా కొనసాగారు. 1950 లో తాత్కాలిక పార్లమెంట్ మొదటి అంచనా కమిటీకి ఛైర్మన్‌గా ఎంపికయ్యారు. సమావేశాలను నైపుణ్యంగా నిర్వహించారు. అయ్యంగార్ గొప్ప, సమర్థ వంతమైన పార్లమెంటు సభ్యుడని నిరూపించు కున్నారు. పార్లమెంటరీ నిబంధనలను నిలబెట్టడానికి కట్టుబడి ఉన్నారు. 1957 లో రెండవ లోక్‌సభ ఏర్పడినప్పుడు, అయ్యంగార్ ఐదేళ్లపాటు ఆయనను స్పీకర్‌గా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. వాయిదా తీర్మానాలు, బిల్లులు, తీర్మానాలు, స్టాండింగ్ కమిటీలు, కాలింగ్ అటెన్షన్ నోటీసులు మొదలైన వాటిపై అయ్యంగార్ పద్ధతి అనుసరణీయంగా మారింది. 1960 లో టోక్యోలో జరిగిన 49 వ ఇంటర్ పార్లమెంటరీ సమావేశానికి భారత పార్లమెంటరీ ప్రతినిధి బృందానికి నాయకుడిగా పనిచేసిన ఆయన, భారతదేశం లోని శాసనసభల ప్రిసైడింగ్ అధికారుల సమావేశాల నిర్వహణలో ఆసక్తి చూపారు. 1962 సార్వత్రిక ఎన్నికలలో అయ్యంగార్ మూడవ సారి లోక్‌సభకు ఎన్నికైనా, బీహార్ గవర్నర్‌గా పనిచేయడానికి వీలుగా ఆయన సభ్యత్వానికి రాజీనామా చేశారు. దాదాపు మూడు దశాబ్దాల విశిష్ట పార్లమెంటరీ జీవితంలో ప్రత్యేక గుర్తింపు పొందారు. రాజకీయ జీవితాన్ని విడిచిపెట్టిన తరువాత, హరిజన్ సేవక్ సంఘ్, రామ్ విలాస్ సభ, చిత్తూరు డ్రామాటిక్ అసోసియేషన్స్, కాన్స్టిట్యూషన్ క్లబ్, ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ వరల్డ్ ఫెడరల్ గవర్నమెంట్ తదితర సామాజిక - సాంస్కృతిక, విద్యా సంస్థలతో సంబంధం కొనసాగించారు. పార్లమెంటరీ జీవితం తరువాత, తన జీవితాంతం అయ్యంగార్ ఫిలాసఫీ, సంస్కృత సాహిత్యం, భారతీయ సంస్కృతి అధ్యయనం ప్రచారం పట్ల ఆయన ఎంతో ఆసక్తి చూపారు. కొంతకాలం సెంట్రల్ అడ్వైజరీ బోర్డ్ ఆఫ్ ఎడ్యుకేషన్ సభ్యుడిగా, రిషికుల్ విశ్వ విద్యాలయ ఛాన్సలర్‌గా పనిచేశారు. భారత పార్లమెంటుపై ఒక పుస్తకాన్ని కూడా రాశారు. మతాలు ప్రధానంగా మనిషికి, మనిషికి మధ్య ఉన్న తేడాలను తొలగించడానికి, మనిషిలో సోదర భావనను పెంపొందించ డానికి తద్వారా అతన్ని ఉద్ధరించడానికి సహాయపడతాయని నమ్మారు. అయ్యంగార్ ప్రకారం, ఉన్నత కులం లేదా తక్కువ కులం వంటివి ఏవీ లేవు, కానీ ఉన్నత చైతన్యం, తక్కువ చైతన్యం మాత్రమే ఉన్నాయి, ఈ రెండింటికి పుట్టుకతో సంబంధం లేదు. పుట్టుక ప్రాతిపదికన ఆరాధన హక్కును తిరస్కరించడం దైవత్వానికి వ్యతిరేకంగా చేసిన నేరం అని నమ్మారు. ఈ నమ్మకమే హిందూ దేవాలయాల లోకి ప్రవేశించాలన్న దళితుల వాదనకు మద్దతు ఇవ్వడానికి అతన్ని ప్రేరేపించింది. బీహార్ గవర్నర్‌గా పూర్తి కాలం పనిచేసిన తరువాత, శేష జీవితం గడపడానికి తన స్వగ్రామమైన తిరుపతికి తిరిగి వచ్చి, అయ్యంగార్ 1978 మార్చి 19 న తన 87 వ ఏట చివరి శ్వాస తీసుకునే వరకు సేవలు అందించారు. నిబద్ధత కలిగిన వ్యక్తిగా చరిత్రలో నిలిచారు.

**రామ కిష్టయ్య సంగన భట్ల - 9440595494**

# సుదీర్ఘ రాజకీయ అనుభవశాలి కృపలానీ - మార్చి 19... ఆచార్య కృపలానీ వర్ధంతి



ఆచార్య జె. బి. కృపలానీ (1888-1982) సుప్రసిద్ధ భారతీయ రాజకీయ నాయకుడు, గాంధేయవాది, సోషలిస్టు, పర్యావరణవేత్త , స్వాతంత్ర్య సమరయోధుడు, చరిత్రకారుడు, పండితుడు, ఉపాధ్యాయుడు, రచయిత, మహాత్మా గాంధీ తొలి సహచరులు. గాంధీకి అత్యంత సన్నిహితులలో ఒకనిగా పేరు గాంచారు. 1947 భారత దేశానికి స్వాతంత్ర్యం వచ్చినపుడు భారత జాతీయ కాంగ్రెసు అధ్యక్షునిగా ఉన్నారు. 1951, 1957, 1963, 1967 లో లోక్ సభ సభ్యులుగా ఎన్నికయ్యారు. కృపలానీ ఆపద్ధర్మ భారత ప్రభుత్వము (1946-1947) లోనూ, భారత రాజ్యాంగ సభలోనూ పనిచేశారు. ఆచార్య కృపాలనీ నాటి సింధు (నేటి పాకిస్తాన్) ప్రాంతంలోని హైదరాబాదులో 1888లో జన్మించారు. అతని పూర్వీకులు గుజరాతీ , సింధీ సంతతులకు చెందినవారు. కరాచి డి.జె.సైన్సు కళాశాలలో, ఆయన రాజకీయాలలో చురుగ్గా పాల్గొంటున్నందుకు కళాశాల నుంచి బహిష్కరించారు. కృపలానీ పూణేలోని ఫెర్గూసన్ కాలేజీ నుండి చరిత్ర, ఆర్థిక శాస్త్రంలో మాస్టర్స్ డిగ్రీ చేసి 1912 లో బోధన ప్రారంభించారు. గాంధీ దక్షిణ ఆఫ్రికా నుండి వచ్చిన తరువాత స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొన్నారు. ఉపాధ్యాయులుగా ఉన్న సమయం లోనే ఆయనకు మొదటి సారి గాంధీని కలిశారు. గాంధీని కలిసిన తరువాత కృపాలని కాంగ్రెస్ పార్టీలో చేరారు. గుజరాత్, మహారాష్ట్ర, బీహార్లలో గాంధీ ఆశ్రమాలలో పని చేశారు. కృపలానీ 1920వ దశకపు తొలి నాళ్ళలో సహాయ నిరాకరణ ఉద్యమంలో పాల్గొన్నారు. గుజరాత్, మహా రాష్ట్ర లోని గాంధీ ఆశ్రమాలలో సంఘ సంస్కరణ , విద్యా సంబంధ విషయాలపై కృషి చేశారు. ఆ తరువాత ఉత్తర భారత దేశంలోని బీహార్ , సంయుక్త రాష్ట్రాలలో అదే తరహా ఆశ్రమాలు స్థాపించి బోధించడానికి వెళ్ళారు. పౌర నిరసనోద్యమం లోనూ , ఇతర అనేక చిన్న సందర్భాలలోనూ బ్రిటీషు పాలనకు వ్యతిరేకంగా నిరసన ప్రదర్శనలను నిర్వహించిన, ఉద్రేకపూరిత సాహిత్యాన్ని ప్రచురించిన అనేక సందర్భాలలో కృపలానీ జైలుకు వెళ్ళారు. 1922 నుండి 1927 వరకు గాంధీ స్థాపించిన అహ్మదాబాద్‌లోని గుజరాత్ విద్యాపీఠ్ ప్రిన్సిపాల్‌గా పని చేశారు. ఆచార్య అనే బిరుదును పొందారు. కృపలానీ అఖిల భారత కాంగ్రెసు కమిటీలో చేరి 1928-29లో దాని ప్రధాన కార్యదర్శి అయ్యాడు. ఒక దశాబ్దము పైగా కాంగ్రెస్ పార్టీ అత్యున్నత స్థాయి కార్యకలాపాలలో చురుగ్గా పాల్గొన్నారు. ఉప్పు సత్యాగ్రహం, క్విట్ ఇండియా ఉద్యమ నిర్వహణలో ప్రధానపాత్ర పోషించారు. 1934-1935 మధ్య కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శిగా కూడా పని చేశారు. తరువాత 1946 లో పార్టీ అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. సైద్ధాంతికంగా వల్లభ్ భాయి పటేల్‌తోనూ, జవహర్ లాల్ నెహ్రూ తోనూ విరుద్ధముగా ఉన్నప్పటికీ, కృపలానీ 1947లో భారత స్వాతంత్ర్యానికి అటునిటు క్లిష్టమైన సంవత్సరాలలో జాతీయ కాంగ్రెస్ అధ్యక్షులుగా ఎన్నికయ్యారు. 1948 జనవరిలో గాంధీ హత్య తర్వాత, అన్ని ప్రభుత్వ నిర్ణయాలలో పార్టీ యొక్క అభిప్రాయాలను పరిగణన లోకి తీసుకోవాలన్న కృపలానీ కోరికను నెహ్రూ తోసిరాజన్నారు. నెహ్రూ, పటేల్ మద్దతును కూడగట్టుకొని, “పార్టీకి విస్తృతమైన మార్గ దర్శకాలు, మూల సూత్రాలను నిర్దేశించే అధికారము కలిగి ఉన్నా, ప్రభుత్వ దైనందిన వ్యవహారాలలో కలుగ జేసుకొనే అధికారాన్ని పార్టీకి ఇవ్వలేమని” కృపలానీకి సమాధాన మిచ్చారు. సదరు పూర్వ ప్రమాణమే ఆ తర్వాత దశాబ్దాలలో ప్రభుత్వము , పాలక పార్టీ యొక్క సంబంధానికి కేంద్ర హేతువు అయ్యింది. గాంధీ ఆశయమైన గ్రామ స్వరాజ్యానికి తిలోదకాలు ఇచ్చారన్న ఆరోపణతో కాంగ్రెస్ పార్టీని విడిచి, కిసాన్ మజ్దూర్ ప్రజాపార్టీ యొక్క సంస్థాపకుల్లో ఒకరైనారు. ఆ పార్టీ ఆ తరువాత సోషలిస్టు పార్టీ ఆఫ్ ఇండియాలో విలీనమై ప్రజా సోషలిస్టు పార్టీగా అవతరించింది. కృపలానీ తన రాజకీయ శేష జీవితమంతా ప్రతిపక్షము.లోనే గడిపారు. 1938 నుండి ఆయన భార్య సుచేతా కృపలానీ, కాంగ్రెసు పార్టీలో అంచెలంచెలుగా ఎదిగి కేంద్ర మంత్రివర్గములో అనేక మార్లు మంత్రి పదవులతో సహా అనేక ఉన్నత పదవులు పొందారు. ఆమె దేశము లోనే మొట్టమొదటి మహిళా ముఖ్యమంత్రిగా ఉత్తర ప్రదేశ్ లో ప్రమాణ స్వీకారం చేశారు. కృపలానీ 1963 ఆగస్టులో భారత - చైనా యుద్ధం ముగియగానే నెహ్రూ ప్రభుత్వముపై లోక్ సభలో మొట్ట మొదటి అవిశ్వాస తీర్మానాన్ని ప్రవేశ పెట్టారు. సమాజిక , పర్యావరణ విషయాలపై పనిచేస్తూ కృపలానీ జీవితాంతము నెహ్రూ, ఇందిరల పాలనా, విధానాల విమర్శకునిగా మిగిలి పోయారు. క్రియాశీలక ఎన్నికల రాజకీయాల్లో కొనసాగుతూనే, కృపలానీ క్రమేణ రాజకీయ నాయకుడిగా కంటే కమ్యూనిస్టుల ఆధ్యాత్మిక గురువుగా పరిణతి చెందారు. ముఖ్యంగా వినోబా భావేతో పాటు కృపలానీని అంతరించి పోతున్న గాంధేయవాదుల వర్గానికి నాయకులుగా భావిస్తారు. 1970 లలో వినోభా భావేతో పాటు ఈయన అనేక పరిరక్షణ , సంరక్షణా కార్యకలాపాల్లో క్రియాశీలకంగా పనిచేశారు. జవహర్‌లాల్ నెహ్రూ, ఆయన కూతురు ఇందిరా గాంధీ పాలనలను విమర్శించారు. ఆయా పాలనకు గ్రామీణ గణతంత్రాల, గాంధేయ ఆదర్శానికి విరుద్ధంగా ఉందని భావించారు. 1972-73లో, కృపలానీ, జయ ప్రకాశ్ నారాయణ్‌లు ఇందిరా గాంధీ పాలన నియంతృత్వంగా, ప్రజాస్వామ్య వ్యతిరేకంగా ఉందని భావించి, ప్రధాని ఇందిర పాలనపై నిరసన ధ్వజమెత్తారు. ఎన్నికల ప్రచారంలో ప్రభుత్వ యంత్రాగాన్ని ఉపయోగించు కుందన్న అభియోగము న్యాయ స్థానములో నిర్ధారణ కావడంతో, రాజకీయ ప్రతిపక్షాలు ఆమెకు వ్యతిరేకంగా మరింత ముందుకు సాగాయి. జయప్రకాష్ నారాయణ్‌తో పాటు, 1972-73లో ఇందిరా గాంధీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా అహింసాత్మక నిరసన, శాసనోల్లంఘనను కోరుతూ కృపాలాని భారతదేశంలో పర్యటించారు. 1975లో అత్యయిక పరిస్థితిని విధించినప్పుడు పెద్ద ఎత్తున నిరసన రేపడానికి కారకులు అయినారనే నెపంతో, జూన్ 26, 1975 రాత్రి అరెస్టు చేయబడిన మొట్ట మొదటి ప్రతిపక్ష నాయకుల్లో 80 యేళ్ళు పైబడిన కృపలానీ ఒకరు. ఎమర్జెన్సీ అంతం కావడం, 1977 ఎన్నికల్లో జనతా పార్టీ గెలుపొంది స్వాతంత్ర్యానంతరం మొట్ట మొదటి సారిగా ఒక కాంగ్రెసేతర ప్రభుత్వం నెలకొల్పటం చూడటానికి కృపలానీ జీవించే ఉన్నారు. లోహియా గాంధేయ తత్వ శాస్త్రాలపై కొన్ని పుస్తకాలు కూడా రాశారుబీ “అహింసా విప్లవం”, “గాంధేయ వే”, “ది ఇండియన్ నేషనల్ కాంగ్రెస్”, “ది ఫేట్ఫుల్ ఇయర్స్”, “ది పాలిటిక్స్ ఆఫ్ చక్ర”, “ది ఫాదర్ ఆఫ్ ది కాంగ్రెస్”, “గాంధేయ విమర్శ” ముఖ్యమైనవి. కృపలానీ 94 యేళ్ళ వయసులో 1982, మార్చి 19న మరణించారు. **రామ కిష్టయ్య సంగన భట్ల - 9440595494**

# దివ్యాంగులకు చేయూత అందించడం మానవ ధర్మం

అంతర్జాతీయ వికలాంగుల దినోత్సవం ప్రతి సంవత్సరం మార్చి 3వ ఆదివారం నిర్వహించడం ఆనవాయితీగా ఉండేది. రాజకీయ, సామాజిక, ఆర్థిక, సాంస్కృతిక పరంగా వికలాంగులు ఎదుగుదలను ప్రోత్సహించేలా ఈ దినోత్సవంను జరుపుకునే వారు. గతంలో యుద్ధాలలో వికలాంగులైన సైనికులు మాత్రమే ప్రతి సంవత్సరము మార్చి 3వ ఆదివారము నాడు వికలాంగుల దినోత్సవము జరుపుకునేవారు. దానిని ఐక్యరాజ్య సమితిలో ఆమోదించి అన్ని రకాలుగా వికలాంగులైన వారందరు ప్రపంచ యావత్తు ఈ వేడుకలను నిర్వహించు కోవాలని ప్రతి సంవత్సరము మార్చి 3వ ఆదివారాన్ని “ప్రపంచ వికలాంగుల దినోత్సవము”గా ప్రకటించ బడినది. అలాగే 1981 సంవత్సరాన్ని అంతర్జాతీయ వికలాంగుల సంవత్సరముగా ఐక్యరాజ్య సమితి ప్రకటించటం, ఆ సంవత్సరములో ఎన్నో కార్యక్రమాలు రూపొందించడం జరిగింది. వికలాంగులకు సమాన అవకాశాలు, హక్కులు కలిపించి వారందరిని సమాజ అభివృద్ధిలో భాగం చేయాలనే లక్ష్యంతో 1976లో ఐక్యరాజ్య సమితి 1981 సంవత్సరాన్ని అంతర్జాతీయ వికలాంగుల సంవత్సరంగా ప్రకటించింది. అలాగే, 1983 నుండి 1992 వరకు ఐక్యరాజ్య సమితి వికలాంగుల దశాబ్దంగా ప్రకటించింది. ఎన్నో వర్గాల వారికి అనగా కార్మికులకు మేడే - మే 1వ తేదీన, పిల్లలకు చిల్డ్రన్ స్డే నవంబర్ 14వ తేదీన, మహిళలకు ఉమెన్స్ డే మార్చి 8వ తేదీన చివరకు ప్రేమికులకు వాలెంటైన్స్ డే ఫిబ్రవరి 14వ తేదీన ఇలా ప్రతిదానికి ఒక నిర్దిష్టమైన తేది ఉంటే వికలాంగులకు మాత్రం నిర్దిష్ట మైన తేదీ లేకుండేది. మార్చి 3వ ఆదివారం “ప్రపంచ వికలాంగుల దినోత్సవము” జరుపడం వలన ప్రతి సంవత్సరము ఏదో ఒక తేదీన రావడం వలన ఫలాన తేది నాడు వికలాంగుల దినోత్సవము అని గుర్తించ లేకపోవడం జరిగినది. ఈ విషయమై 1994వ సంవత్సరము మొదటిలోనే ఐక్యరాజ్య సమితిలో మరొక పర్యాయం చర్చించి మార్చి 3వ ఆదివారం నాడు జరుపుతున్న “ప్రపంచ వికలాంగుల దినోత్సవాన్ని” 1994 నుండి డిసెంబర్ 3వ తేదీనాడు “అంతర్జాతీయ వికలాంగుల దినోత్సవముగా” జరపాలని ప్రకటించ బడినది. ఆ నాటి నుండి అంతర్జాతీయ వికలాంగుల దినోత్సవ వేడుకలు ప్రతి సంవత్సరము డిసెంబర్ 3వ తేదీనాడు యావత్తు ప్రపంచములో నిర్వహించ బడుచున్నవి. 1995 వికలాంగుల హక్కుల చట్టం వచ్చినప్పటి నుండి వికలాంగుల సంక్షేమము మరియు అభివృద్ధి కై పలు పథకాలు ప్రవేశ పెట్టబడినవి. వికలాంగుల సమస్యలను పరిష్కరించి వారికి ఆసరానిచ్చి, వారు గౌరవంగా జీవిస్తూ సాధారణ జనజీవనంలో భాగమై అన్ని హక్కులు పొందేలా చూడడంకోసం 1992లో ఐక్యరాజ్య సమితి ఆధ్వర్యంలో ఈ దినోత్సవం మొదలై,1998 నుండి ప్రతి సంవత్సరం వికాలాంగులకు సంబంధించిన ఒక అంశంతో అన్ని దేశాలు ఈ దినోత్సవాన్ని జరుపు కుంటున్నాయి. ఆంధ్రప్రదేశ్ లో 1981లో ఆంధ్రప్రదేశ్ వికలాంగుల సహకార సంస్థ ఏర్పాటు చేయడం, తరువాత 1983లో వికలాంగుల సంక్షేమ శాఖను ఏర్పాటు చేయడం జరిగింది. వాస్తవానికి ఆంగ్ల భాషలో హ్యాండి క్యాప్ డ్, డిజేబుల్డ్, ఫిసికల్లీ ఛాలెంజ్డ్ అని రక రకాల పదాలు వాడుతున్నా, తెలుగులో అంగవికలులను “వికలాంగులు'' కాకుండా “దివ్యాంగులు”గా పేర్కొనడం సమంజసంగా భావించి, సాధ్యమైనంత వరకూ వికలాంగులు అనే పదం వాడుక భాషలో తీసేసి, అలాగే దివ్యాంగులు పదమే వాడుతున్నారు. సమాజంలోని దివ్యాంగుల పట్ల స్వాభావిక గౌరవం, వ్యక్తిగత స్వయం ప్రతిపత్తి, వివక్షత లేని సమాజం, అవకాశాల సమానత్వం, అవరోధ రహిత వాతావరణం నిర్మాణం కొరకు, దివ్యాంగుల హక్కులకు కలుగ జేయడానికి కేంద్ర ప్రభుత్వం 2016లో దివ్యాంగుల హక్కుల చట్టాన్ని రూపొందించింది. దీన్ని రాష్ట్ర స్థాయిలో అమలు చేయడానికి గత తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంది. తెలంగాణ రాష్ట్ర దివ్యాంగుల హక్కుల నియమాలు 2018లో రూపొందించారు. ఈ చట్టంలో భాగంగా దివ్యాంగులకు అన్ని రంగాలలో సమానత్వం కల్పించడానికి ప్రత్యేక హక్కులతో పాటు 5% రిజర్వేషన్ కల్పించారు. వారి స్వాలంబనకై తెలంగాణ రాష్ట్రం లో తెలంగాణ ప్రభుత్వం ఏ రాష్ట్రంలో లేని విధంగా సుమారు ఏడు లక్షల 30 వేల దివ్యాంగులకు ప్రతి నెల మూడు వేల పదహారు రూపాయలు పెన్షన్లు ఇవ్వడం జరుగుతున్నది. అలాగే వారికి ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థల్లో వెళ్లడానికి అవరోధ రహిత వాతావరణం కల్పించుటకు, అన్ని సంస్థల్లో ర్యాంపులు నిర్మాణమే గాక అచట దివ్యాంగులు ఉపయోగించుకునే మూత్రశాలలు, వీల్ చైర్ లు ఏర్పాటు చేయడానికి ఈ చట్టం వీలు కల్పించింది. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం దివ్యాంగులు ఆర్థిక స్వయం ప్రతిపత్తి సాధించడానికి స్వయం ఉపాధి పథకం కింద 60 శాతం నుంచి 80 శాతం వరకు సబ్సిడీతో రుణాలు మంజూరు చేయడం జరుగుతున్నది.ప్రస్తుతం పెరుగుతున్న సాంకేతికను జోడించి అనేక అభివృద్ధి చెందిన ఉపకరణాలను కూడా అందజేయడం జరుగుతున్నది. **రామ కిష్టయ్య సంగన భట్ల - 9440595494**

# గడ్డి చూపింది.. గట్టి ఉపాధి

కడెం : వారు కడెం ప్రాంత యువకులు.. ఉపాధి అవకాశాలు వెతుక్కుంటూ వివిధ ప్రాంతాలు తిరిగారు. ముంబయి, దుబాయి, హైదరాబాద్ తదితర ప్రాంతాల్లో కొద్దికాలం దొరికిన పని చేశారు. కానీ అది ఎటూ సరిపోవడం లేదు. మెరుగైన ఉపాధి కోసం అన్వేషిస్తుండగా అనుకోని రీతిలో వీరికో అవకాశం అందివచ్చింది. దాన్ని ఉపాధి మార్గంగా ఎంచుకుని లాభసాటి వ్యాపారంగా మార్చుకున్నారు. అదే గోధుమ గడ్డి జ్యూస్ విక్రయం. అందులోని పోషక విలువలు ఆరోగ్యానికి మేలు చేస్తాయని వైద్యులు సూచిస్తుండడంతో ఈ జ్యూస్‌కు ఆదరణ పెరిగింది. హైదరాబాద్‌తో పాటు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా, జగిత్యాల జిల్లాల్లో ఇక్కడి యువకులు విక్రయ కేంద్రాలను నడుపుతున్నారు.

**నిర్మల్‌లో ఇద్దరు..**

ఉపాధి నిమిత్తం విదేశాలకు వెళ్లి నిరాశతో తిరిగి వచ్చిన కడెం మండలం చిట్యాలకు చెందిన బోరె వెంకటేష్, ధర్మాజి తిరుపతి హైదరాబాద్‌లో రాపల్లి సత్యం జ్యూస్ సెంటర్ గురించి తెలుసుకుని ఆయనను సంప్రదించారు. ఆయన సూచనలతో నిర్మల్‌లో గోధుమ గడ్డి జ్యూస్ కేంద్రాలను ఏర్పాటు చేసుకుని ఉపాధి పొందుతున్నారు. ఒకరు డిగ్రీ కళాశాల వద్ద, మరొకరు ఎన్టీఆర్ స్టేడియం వద్ద ఈ కేంద్రాలు ఏర్పాటు చేసుకున్నారు. మరోవైపు ఇంటి స్లాబ్‌పైనే గోధుమ గడ్డి పెంచుతూ అవసరమైన వారికి సరఫరా చేస్తున్నారు. వివిధ రకాల జ్యూస్‌లనూ విక్రయిస్తున్నారు. వాటికి ఆదరణ లభించడంతో తమకు గిట్టుబాటుగా ఉందని వీరు పేర్కొంటున్నారు.

**16 ఏళ్లుగా హైదరాబాద్‌లో..**

కడెం మండలం లక్ష్మీపూర్‌కు చెందిన రాపల్లి సత్యం ఇక్కడ వ్యవసాయం



అచ్చిరాక ఉపాధి కోసం హైదరాబాద్ వెళ్లారు. కొన్నాళ్లకు ఓ విదేశీ మిత్రుడు ఇచ్చిన సలహా మేరకు హైదరాబాద్ కేబీఆర్ పార్కు వద్ద 16 ఏళ్ల క్రితం గోధుమ గడ్డి జ్యూస్ విక్రయించే కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. దానికి ఆదరణ లభించడంతో మరో మూడుచోట్ల బ్రాంచీలు ఏర్పాటుచేసి ఉపాధి మెరుగుపర్చుకున్నారు. ఇప్పుడు గోధుమ గడ్డితో పాటు 16 రకాల ఆకుకూరలు, కూరగాయలతో రసాలు విక్రయిస్తూ మరో పదిమందికి ఉపాధి చూపిస్తున్నారు. ఆసక్తి ఉన్న యువకులకు శిక్షణ ఇస్తూ ఆయా ప్రాంతాల్లో ఈ కేంద్రాలు ఏర్పాటు చేయిస్తున్నారు.

**ఆదిలాబాద్‌లో బంక రవి..**

కడెంకు చెందిన బంక రవి హైదరాబాద్‌లో డ్రైవర్‌గా పనిచేశారు. ఆదాయం సరిపోక కడెం తిరిగొచ్చారు. హైదరాబాద్‌లో జ్యూస్ కేంద్రం నడుపుతున్న రాపల్లి సత్యం సూచనతో తానూ అదే మార్గంలో నడవాలని నిర్ణయించుకున్నారు. కొద్దిరోజులు శిక్షణ తీసుకుని నెల క్రితం ఆదిలాబాద్ పార్కు దగ్గర గోధుమ గడ్డితోపాటు ఇతర కొన్ని రకాల రసాలను ఉదయపు నడకకు వచ్చేవారికి, ఇతరులకు విక్రయిస్తూ ఉపాధి పొందుతున్నారు.

**భైంసాలో..**

కడెం మండలం పెద్దూరుకు చెందిన బైరి మహేష్ భైంసాలో కొంతకాలంగా ఓ కంపెనీలో పనిచేస్తున్నారు. అదనపు ఆదాయ వనరుగా గోధుమ గడ్డి జ్యూస్ కేంద్రాన్ని ఎనిమిది నెలల క్రితం ఏర్పాటు చేసుకుని ఉదయం ఉపాధి పొందుతున్నారు. అవసరమైన వారికి గడ్డి, తయారు చేసిన జ్యూస్ ఇళ్లకు తీసుకెళ్లి ఇస్తున్నారు.

# రీచ్ అక్కడ.. దోపిడీ ఇక్కడ

జైపూర్ : ఇసుక మాఫియా, అక్రమ రవాణాపై ఉక్కుపాదం మోపాలని ఇటీవల ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. అయినా జైపూర్ మండలం నుంచి యథేచ్ఛగా ఇసుక అక్రమంగా తరలిస్తున్నారు. నేరుగా ప్రధాన రహదారులపై నుంచే వెళుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. ఇసుక రీచ్ కోటపల్లి మండలం కొల్లూరులో ఉండగా.. జైపూర్ మండలం ఇందారం, రామారావుపేట, వేలాల, కిష్టాపూర్ శివారుల నుంచి ఇసుక అక్రమ దోపిడీ జరుగుతోందనే విమర్శలున్నాయి. తాజాగా వేలాల, కిష్టాపూర్ శివారులో అక్రమంగా ఇసుక తరలిస్తున్న నాలుగు ట్రాక్టర్లను పోలీసులు పట్టుకోవడం గమనార్హం.

**నంబర్ ప్లేట్ లేకుండానే రవాణా..**

ఇసుక అక్రమ రవాణాకు పాల్పడి పట్టుబడితే ఇటీవల కాలంలో జరిమానాలు సైతం భారీగా విధిస్తున్నారు. గతంలో రూ.5 వేలు ఉ



న్న జరిమానా ప్రస్తుతం రూ.25 వేలకు పెంచారు. దీంతో అంతమొత్తం జరిమానా కట్టడానికి కొందరు వెనుకాడటం లేదు. మరికొందరు తమకున్న రాజకీయ పలుకుబడితో జరిమానాలను తగ్గించుకోవడం గమనార్హం. ఇటీవల పట్టుబడిన నాలుగు ట్రాక్టర్లతో రెండింటికి నంబర్ ప్లేట్లు లేకుండానే రవాణా సాగిస్తున్నారు. గతంలో కూడా ఇలా నంబర్ ప్లేట్ లేకుండా రవాణా చేసిన వారికి భారీ మొత్తంలోనే జరిమానాలు విధించారు.

**ఈ ప్రాంతాల నుంచే..**

జైపూర్ మండలంలోని రామారావుపేట, ఇందారం, టేకుమట్ల, శెట్‌పల్లి, బెజ్జాల, కుందారం, కిష్టాపూర్, వేలాల, పౌనూర్, శివ్వారం శివారుల మీదుగా గోదావరి ప్రవాహం ఉంది. గోదావరిలో నీటి లభ్యత లేని కారణంగా ఇందారం, రామారావుపేట, వేలాల, కిష్టాపూర్ శివారులతో పాటు రసూల్‌పల్లి వాగు నుంచి ఇసుక రవాణా డిమాండ్‌ను బట్టి బాగానే సాగుతోంది. రాత్రివేళలో అదను చూసి ఇసుకాసురులు తమ పనికానిచ్చేస్తున్నారు.

# సౌకర్యాలు కల్పిస్తేనే.. పర్యాటకం



వేసవి వచ్చింది. విద్యార్థులు, ఉద్యోగులు విహారయాత్రలకు ఆసక్తి చూపుతారు. జిల్లాలోని పర్యాటక ప్రదేశాల్లో సౌకర్యాలు కల్పిస్తే పర్యాటకం ఊపందుకోనుంది. ఆయా స్థలాలపై ప్రత్యేక కథనం.

12వ శతాబ్దంలో కాకతీయులు నిర్మించిన కౌలాస్ కోట చెక్కు చెదరలేదు. కామారెడ్డికి 97 కి.మీ, హైదరాబాద్‌కు 170 కి.మీ దూరంలో జుక్కల్ మండలంలో ఈ కోట ఉంది. జుక్కల్ చౌరస్తా నుంచి కౌలాస్ గ్రామం మీదుగా కోటకు చేరుకోవచ్చు. 400 ఎకరాల్లో ఉన్న కౌలాస్ కోటకు 57 బురుజులు ఉన్నాయి. కోట లోపల ఆలయాలు, బావి, రాణిమహల్, ఆయుధ గది, ధాన్యాగారం, నేరస్థులను శిక్షించే గదులు ఉన్నాయి. రాజచిహ్నాలు అబ్బురపరుస్తాయి. కోట అవతల 'అష్టభుజ ఎల్లమ్మ' మందిరం ఉంది.

సమస్యలు: కోటకు వెళ్లేందుకు పర్యాటకులు ఇబ్బందులు పడుతున్నారు. కౌలాస్ గ్రామానికి, కోటకు మధ్యలో ఉన్న వాగుపై వంతెన లేక చుట్టూ 10 కి.మీ దూరం మట్టిరోడ్డుపై ప్రయాణం చేయాల్సి వస్తోంది. కౌలాస్ కోట అభివృద్ధి చెందాలంటే కౌలాస్‌నాలా ప్రాజెక్టు వాగుపై వంతెన నిర్మించాలి. 161 జాతీయ రహదారి నుంచి కోట వరకు 5 కి.మీ దూరం మట్టి రోడ్డుపై తారు వేస్తే మేలు.

**బోటింగ్ ఉంటే మేలు**

కామారెడ్డికి 60 కి.మీ, హైదరాబాద్‌కు 150 కి.మీ దూరంలో ఉన్న నిజాంసాగర్ ప్రాజెక్టు అందాలను తిలకించేందుకు కుటుంబ సమేతంగా వస్తుంటారు. మూడు కిలోమీటర్ల పొడవు, 48 వరద గేట్లు, అతిపురాతనమైన కట్టడం, ఎత్తయిన ప్రదేశంలో గోల్‌బంగ్లా ఉండడంతో.. ప్రాజెక్టు అందాలను చూడవచ్చు.

సమస్యలు: బోటింగ్ సౌకర్యం, మరుగుదొడ్లు లేకపోవడం, తాగునీటి సమస్య ఉంది. చెత్తచెదారంతో అపరిశుభ్రత నెలకొంది. పర్యాటక కేంద్రం ఏర్పాటు చేసి సౌకర్యాలు కల్పించాలి.

**వసతి ఉంటే బాగు** నిజాం రాజుచే తెలంగాణలో తొలిసారిగా నిర్మించినదే పోచారం ప్రాజెక్టు. వందేళ్ల చరిత్ర కలిగిన ఈ జలాశయం 21 అడుగుల ఎత్తు, 1.7 కి.మీ పొడవున ఉంది. హైదరాబాద్‌కు 100 కి.మీ దూరంలోని ఈ ప్రాజెక్టు పక్కనే అభయారణ్యం ఉంది. మాల్తుమ్మెదలో మెట్ల బావి పర్యాటకంగా ఆకట్టుకుంటోంది.

సమస్యలు: జలాశయం వద్ద పర్యాటకులకు కాటేజీలను ఏర్పాటు చేయాలి. ప్రాజెక్టు మధ్యలో ఉన్న గుట్టపై హరిత రిసార్ట్, గోల్ బంగ్లా వద్ద చిన్నారులకు ఆట వస్తువులు సమకూర్చాల్సి ఉంది.

# కానరాని పరిశ్రమ. వృథాగా రైతు శ్రమ




ఆదిలాబాద్ : ఉత్తర తెలంగాణలో ఆయిల్‌పాం సాగును ప్రోత్సహించాలనే ఆలోచనతో గత ప్రభుత్వం నిర్మల్ జిల్లా సోన్ మండలం పాక్‌పట్లలో ఏర్పాటు చేయాలనుకున్న ఆయిల్‌పాం పరిశ్రమకు పట్టిన గ్రహణం వీడటం లేదు. 2023లో ఈ పరిశ్రమ ఏర్పాటు కోసం 40 ఎకరాల ప్రభుత్వ స్థలాన్ని ఎకరాకు రూ.15 లక్షల చొప్పున సాధారణ ధర నిర్ణయించి ప్రీ-యూనిక్ అనే ప్రైవేటు సంస్థకు కేటాయించింది. అప్పట్లో సంస్థతో జరిగిన ఒప్పందం ప్రకారం మూడేళ్ల వ్యవధిలో రైతుల చేతికొచ్చిన పంటను కొనుగోలు చేయాలనే షరతు విధించింది. ఇప్పుడు పంట దిగుబడి వచ్చినా పరిశ్రమ అందుబాటులోకి రాకపోవటం రైతులను కలవరపాటుకు గురిచేస్తోంది.

**అవరోధమేంటి?**

శాసనసభ, పార్లమెంట్ ఎన్నికలు రావటంతో పరిశ్రమ ప్రస్తావనను అప్పటి ప్రభుత్వం పట్టించుకోలేదు. ఫలితంగా ప్రైవేటు సంస్థ సైతం నిర్మాణం చేపట్టలేదు. రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం కొలువుదీరటం, తాజాగా రైతుల చేతికి పంట రావటంతో మళ్లీ ఈ అంశం తెరమీదకు వచ్చింది. పరిశ్రమ ఏర్పాటు కాకుండా నిర్మల్ ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి అధికారులపై ఒత్తిడి తెస్తున్నారని ఆరోపిస్తూ రైతులతో కలిసి మాజీ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి నిర్మల్‌లో పాత కలెక్టరేట్ ఎదుట ధర్నా చేయటం రాజకీయ ప్రాధాన్యం సంతరించుకుంది.

**ఎంతో నష్టం..: రామయ్య, రైతు**

పంట చేతికొచ్చింది. పరిశ్రమ అందుబాటులోకి రాలేదు. ఖమ్మం జిల్లా అశ్వారావుపేటకు తరలించడమంటే మేం పంట సాగుచేసి నష్టం పోవడానికా? ప్రభుత్వం జోక్యం చేసుకొని మా పంటలను ఇక్కడే కొనుగోలు చేయాలి.

అన్యాయం: గంగారాం, రైతు

ఆయిల్‌పాం సాగు చేస్తే లాభం వస్తుందన్నారు. ఇప్పటికే ఎన్నో కష్టాల్లో ఉన్న మేం ఇప్పుడు కనీసం చేతికొచ్చిన పంటను అమ్ముకోలేకపోయే పరిస్థితి ఏర్పడింది. మా నాయకులే మా గోస పట్టించుకోవడం లేదు. ఇక ప్రభుత్వాన్ని అని ఏం చేస్తాం.

జాప్యం జరిగింది : అభిలాష అభినవ్, నిర్మల్ కలెక్టర్

గత ప్రభుత్వం ఆయిల్‌పాం పరిశ్రమ ఏర్పాటుకు అనుమతినిచ్చింది. ఇప్పటికే ప్రారంభం కావాల్సి ఉన్నా జాప్యం జరిగింది. రైతుల చేతికి పంట వచ్చింది. అందుకే పరిశ్రమతో ఉన్న ఒప్పందం ప్రకారం పంటను కొనుగోలు చేసేలా చర్యలు చేపడతాం. రైతులు భయపడాల్సిన అవసరం లేదు.


# సమగ్రాభివృద్ధిలో నార్నూర్ భేష్

నార్నూర్ : అభివృద్ధికి ఆమడ దూరంలో ఉన్న నార్నూర్ మండలం.. ప్రస్తుతం సమగ్రాభివృద్ధితో ఆదర్శంగా నిలుస్తోంది. కొన్నేళ్ల కిందట వసతుల లేమి, ఉపాధి అవకాశాలు లేక సతమతమవుతున్న నార్నూర్.. నీతి ఆయోగ్ ఆకాంక్ష బ్లాక్ ప్రోగ్రాం పథకం కింద ఎంపిక కావడంతో దక్షిణ భారత దేశంలోనే మోడల్(నమూనాగా) నిలవడం గమనార్హం. 2023 జనవరి 7న నీతి ఆయోగ్ ఆకాంక్ష కార్యక్రమం కింద నార్నూర్ ఎంపికైంది. ఆరోగ్యం, విద్య, వ్యవసాయం, మౌలిక వసతులు, సామాజిక-ఆర్థిక సమగ్ర అభివృద్ధి వంటి కీలక రంగాలలో మెరుగైన పనితీరును కనిపించింది. ఈ క్రమంలో అదే ఏడాది జూన్ నాటికి నార్నూర్ దక్షిణ భారతదేశంలో మొదటి స్థానాన్ని దక్కించుకుంది. డెల్టా ర్యాంకింగ్‌లో ఇది గణనీయమైన పురోగతిని సూచిస్తుంది. ఈ ఘనతకు గుర్తింపుగా నార్నూర్ బ్లాక్‌కు రూ.కోటి ప్రోత్సాహక నిధి మంజూరైంది. పీఎం అవార్డు-2025 కోసం 426 ఆకాంక్ష బ్లాకుల్లోని మొదటి 30 బ్లాకుల్లో నార్నూర్ ఒకటిగా నిలిచింది.

**ఆరోగ్యం.. సంక్షేమం వైపు అడుగులు**

వంద శాతం గర్భిణులకు పరీక్షలు, సురక్షిత ప్రసవాల కోసం గిరిజన పోషణ మిత్ర కార్యక్రమం కింద కార్యక్రమాలు చేపట్టారు. బాలికల ఆశ్రమ పాఠశాలల్లో రక్తహీనత నివారణకు, వ్యవసాయ కుటుంబాలకు చెందిన గర్భిణులకు పోషకాహారం అందించేలా ప్రభుత్వం కృషి చేసింది. పీఎం జన్‌మన్, ఎంఎంయూ, వైద్య శిబిరాలను నిర్వహించి ఆరోగ్య సంరక్షణ దిశగా పయనించింది.

మెరుగైన విద్య ఈ ప్రాంత విద్యార్థులకు మెరుగైన విద్య కోసం స్మార్ట్ తరగతులు, ఐసీటీ ల్యాబ్స్, వర్చువల్ లెర్నింగ్, డిజిటల్ కంప్యూటర్ విద్యను అందజేశారు. విహార యాత్రలతోపాటు విజ్ఞానశాస్త్రం ఆవిష్కరణ, తదితర అంశాలపై అవగాహన కల్పించారు. యువ ఓటర్ల



క్లబ్, ఇంగ్లిష్ లిటరసీ ప్రోగ్రాం, పిల్లల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించారు.

**వ్యవసాయం..** హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు భాగస్వామ్యంతో రైతులకు.. ఉద్యాన పంటలు, చిరుధాన్యాల సాగు, బిందుసేద్యం లాంటి సౌకర్యాలు కల్పించారు. మండలంలోని సుంగాపూర్, ఖంపూర్ గ్రామాల శివారులలో చెరువులు నిర్మించి రైతుల భూములకు నీరందించే దిశగా కృషి చేశారు. సోలార్ బోరు బావులు, నీటి సంరక్షణ కార్యక్రమాలపై రైతులకు అవగాహన కల్పించారు.

**మహిళా సాధికారత**

601 మహిళా స్వయం సహాయక సంఘాలు 6,721 సభ్యులతో ఆర్థిక స్వావలంబన దిశగా అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారు. సంప్రదాయ ఆహారాన్ని వనరుగా మార్చడం, మహువా (ఇప్పపువ్వు) లడ్డు నిర్మాణ ప్రాజెక్టు, పీఎంఈజీపీ, పీఎంఎఫ్‌ఎంఈ పథకాల కింద మహిళలు, యువతకు రాయితీ రుణాలు ఇచ్చి వ్యాపార దిశగా ప్రోత్సహించారు. వివిధ పనుల్లో నైపుణ్యం, డిజిటల్ స్కిల్స్, బాంబూ క్రాఫ్ట్స్(వెదురు బొమ్మలు) శిక్షణ కల్పించారు. ఆర్వో ప్లాంట్‌లు, సామాజిక గ్రంథాలయాల ఏర్పాటు.. ఇలా దేశ గ్రామీణాభివృద్ధికి ఒక మార్గదర్శకంగా నార్నూర్ నిలిచింది.

# ఒక్క'సారొస్తే' మళ్లీ పోరు

హైదరాబాద్: ఏ ప్రభుత్వ ఉద్యోగికైనా రెండేళ్లు లేదా గరిష్ఠంగా మూడేళ్లు డిప్యుటేషన్‌కు అనుమతిస్తారు. తర్వాత ఎక్కడి నుంచి వచ్చారో అక్కడికే వెళ్లాల్సి ఉంటుంది. కానీ దేవాదాయశాఖ ప్రధాన కార్యాలయంలో భిన్నమైన పరిస్థితులు ఉన్నాయి. కొందరు ఉద్యోగులు కొన్నేళ్లుగా కుర్చీని పట్టుకొని అక్కడే తిష్ఠ వేశారు. ఇలా పదుల సంఖ్యలో ఉన్న ఉద్యోగులు సింహభాగం రాజధాని పరిధిలోని వారే ఉన్నారు.



**పదోన్నతి వచ్చినా కదలరు..** మాతృసంస్థ నుంచి వేతనాలు తిసుకుంటూ కేంద్ర కార్యాలయంలో పనిచేస్తున్న ఉద్యోగులు అక్కడ ఖాళీలు చూపకుండా, పదోన్నతులు వచ్చినా కదలకుండా ఏళ్లుగా కొనసాగుతుండటంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇలా ఓ ఉద్యోగి రెండు దశాబ్దాలుగా ఒక చోటే పనిచేస్తున్నారు. ఈవోగా పదోన్నతి వచ్చినా కార్యాలయం విడిచి వెళ్లలేదు. రాజధాని పరిధిలోని ధర్మశాల, అమీర్‌పేట్ హనుమాన్ దేవాలయం, సికింద్రాబాద్ భోలక్‌పూర్ భవానీ శంకరాలయం, అడిక్‌మెట్ హనుమాన్ దేవాలయం నుంచి డిప్యుటేషన్‌పై వచ్చిన ఉద్యోగులు పదుల సంఖ్యలో కొనసాగుతున్నారు. ప్రస్తుతం కేంద్ర కార్యాలయంలో ఖాళీగా ఉన్న 111 పోస్టులలో 77 డైరెక్ట్ రిక్రూట్‌మెంట్, 34 ఇంజినీరింగ్ ఉన్నాయి. నిబంధనల ప్రకారం డైరెక్ట్ రిక్రూట్‌మెంట్(అడ్మినిస్ట్రేషన్) విభాగంలో 209మంది ఉద్యోగులు ఉండాలి. కానీ 126 మంది మాత్రమే పని చేస్తున్నారు. దీంతో పలు దేవాలయాల్లో పనిచేస్తున్న సిబ్బందిని డిప్యూటేషన్‌పై కమిషనర్ కార్యాలయానికి తీసుకొచ్చి పని చేయిస్తున్నారు. ఏడాది అనుమతితో వచ్చిన కొందరు ఏళ్లుగా ఇక్కడే ఉంటున్నారు. దీంతో అర్హులకు అవకాశం రావడం లేదని, సీనియార్టీ ప్రకారం పదోన్నతులకు నోచుకోవడం లేదని పలువురు వాపోతున్నారు.

# అవసరం గుర్తించాలి.. అన్నదాతను ప్రోత్సహించాలి

వికారాబాద్ : వేసవిలో కూరగాయల కొరత రాకుండా ఉండేందుకు ఉద్యానశాఖ సమాయత్తమవుతోంది. ఇందుకోసం ప్రత్యేక కార్యాచరణ చేపట్టింది. జిల్లా వ్యాప్తంగా ఎక్కడెక్కడ ఎన్ని ఎకరాల్లో సాగు చేస్తున్నారో గమనించి వారికి సమస్యలు ఉత్పన్నం కాకుండా ఉండేందుకు విత్తనాలు, మొక్కలను సిద్ధం చేస్తోంది. భూగర్భ జలాలు పడిపోతున్న సమయంలో ఆర్థికంగా నష్టపోకుండా ఉండేందుకు ఆరుతడి పంటగా సాగును ప్రోత్సహించాలని భావిస్తోంది. ఈ క్రమంలోనే క్షేత్రస్థాయిలో ప్రచారం చేస్తూ ఉన్న జలాలను పొదుపుగా వాడుకునేందుకు అవసరమైన రైతులు రాయితీపై బిందు, తుంపర పరికరాలను అందించనుంది. ఇందుకోసం మీ సేవా కేంద్రాల్లో దరఖాస్తులు చేసుకోవాలని సూచిస్తోంది.

**వేసవిలో ధరలు ఆశాజనకం**

గత వర్షాకాలంలో వివిధ రకాల పంటలు సాగు చేసిన రైతులు అనేక కారణాలతో కొంత నష్టపోవాల్సి వచ్చింది. దీంతో వేసవిలో అంతగా దృష్టి పెట్టరని కూరగాయల కొరత ఏర్పడుతుందని భావించిన అధికారులు రూ.14కోట్ల అంచనా వ్యయంతో ముందస్తు ప్రణాళికను ఏర్పాటు చేసుకున్నారు. ఉల్లి, సొరకాయ వంటి ఆయా రకాల విత్తనాలు కొరత రాకుండా ఏర్పాటు చేసుకున్నారు. ప్రధానంగా ఏప్రిల్ -మే నెలల్లో కూరగాయల ధరలు పడిపోకుండా ఒక విధంగా నిలకడగానే ఉంటాయని అధికారులు చెబుతున్నారు. స్థానికంగా పండిస్తున్న వాటితో జిల్లా అవసరాలతో పాటు జంటనగర వాసుల అవసరాలను కూడా తీరుస్తున్నారు. ఎకరా పెట్టుబడికి రూ.2వేలు వెచ్చించే కొత్త రకం



వంకాయ వంగడాన్ని కూడా అందుబాటులోకి తీసుకువస్తున్నారు.

**కొరత లేకుండా చూస్తాం**

వేసవిలో కూరగాయల కొరత రాకుండా ఉండేందుకు అన్ని రకాల చర్యలు చేపడుతున్నాం. నీటిని సద్వినియోగం చేసుకునేందుకు రైతులకు బిందు, తుంపర పరికరాలను అందజేస్తున్నాం. దరఖాస్తు చేసుకునే వారందరికీ విడతల వారీగా సరఫరా చేస్తాం. ఇందులో ఎస్సీ, ఎస్టీలకు మొదటి ప్రాధాన్యం ఉంటుంది. వివిధ రకాల పంటలు సాగు చేయడంతో రైతులకు తెలియకుండానే పంట మార్పిడి కూడా జరుగుతోంది. ఇవే కాకుండా తొలకరిలో అరటి, మామిడి, డ్రాగన్‌ఫ్రూట్, అవకాడో వంటి మొక్కలను కూడా అందజేస్తాం. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి. ఎం.ఎ.సత్తార్, జిల్లా ఉద్యానాధికారి

ఏడాదిలో పండించే విస్తీర్ణం 27,000 ఎకరాలు

దిగుబడి అంచనా 2.56 లక్షల మెట్రిక్ టన్నులు

చురకలు



# రూ.కోట్లు వృథా..!

నల్గొండ : అధికారుల నిర్లక్ష్యం..పాలకుల అలసత్వం వెరసి రూ.కోట్ల విలువైన భవనాలు శిథిలావస్థకు చేరాయి. ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నల్గొండ జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన రాష్ట్ర స్థాయి సంత ఫలితాలను ఇవ్వలేకపోతోంది. యార్డు నిర్మాణం చేపట్టి 13 ఏళ్లు గడుస్తున్న ఎలాంటి నిర్వహణ కార్యకలాపాలు నిర్వహించకపోవడంతో ఆరంభ శూరత్వంగా మారింది. రూ.కోట్ల నిధులు వెచ్చించి నిర్మించిన భవనాలు, సంత కోసం కేటాయించిన స్థలం నిరుపయోగంగా మారిపోతున్నాయి. దీంతో గొర్రెల మేకల పెంపకందారులకు,



వ్యాపారులకు ప్రయోజనం లేకుండా పోయింది.

**నిర్వహణపై దృష్టి ఏదీ..!**

గొర్రెల, మేకల పెంపకందారులను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు 2012లో అప్పటి ఉమ్మడి ఏపీ ప్రభుత్వం నల్గొండ జిల్లా కేంద్రంలో రాష్ట్రస్థాయి మేకల సంత నిర్వహించాలని నిర్ణయించింది. పట్టణ పరిధిలోని నకిరేకల్–మాచర్ల జాతీయరహదారి (565) పక్కన ఏఎమ్మార్పీకి సంబంధించిన స్థలంలో 5 ఎకరాల స్థలాన్ని యార్డుకు ప్రభుత్వం కేటాయించింది. రాష్ట్రీయ కృషి వికాస్ యోజన నిధుల ద్వారా ఆస్థలంలో రెండు అంతస్తులతో కూడిన కార్యాలయ భవనం, సంత నిర్వహణకు అవసరమైన భవనాలు, నీటి సౌకర్యార్థం నిల్వ ట్యాంకు, మరుగుదొడ్లు వంటి వసతులు కల్పించారు.

అధికారుల నిర్లక్ష్యం..పాలకుల అలసత్వం వెరసి ప్రభుత్వ ఆశయం నీరుగారిపోయింది. నిర్వహణ లేమితో పూర్తిగా ముళ్ల పొదలతో నిండిపోయింది. భవనాలు శిథిలావస్థకు చేరాయి. తెలంగాణలో ఆశించిన స్థాయిలో గొర్రెలు అందుబాటులో లేకపోవడంతో ప్రభుత్వం పొరుగున ఉన్న కర్ణాటక, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో ఏర్పాటు చేసిన సంతలను ఆశ్రయించి దిగుమతి చేసుకోవాల్సిన పరిస్థితి వచ్చింది. అదే తెలంగాణలో పెద్ద సంతలు నిర్వహించినట్లయితే ఇతర రాష్ట్రాలకు వెళ్లాల్సిన అవసరం ఉండదు. రవాణా ఛార్జీల భారం తగ్గుతుంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి హైదరాబాద్ శనగచర్ల మార్కెటు మాదిరిగానే నల్గొండ జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన మార్కెటు యార్డు (సంత) నిర్వహణను పునఃప్రారంభించాలని యాదవ, కురుమ సంఘాలు, గొర్రెల, మేకలపెంపకం దారులు సొసైటీల సభ్యులు డిమాండ్ చేస్తున్నారు.

# ఏడుతోంది.. పొలం'బాట'..!

సూర్యాపేట : ఆత్మకూర్(ఎస్) మండల కేంద్రంలోని పుప్పాలగూడెం వెళ్లే మార్గంలో డొంక దారి ఇది. ఈ బాట నుంచే రైతులు వ్యవసాయ బావుల వద్దకు వెళ్తున్నారు. కాగా నిత్యం వర్షాకాలంలో మోకాళ్ల లోతు గుంతలతో, బురద మధ్య నరకయాతన అనుభవిస్తూ అన్నదాతలు పొలాల వద్దకు చేరుకుంటారు. ఇలాంటి దారులకు ఈ వేసవిలో వంద రోజుల ఉపాధి పనిలో భాగంగా మోక్షం కలగనుంది. రైతులు వ్యవసాయ బావుల వద్దకు వెళ్లే దారులను బాగు చేసేందుకు ప్రభుత్వం సంకల్పించింది. అందులో భాగంగా ఉపాధి హామీ పనిలో భాగంగా రోడ్లకు ఇరువైపులా ఉన్న కంపచెట్ల నరికివేత, మట్టి దారుల్లో గుంతలను పూడ్పించి చదును చేసేందుకు చర్యలు తీసుకుంటోంది. దీంతో కూలీలకు ఉపాధి కలిగి, రైతులకు ఎంతో ఉపయుక్తం కానుంది.

ఇప్పటికే వ్యవసాయ బావుల వద్దకు వెళ్లే దారులు అధ్వానంగా ఉన్న రైతుల నుంచి దరఖాస్తులను స్వీకరిస్తోంది. సంబంధిత రైతులు ఎంపీడీవో కార్యాలయాల్లో, గ్రామ పంచాయతీ కార్యదర్శికి ఆయా వ్యవసాయ బావుల సర్వే నెంబర్లు, పేర్లతో ఫిర్యాదు అందించాల్సి ఉంది. క్షేత్రస్థాయిలో ఫీల్డ్ అసిస్టెంట్లు ఆయా దారులను పరిశీలించి ఉన్నతాధికారులకు నివేదిస్తారు. ఆ తరువాత ఆయా దారులను మరమ్మతుల చేయనున్నారు.

జిల్లా వ్యాప్తంగా 23 మండలాల్లోని 475 పంచాయతీల్లో ఇప్పటివరకు



42 దరఖాస్తులు అందాయి. కాగా ఇప్పటికే ఉపాధి హామీ పనులు ప్రారంభమయ్యాయి. 58,463 మంది కూలీలు పని చేస్తున్నారు. అందులో భాగంగా రహదారులను బాగు చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. రహదారిలో గుంతలను పూడ్చేందుకు రహదారికి ఇరువైపులా కాల్వలు తీసి ఆ మట్టిని గుంతల్లో పోయనున్నారు. దీంతో వర్షం నీరు వెళ్లేందుకు కాల్వలు ఉపయుక్తం కానుండటంతోపాటు పొలాలకు నీరు దరి చేరనుంది. దీంతో ఒకేసారి రెండు పనులు పూర్తి కానున్నాయి.

**యుద్ధ ప్రాతిపదికన చేపడతాం: అప్పారావు, డీఆర్డీవో, సూర్యాపేట**

పంట పొలాలకు వెళ్లే బాటలను మరమ్మతులు చేసేందుకు ఆదేశాలు అందాయి. ప్రస్తుతం దరఖాస్తులు స్వీకరిస్తున్నాం. త్వరలో పనులు ప్రారంభించేందుకు కార్యాచరణ రూపొందించాం. క్షేత్రస్థాయిలో అధికారులు, సిబ్బంది పనులను ఎప్పటికప్పుడు పరిశీలించేలా ఆదేశాలు జారీచేశాం. పనులను యుద్ధప్రాతిపదికన చేపట్టేందుకు చర్యలు తీసుకుంటున్నాం.

# ఆరంతస్తుల భవనం..అక్కరకురాని వైనం



హైదరాబాద్ : జవహర్‌లాల్ నెహ్రూ సాంకేతిక విశ్వవిద్యాలయం యాభైఏళ్లు పూర్తిచేసుకున్న సందర్భంగా చిరస్మరణీయ భవనం ఉండాలన్న భావనతో జేఎన్‌టీయూ అధికారులు గోల్డెన్ జూబ్లీ బిల్డింగ్ పేరుతో రూ.50కోట్లతో నిర్మించిన ఆరంతస్తుల భవనం తొమ్మిది నెలలుగా నిరుపయోగంగా ఉంది. వీసీగా బాధ్యతలు చేపట్టిన ప్రొఫెసర్ టి.కిషన్ కుమార్‌రెడ్డి గోల్డెన్ జూబ్లీ భవనంపై ఆరా తీయడంతో విషయం వెలుగులోకి వచ్చింది. లక్షకు పైగా చదరపు అడుగుల విస్తీర్ణంలో నిర్మితమై.. ప్రారంభోత్సవానికి నోచుకోకుండా అలంకారప్రాయంగా మారిన ఆ భారీ భవనం తెరవెనుక ఏం జరిగిందన్న అంశాలపై విచారణ చేస్తున్నట్టు విశ్వసనీయంగా తెలిసింది.

**పరిశోధనల కోసమని..**

జేఎన్‌టీయూలో గోల్డెన్ జూబ్లీ భవనం ప్రతిష్టాత్మకంగా ఉండాలని మూడేళ్ల క్రితం ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్‌లో యూనివర్సిటీ డెవలప్‌మెంట్ ఫండ్స్(యూడీఎఫ్) ఆమోదం తీసుకొని 2022 నవంబరులో నిర్మాణం ప్రారంభించారు. వివిధ విభాగాల ప్రత్యేకతలతో కూడిన పరిశోధనలకు వినియోగించాలన్న ఉద్దేశంతో ఈ భవన నిర్మాణం ప్రారంభించగా.. చిన్న.. చిన్న పనులున్నాయంటూ ఇప్పటికీ తమకు భవనాన్ని గుత్తేదారు అప్పగించలేదని ఇంజినీరింగ్ అధికారులు చెబుతున్నారు. నిర్మాణ పనుల ప్రారంభానికి ముందు పరిశోధనలు, ఇతర అవసరాలకు అనుకున్నారు. తర్వాత పరిపాలన విభాగం అధికారుల ఇష్టానుసారంగా నిర్మించారు.

**ప్రారంభోత్సవం.. రెండు సార్లు వాయిదా**

స్వర్ణోత్సవ భవనం ప్రారంభించాలని పూర్వ వీసీ కట్టా నరసింహారెడ్డి శతవిధాలా ప్రయత్నించగా.. అది సాధ్యం కాలేదు. తర్వాత సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా రెండుసార్లు ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేసినప్పటికీ.. అదీ జరగలేదు. ఈ లోపు గోల్డెన్ జూబ్లీ భవనం ఎందుకు నిర్మించారన్న ప్రశ్న ఇటీవల తెరపైకి వచ్చింది. వీసీ ప్రొఫెసర్ టీకేకే రెడ్డి ఇటీవల ఈ భవనాన్ని సందర్శించి ఇదే అనుమానం వ్యక్తం చేశారు. పరిపాలనా విభాగం ఈ భవనంలోకి మార్చాలని గత కొన్ని నెలలుగా సమాలోచనలు జరుగుతున్న నేపథ్యంలో కొత్త వీసీ దీనికి ససేమిరా అన్నారు. ఈ విషయంపై అధికారులను సంప్రదించగా.. త్వరలో కమిటీని ఏర్పాటు చేయనున్నామని రిజిస్ట్రార్ ప్రొఫెసర్ కె.వెంకటేశ్వరరావు తెలిపారు.

# ఆ పరికరం.. నీటి లెక్క చెబుతుంది



తాండూరు: జిల్లాలో అతి పెద్దదైన కోట్‌పల్లి జలాశయం వద్ద ప్రభుత్వం ఆటోమేటిక్ వాటర్ లెవెల్ రికార్డర్ (ఏడబ్ల్యూఎల్ఆర్ )కు సంబంధించి రెండు పరికరాలను ఏర్పాటు చేసింది. రాష్ట్రంలో అన్ని భారీ, మధ్యతరహా జలాశయాల వద్ద వీటిని ఏర్పాటు చేస్తున్న నేపథ్యంలో జిల్లాలోని కోట్‌పల్లి జలాశయం వద్ద కూడా నెలకొల్పారు. యంత్రాలకు జలాశయం నీటిని అనుసంధానిస్తూ సెన్సార్లను ఏర్పాటు చేశారు.

**సిబ్బంది వెళ్లాల్సిన పనిలేదు**పరికరాలు ఏర్పాటు చేయడానికి ముందు నీటి పారుదల శాఖలో పనిచేసే సిబ్బంది విధిగా జలాశయం వద్దకు చేరుకుని వివరాలను నమోదు చేసుకుని వెళ్లే వారు. వర్షాకాలంలో ఎగువ నుంచి వచ్చే వరదతో జలాశయం నిండగానే మొత్తం 24 అడుగుల నీటి సామర్థ్యానికంటే ఎక్కువగానే నీరుంది. అదనపు నీరు అలుగు నుంచి వెళుతుందనే నిర్ధారణకు వచ్చే వారు. అలాగే ఆయకట్టు భూముల్లో సాగయ్యే పంటలకు నీరు వదిలినపుడు జలాశయంలో ఉన్న నీటి మట్టం? నీరు వదలడం పూర్తి కాగానే నిల్వ ఉన్న నీటి మట్టం వివరాలను నమోదు చేసే వారు. ఇప్పుడు ఈ యంత్రాల ఏర్పాటుతో సిబ్బంది జలాశయం వద్దకు వెళ్లాల్సిన పనిలేకుండా పోయింది. ఏరోజు కారోజు ఫోన్ ద్వారా తెలుసుకునే అవకాశం ఏర్పడింది. **రోజు వారీ నీటి వివరాల నమోదు**

జలాశయంలో మొత్తం నిల్వ ఉండే నీటి సామర్థ్యం ఎంత? ప్రస్తుతం ఎంత ఉందనే వివరాలు రోజూ వారీగా నమోదౌతాయి. ఇవే వివరాలను నేరుగా నీటిపారుదల శాఖలో అధికారులు వినియోగించే చరవాణులకు చేరవేస్తాయి. వారు రికార్డుల్లో నమోదు చేస్తారు.

# జలం.. వృథా చేస్తే జరిమానా



ఇందూరు : హైదరాబాద్‌లోని ఒక కాలనీలో బల్దియా సరఫరా చేసే తాగునీటితో కారు కడుగుతుంటే మెట్రో వాటర్ బోర్డు అధికారులు గుర్తించి రూ.1000 జరిమానా విధించారు.

జూబ్లీహిల్స్‌లో మున్సిపల్ తాగునీటితో మోటారు సైకిల్ కడుగుతున్న వ్యక్తికి వాటర్ బోర్డు రూ.1000 జరిమానా విధించింది.

మున్సిపాలిటీ సరఫరా చేసే నీటిని ఏ అవసరాలకు వినియోగించుకోవాలి అనేది చట్టం స్పష్టంగా చెబుతుంది. దాని ప్రకారం ఏ ఉద్దేశంతో కుళాయి తీసుకున్నామో ఆ అవసరాలకే ఉపయోగించాలి. ఉల్లంఘిస్తే జరిమానా నుంచి కుళాయి తొలగింపు, కేసుల నమోదు వరకు బల్దియాలకు అధికారం ఉంది.

చట్టం చెబుతున్నది ఇది : పురపాలక చట్టం 2019లో ప్రస్తావించిన నిబంధనల అమలుకు 2020లో పురపాలకశాఖ 231 ఉత్తర్వు జారీ చేసింది. దాని ప్రకారం.. గృహ అవసరాల కుళాయి నీటిని తాగడానికి, ఇంటి అవసరాలకు మాత్రమే వినియోగించాలి. అలా కాకుండా ఏ ఇతర అవసరాలకు వాడినా చట్టరీత్యా నేరం. పారిశ్రామిక, వాణిజ్య అవసరాలకు అధిక ధరావతు, నెలవారీ ఛార్జీలు అధికంగా వసూలు చేసి నల్లా కనెక్షన్ మంజూరు చేస్తారు. అక్కడా నిర్దేశించిన అవసరాలకే వాడుకోవాలి. ఇక ఏ కుళాయికైనా మోటార్లు బిగించి అదనంగా నీటిని లాగేయడం, నీరు వృథా చేయడం, ఒక ఇంటికి కనెక్షన్ తీసుకుని నాలుగైదు వేర్వేరు నివాసాలకు ఉప నల్లాలు బిగించడం, మున్సిపల్ పైప్‌లైన్ వ్యవస్థను ధ్వంసం చేయడం వంటి ఏ చర్యనైనా చట్టరీత్యా నేరంగా పరిగణిస్తారు. కుళాయి బిగించిన ప్రాంతాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసే అధికారం బల్దియా అధికారులకు ఉంటుంది. ఈ నేరాల్లో ఏ ఒక్కటి గుర్తించినా రూ.500లకు పైగా జరిమానా విధిస్తారు. తరచూ అదే నేరానికి పాల్పడితే నీటి చౌర్యం, ఉద్దేశపూర్వకంగా ఆస్తుల ధ్వంసం వంటి నేరాల కింద కేసులు నమోదు చేస్తారు.

ఉమ్మడి జిల్లాలో : ఉమ్మడి జిల్లాలో ఆరు మున్సిపాలిటీలు, ఒక నగరపాలక సంస్థ ఉన్నాయి. వీటి పరిధిలో నల్లాలకు మోటార్లు బిగించడం సర్వసాధారణం. తనిఖీల్లో అలాంటివి గుర్తించి చర్యలకు ఉపక్రమించేలోపే రాజకీయ నాయకులు రంగప్రవేశం చేస్తారు. ఇంటి కుళాయిని వాణిజ్య అవసరాలకు ఉపయోగిస్తారు. టూటీలు బిగించకుండా నీటిని వృథా చేయడం విచ్చలవిడిగా సాగే వ్యవహారం. కానీ ఎక్కడా చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు.

బాధ్యత పెంచాలని జరిమానా..

బెంగళూరులో నీటి దుర్వినియోగానికి రూ.5000, హైదరాబాద్‌లో రూ.1000 జరిమానా విధించారు. నీటి ఎద్దడి తీవ్రత దృష్ట్యా బాధ్యత పెంచాలని అక్కడ జరిమానాలతో సరిపెట్టారు. వాస్తవానికి పురపాలికల్లో నెలవారీగా కుళాయికి రూ.100 వరకు నీటి ఛార్జీ వసూలు చేస్తారు. ఒక కుళాయికి నీరు అందించడానికి నెలవారీగా పురపాలికలకు శుద్ధి రసాయనాలు, సిబ్బంది, విద్యుత్తు ఖర్చులన్నీ కలిపి రూ.200లకు పైగా వ్యయం అవుతుంది. దీనిని పక్కన పెడితే విలువైన జలాన్ని దుర్వినియోగం చేయడం బాధ్యతారాహిత్యమే.

# ఇంటి నుంచే జలం ఇంకాలి

కామారెడ్డి : భూగర్భజలాల వృద్ధికి తోడ్పాటు అందించడం, నీటిని పొదుపు చేయడం పౌరులందరి విధి. నీటి పొదుపుపై చాలా మందికి అవగాహన లేక వృథా చేస్తుంటారు. భూగర్భజలాలు పెంపొందించడానికి ప్రతీ ఇల్లు వేదిక కావాలి. ఇంటింటికి ఇంకుడు గుంత నిర్మించుకుంటే చాలు. భూగర్భజలాలు వాటంతట అవే వృద్ధి చెందుతాయి. ప్రస్తుతం వేసవికాలం ఇంకుడు గుంతల నిర్మాణాలకు చాలా అనుకూలం కేవలం 10 రోజుల వ్యవధిలో నిర్మాణాలు పూర్తి చేసుకునే వీలుంది. **ఉపాధి పథకంలో..** ఇంకుడు గుంతల నిర్మాణాలకు ఉపాధిహామీ పథకం అండగా నిలుస్తుంది. ఇంకుడు గుంతలు నిర్మించుకోవడానికి అయ్యే ఖర్చులను ప్రభుత్వమే ఇస్తుంది. ఉపాధిహామీ పథకంలో జాబ్‌కార్డు కలిగిన కుటుంబాలకు ఇందులో ప్రాధాన్యత ఇస్తున్నారు. జాబ్‌కార్డు కలిసిన లబ్ధిదారుడికి ప్రభుత్వం సామగ్రి బిల్లులు చెల్లిస్తుంది. ఒక్కో ఇంకుడు గుంతకు రూ.7 వేల వరకు ఖర్చవుతుంది. కొన్ని కుటుంబాలు కలిసి సామూహికంగా నిర్మించుకుంటే రూ.18 వేలు అందజేస్తున్నారు. లబ్ధిదారులు గుంత తవ్వుకుని చిన్న, పెద్ద సైజు కంకర వేసుకోవాలి. దానిపై ఇసుక వేసుకుంటే సరి ఇంకుడు గుంత సిద్ధమైపోతుంది. ఏడాదికోసారి గుంత పైన వేసిన ఇసుకను మార్చుకుంటే ఇంకుడు గుంత శుభ్రంగా ఉంటుంది. ఇంటి నుంచి వచ్చే మురుగు నీటిని, వంట గది నుంచి వచ్చే వృథా నీటిని ఇంకుడు గుంతలోకి మళ్లించుకోవాలి.

# అపోహలు తొలగించు.. దాహార్తి తీర్చు

వికారాబాద్ : నీటి ఎద్దడిని నివారించడంతో పాటు ప్రజల ఆరోగ్యాన్ని పరిరక్షించాలన్న లక్ష్యంతో ఏర్పాటు చేసిన పథకం మిషన్ భగీరథ. కోట్లాది రూపాయలను వెచ్చించి శుద్ధి చేసిన నీటిని నేరుగా పంపిణీ చేస్తున్నా ప్రజలు సద్వినియోగం చేసుకోవడం లేదు. సరైన అవగాహన లేకపోవడంతోపాటు పలుచోట్ల నిర్వహణ లోపం కూడా ఇతర అవసరాలకు వినియోగించడానికి కారణమవుతోంది. దీనిని గుర్తించడంతోపాటు ఎండాకాలంలో నీటి ఎద్దడి సమస్యను కూడా దృష్టిలో ఉంచుకుని క్షేత్రస్థాయిలో దృష్టి సారించారు. గతంలో మండల స్థాయిలో సర్పంచులు, ఎంపీపీలు, మండల ప్రాదేశిక సభ్యులకు అవగాహన కల్పించగా ఇప్పుడు ప్రత్యేక సిబ్బందితో అవగాహన కల్పిస్తున్నారు.

**జిల్లాలో ఇదీ లెక్క..**

అంశం: – మిషన్ భగీరథ (2018లో ప్రారంభం)

నీటి శుద్ధి ప్లాంటు ఏర్పాటు: – పరిగి మండలం రాఘవాపూర్ సమీపాన

నిత్యం శుద్ధి జరిగే నీరు: – 1.35కోట్ల మిలియన్ లీటర్లు

నీటి సరఫరా: – శ్రీశైలం రిజర్వాయర్ బ్యాక్ వాటర్



ఎంత దూరం నుంచి: – 231 కిలోమీటర్లు పైప్‌లైన్ల ద్వారా

వెచ్చించిన వ్యయం: – ఉమ్మడి జిల్లాకు రూ.1800కోట్లు

లక్ష్యం: – ఇంటింటికీ శుద్ధి చేసిన తాగునీరు అందించడం

పంచాయతీకి ఒక సహాయకుడు

తాగునీటి సరఫరా సవ్యంగా జరగాలన్న ఉద్దేశంతో పంచాయతీకి ఒక సహాయకుడు పనిచేస్తున్నారు. ఇలా జిల్లా వ్యాప్తంగా సుమారు 583 మంది విధుల్లో ఉన్నారు. ఇతర శాఖల నుంచి ఆర్‌డబ్ల్యూఎస్‌కు వెళ్లిన హెల్పర్లు 101కూడా ఇందులోనే కొనసాగుతున్నారు. జిల్లా వ్యాప్తంగా ఇటీవలే విడతల వారీగా శిక్షణ కార్యక్రమాలను వారికి ఉన్నతాధికారులు పూర్తిచేశారు.

పథకం అమలు తీరు

సరఫరా పనితీరు – మెరుగ్గానే..

ప్రజాదరణ.. నామమాత్రం

కారణం – అవగాహన ఏర్పర్చక పోవడం

నిర్వహణ: శుభ్రతలేని ట్యాంకుల ద్వారా సరఫరా

దేనికి వినియోగిస్తున్నారు – ఇతర అవసరాలకు.

ఆరోగ్యానికి ఎంతో మేలు

ఖనిజ, లవణాల మిశ్రమంతో కూడిన జలాన్ని పంపిణీ చేస్తున్నాం. తాగునీటి విషయంలో ఎలాంటి అపోహలు వద్దు. భగీరథ నీరు ఆరోగ్యానికి ఎంతో సురక్షితం. డబ్బా నీటితో అనేక రకాల సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. ఇందుకోసమే క్షేత్రస్థాయిలో ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం.

చల్మారెడ్డి, ఈఈ, మిషన్ భగీరథ ఇంట్రా, గ్రిడ్.

# శిఖం భూములు.. యథేచ్ఛగా ఆక్రమణలు

పెద్దపల్లి : సుల్తానాబాద్ పెద్దచెరువు శిఖం ఇది. 300 ఎకరాలు ఉంటుంది. ఈ చెరువు కింద 3 వేల ఎకరాలకు సాగు నీరు అందుతోంది. వంద ఎకరాల శిఖం కబ్జా చేసి పొలాలు, చేపల చెరువులు, స్థిరాస్తి వ్యాపారం చేస్తున్నారని ఫిర్యాదులున్నా అధికార యంత్రాంగం పట్టించుకోవడం లేదు. ఆయకట్టుకు సాగు నీరందించే చెరువులు, కుంటలు చిన్నబోతున్నాయి. ఫుల్ ట్యాంకు లెవల్ (ఎఫ్‌టీఎల్) గుర్తింపులో ఆయా శాఖల ఉదాసీనత వైఖరితో యథేచ్ఛగా ఆక్రమణలు కొనసాగుతున్నా అధికారులు కన్నెత్తి చూడకపోవడం విమర్శలకు తావిస్తోంది.

**ఇదీ పరిస్థితి**

జిల్లాలో వంద ఎకరాల్లోపు 832, వంద కంటే పైనా 107 కలిపి 939 చెరువులున్నాయి. వీటి పరిధిలో 55,332 ఎకరాల ఆయకట్టు ఉంది. చెరువు, కుంటల శిఖానికి ఎఫ్‌టీఎల్ భూమితోపాటు బఫర్‌జోన్ ఉంటుంది. చెరువు నిండి ఎంత నిలిచి ఉంటుందో ఆ ప్రాంతాన్ని ఎఫ్‌టీఎల్ హద్దుగా గుర్తించాలి. కబ్జాకు గురికాకుండా ఈ జోన్‌లో మొక్కలు నాటి పర్యావరణం, పచ్చదనం పెంచాలి. చెరువుల హద్దులను తేల్చకపోవడంతో ఆక్రమణలు ఆగడం లేదు. రెవెన్యూ, నీటిపారుదల శాఖల్లో సమన్వయం కొరవడింది. ఏదైనా ఫిర్యాదు వస్తే తప్ప కబ్జాలు పట్టించుకోవడం లేదు. ఇరు శాఖల సంయుక్త సర్వేతో అక్రమణకు అడ్డుకట్ట పడనుంది. చెరువుల కట్జాకు గురికావడంతో పంట కీలక దశలో నీటి తడులు అందక ఎండిపోతున్నాయి. మత్స్యకారులకు నష్టం వాటిల్లుతోంది.

**మచ్చుకు కొన్ని ఇలా**

సుల్తానాబాద్ మండలం గర్రెపల్లి చెరువు 2 వేలకు పైగా ఆయకట్టు ఉంది. శిఖాన్ని 30 ఎకరాలు కబ్జాకు గురికావడంతో ఆయకట్టు, చేపల పెంపకానికి విఘాతం కలుగుతోంది. రైతులు రెవెన్యూ, నీటిపారుదలశాఖ అధికారులకు ఫిర్యాదు చేసినా ఫలితం లేదు.

కాల్వశ్రీరాంపూర్ మండలం పెగడపల్లిలో 496 సర్వేనంబరులో పెద్ద చెరువు సుమారు 150 ఎకరాల విస్తీర్ణంతో ఉంది. సుమారు 300 ఎకరాల ఆయకట్టు ఉండగా 25 ఎకరాలు కబ్జాకు గురైంది. చెరువులో నీరు ఉంటే గంగారం ఊషన్నపల్లి, పెగడపల్లి, ఓదెల మండలం నాంసానిపల్లె గ్రామాల్లోని రైతుల వ్యవసాయ బావుల్లో భూగర్భ జలాలు పెరుగుతాయి.మంథని మండలం చిన్నఓదాలలో నేతలపల్లి చెరువు శిఖం 34 ఎకరాలు ఉంది. శిఖం పక్కనే సీలింగ్ భూములు ఉండటంతో వాటి పేరిట కబ్జా చేసి పంట పొలాలుగా మార్చుతున్నారు. సమీప రైతులు ఫిర్యాదు చేయడంతో అధికారులు పరిశీలనకే పరిమితమైంది.

పెద్దపల్లి మండలం నిట్టూరు ఊరు చెరువు శిఖంలో హరితహారంలో నాటిన మొక్కలను కబ్జాదారులు తొలగించారు. అధికారుల పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. మూడేళ్లుగా పట్టించుకోవడం లేదు. నిమ్మనపల్లి, అప్పన్నపేట, బ్రాహ్మణపల్లిలో చెరువులు కనుమరుగవుతున్నాయి.

సర్వే చేస్తున్నాం

జిల్లాలో చెరువుల కబ్జాపై ఫిర్యాదుల ఆధారంగా సర్వే చేస్తున్నాం. రెవెన్యూ అధికారులను సమన్వయం చేసుకొని హద్దులు నిర్ధారిస్తున్నాం. కబ్జాలపై పర్యవేక్షణ పెంచుతున్నాం.

– శ్రీనివాస్, నీటిపారుదల శాఖ ఈఈ

# యువత లక్ష్యంగా సైన్స్ రీల్స్

హైదరాబాద్ : సామాజిక మాధ్యమాల్లో ప్రస్తుతం సందడంతా రీల్స్‌దే. వినోదం పంచడమే కాదు.. వ్యాపార ప్రకటనలు, ప్రచారాల వరకు వీటిదే హవా. ప్రభుత్వాల వైఫల్యాలపై వ్యంగ్యాస్త్రాలు, రాజకీయ ప్రత్యర్థులపై విమర్శలు ఏవైనా రీల్స్‌లోనే. పిల్లలు, కుర్రకారు మొదలు పెద్దల వరకు మొబైల్‌లో వీటి వీక్షణలో గంటల సమయం గడుపుతున్నారు. ఇంతటి జనాదరణ కలిగిన రీల్స్‌ను వినియోగించి సైన్స్‌ను జనంలోకి తీసుకెళ్లేందుకు హైదరాబాద్‌లోని కేంద్ర పరిశోధన సంస్థలు సమాలోచనలు చేస్తున్నాయి.

నగరంలో తార్నాక నుంచి ఉప్పల్ వరకు సైన్స్ కారిడార్‌లో పలు కేంద్ర పరిశోధన సంస్థలు ఉన్నాయి. ఐఐసీటీ, సీసీఎంబీ, ఎన్‌జీఆర్ఐ, సర్వే ఆఫ్ ఇండియా, సీడీఎఫ్‌డీ కేంద్రాలు ఇక్కడ ఉన్నాయి. ఇన్నర్‌రింగ్ రోడ్డు మీదుగా చంద్రాయణగుట్ట వరకు వెళ్తే డీఆర్‌డీవో ల్యాబ్‌లు ఉన్నాయి. ప్రజల పన్నులతో నడుస్తున్న ఈ సంస్థలు తమ పరిశోధనల గురించి ముఖ్యమైన వాటిని ఎక్స్‌లో పంచుకుంటున్నాయి. సీసీఎంబీ యూట్యూబ్ సీరిస్‌లు చేస్తోంది. సైన్స్‌పై కొత్తతరంలో ఆసక్తి పెంచడంతో పాటూ తమ చుట్టుపక్కల ఉన్న ప్రయోగశాలల్లో ఏమి చేస్తున్నారనే విషయాలను ప్రజలకు చేరవేసేందుకు సామాజిక మాధ్యమాలను ఉపయోగిస్తున్నారు. కానీ ఇవి చాలా తక్కువ మందికే చేరుతున్నాయి. దీంతో కొన్ని సంస్థలు వినూత్న ఆలోచన చేస్తున్నాయి. సృజనాత్మకంగా ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు..ముఖ్యంగా యువత లక్ష్యంగా ప్రణాళికలు రూపొందిస్తున్నాయి.

**30 నుంచి 90 సెకన్లలో..**

గంటల తరబడి వీడియోలను చూసే వారి సంఖ్య తక్కువ. అందునా సైన్స్‌పై అంటే ఇంకా తక్కువ. అందుకే రీల్స్ చేసి సామాన్య జనానికి చేరువకావొచ్చన్న ఆలోచనలను పరిశోధన సంస్థలు చేస్తున్నాయి. రీల్స్‌ను 30 సెకన్లలో తీస్తారు. గరిష్ఠంగా 90 సెకన్లకు మించదు.



ఈ తక్కువ సమయంలోనే సూటిగా, సుత్తిలేకుండా పరిశోధనలతో సాధించిన విజయాలను చెప్పాల్సి ఉంటుంది. ఇందుకోసం భారత ప్రభుత్వ సమాచార ప్రసార మంత్రిత్వ శాఖ పరిధిలోని ఫిల్మ్, టెలివిజన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇండియా(ఎఫ్‌టీఐఐ)తో చర్చిస్తున్నామని హైదరాబాద్‌లోని సీడీఎఫ్‌డీ డైరెక్టర్ ఆచార్య ఉల్లాస్ తెలిపారు.

**విజ్ఞాన సమాజం కోసం..**

సైంటిఫిక్ టెంపర్ ఉన్న సమాజం ఉండాలనేది మా ప్రయత్నం. సైన్స్‌లో చాలా ఆవిష్కరణలు సామాన్య మానవులకు చేరడం లేదు. ప్రస్తుతం సైన్స్ లిటరసీ ఒక సవాల్‌గా ఉంది. అక్షరజ్ఞానంతో ఆగిపోకుండా వైజ్ఞానిక అక్షరాస్యతను పెంపొందించాల్సి ఉంది. అప్పుడే రాజ్యాంగంలోని ఆర్టికల్ 51 ఏహెచ్ ప్రకారం సమాజంలో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించడం సాధ్యమవుతుంది. ప్రస్తుతం యువత సమాజంలో మూఢనమ్మకాలకు ఎక్కువ బలవుతున్నారు. వీరిలో శాస్త్రీయ దృక్పథాన్ని పెంచేందుకు రీల్స్ ఆలోచన వచ్చింది. ప్రస్తుతం యువత ఎక్కువగా ఇన్‌స్టాలోని రీల్స్ చూస్తున్నారు. తక్కువ నిడివితో రీల్స్ చేశాం. లక్షల సంఖ్యలో చూస్తున్నారు. జనంలోకి తీసుకెళ్లగలిగాం. స్పందన బాగుంది. ఈ తరానికి చేరేందుకు సంప్రదాయపద్ధతుల్లో సాధ్యం కాదు. కొత్త పద్ధతులను అన్వేషించాలి. రీల్స్ అలాంటివే. ఇంకా ఏమైనా ఉంటే కూడా ప్రయత్నించవచ్చు.

రమేశ్, అధ్యక్షుడు, విజ్ఞానదర్శిని

# సేవ ముసుగులో సైబర్ మాయగాళ్ల దందా

హైదరాబాద్ : సైబర్ మాయగాళ్లు ఏ అవకాశాన్ని వదులుకోవట్లేదు. ప్రజల భావోద్వేగాలతో ముడిపడిన ప్రతిదాన్ని సొమ్ము చేసుకుంటున్నారు. పేద పిల్లలకు విద్యా బుద్ధులు, విద్యార్థులకు ఉపకార వేతనాలు, ప్రార్థనామందిరాలకు విరాళాలు, తీవ్ర అనారోగ్యంతో బాధపడేవారికి ఉచిత వైద్య చికిత్సలంటూ సామాజిక మాధ్యమాల ద్వారా ఆకట్టుకుంటున్నారు. సేవా కార్యక్రమాల్లో పాలుపంచుకోవాలనే ఆలోచన ఉన్నవారు ఇది నిజమనే ఉద్దేశంతో స్పందించి డబ్బులు నష్టపోతున్నారు. మరోవైపు విదేశాలకు చెందిన స్వచ్ఛంద సంస్థలు, ప్రముఖ కంపెనీలు, ట్రస్ట్‌లు భారత్‌లో వివిధ సేవా కార్యక్రమాలు చేపట్టేందుకు సిద్ధమైందంటూ ఫోన్ నంబర్లకు సందేశాలు, లింక్‌లు పంపుతున్నారు. వాటికి స్పందించిన వారి ఫోన్లను హ్యాక్ చేసి బ్యాంకు ఖాతాల లావాదేవీలు తమ ఆధీనంలోకి తీసుకుంటున్నారు. తొలుత నమ్మకం కలిగించేందుకు రూ.5-10వేలు బాధితుల



ఖాతాల్లో జమ చేస్తున్నారు. పెద్దమొత్తంలో నగదు బదిలీ చేసేందుకు ముందుగా పన్నులు చెల్లించాలంటూ రూ.లక్షలు కొట్టేస్తున్నారు. నెల రోజుల వ్యవధిలో నగర సైబర్‌క్రైమ్ పోలీసులు 5-6 కేసులు నమోదు చేశారు. గుర్తుతెలియని వ్యక్తులు, సంస్థల పేరిట వచ్చే లింక్‌లు, సేవ, విరాళాల పేరిట వచ్చే ప్రకటనలు నమ్మొద్దని సైబర్‌క్రైమ్ పోలీసులు సూచిస్తున్నారు. మాయగాళ్ల చేతిలో సొమ్ము నష్టపోయిన బాధితులు టోల్‌ఫ్రీ నం.1930కు ఫిర్యాదు చేయాలని తెలిపారు.

**సాయం పేరుతో మోసం**విదేశాల్లో ఉన్న తమ వర్గానికి చెందిన ప్రజలకు సాయం చేయాలంటూ సామాజిక మాధ్యమాల్లో పోస్టు ఒక యువకుడిని ఆకట్టుకుంది. అవతలి వారిని యాప్ ద్వారా సంప్రదించి వివరాలు సేకరించాడు. మిత్రుల సహకారంతో నిధులు సేకరించి వారు సూచించిన బ్యాంకు ఖాతాలో జమచేశాడు. ఆ తరువాత వాస్తవం తెలియటంతో మోసపోయినట్టు గ్రహించాడు. పాతబస్తీకి చెందిన ఒక వ్యక్తి ఫోన్‌కు వచ్చిన లింక్‌ను క్లిక్ చేశాడు. ప్రార్థనామందిరం నిర్మాణానికి తాము సాయం చేస్తామని మాయగాళ్లు చెప్పటంతో నిజమని భావించాడు. బ్యాంకు ఖాతా వివరాలు పరిశీలించేందుకు కొంత నగదు జమచేయాలంటూ దఫాలవారీగా రూ.1.50లక్షలు కొట్టేశారు. అనంతరం ముఖం చాటేయటంతో నగర సైబర్‌క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

# కునుకు కరవు!



కరీంనగర్ : కరీంనగర్‌కు చెందిన ఉదయ్‌కు అర్ధరాత్రి 12 గంటలైనా నిద్ర రావడం లేదు. రోజుల తరబడి ఇదే సమస్య ఉండటంతో వైద్యుడిని సంప్రదించారు. విపరీతమైన తలనొప్పి, చికాకుతో బాధపడుతున్నానని చెప్పారు. జీవనశైలి, ఆహార నియమాల్లో లోపాలు, రోజుకు సగటున 5 గంటల పాటు చరవాణి చూడటం వల్లనే ఈ సమస్య అని గుర్తించిన వైద్యుడు తగు సూచనలు ఇచ్చారు.

కేంద్ర ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో పరీక్షల సమయంలో విద్యార్థుల కోసం ఏర్పాటు చేసిన టెలీ మానస్ ఉచిత సహాయ నంబరుకు ఉమ్మడి జిల్లా నుంచి పలువురు విద్యార్థులు ఫోన్ చేశారు. ఇందులో ఎక్కువ మంది నిద్ర సరిగా పట్టడం లేదని చెప్పారు. పది, ఇంటర్మీడియట్ పరీక్షలు ఈసారి దాదాపు 36వేల మంది వరకు రాయబోతున్నారు. పరీక్షల ఒత్తిడితో ఎక్కువ మంది నిద్ర సరిగ్గా పోలేకపోతున్నారు.

ఉరుకుల పరుగుల జీవనశైలి.. జంక్‌ఫుడ్.. చరవాణి తెరను ఎక్కువసేపు చూడటం.. ఒత్తిడి నాణ్యమైన నిద్రకు దూరం చేస్తున్నాయి. శారీరక, మానసిక అనారోగ్యానికి కారణమవుతున్నాయి. రోజూవారీ జీవితంలో కొన్ని మార్పులు చేసుకుంటే సుఖ నిద్రను సొంతం చేసుకోవచ్చంటున్నారు వైద్య నిపుణులు. నాలుగు జిల్లా ఆసుపత్రులతోపాటు ప్రైవేటు ఆస్పత్రుల్లో జనరల్ ఫిజిషియన్ల వద్ద రోజుకు సగటున 8,300 మంది అవుట్ పేషెంట్లుగా వస్తున్నారు. ఇందులో నిద్రలేమి సమస్యతో వచ్చేవారు 30 శాతానికి పైగా ఉంటున్నారని వైద్యులు పేర్కొంటున్నారు. గతంలో 50 ఏళ్లపైబడిన వారికి ఈ సమస్య ఉండేదని, ఇప్పుడు 30 ఏళ్ల లోపు వారిలోనూ కనిపిస్తోందని చెప్పారు. 18- 30 ఏళ్ల వారు కూడా రోజులో నలుగురైదుగురు ఈ సమస్యతో వస్తున్నారట. కొందరు మానసిక వైద్య నిపుణులను కూడా సంప్రదిస్తూ సేవలు పొందుతున్నారు.

**ఆచరించి చూడండి!**

సమయానికి నిద్రపోవడం, లేవడం అలవాటు చేసుకోవాలి.

రాత్రి పూట ఎక్కువ మోతాదులో ఆహారం తీసుకోవద్దు.

పడుకోవడానికి రెండు గంటల ముందే భోజనం ముగించాలి.

నిద్రకు గంట ముందు నుంచే చరవాణికి దూరంగా ఉండాలి.

గది ఉష్ణోగ్రత 25 డిగ్రీలు ఉండేలా చూసుకోవాలి.

గదిలో ఎక్కువ కాంతి, ధ్వని లేకుండా చూసుకోవాలి.

మంచి పుస్తకం కాసేపు చదవడం, శ్రావ్యమైన సంగీతం వినడం ద్వారా మంచి ఫలితం ఉంటుంది.

5 నిమిషాల పాటు దీర్ఘశ్వాస తీస్తూ వదిలితే మెదడుకు విశ్రాంతి లభిస్తుంది.

రోజూ ఉదయం వ్యాయామానికి గంట సమయమైనా కేటాయించాలి.

నిద్రలేమితో..

ఏకాగ్రత దెబ్బతింటుంది.

హార్మోన్ల అసమతౌల్యం

రోగనిరోధక శక్తి తగ్గి వ్యాధుల బారిన పడతాం.

నాణ్యమైన నిద్రతో..

ఉదయం ఉత్సాహంగా ఉంటారు.

ఒత్తిడి దూరమవుతుంది.

జ్ఞాపకశక్తి మెరుగవుతుంది.

మంచి ఆలోచనలు వస్తాయి.

చరవాణి వీక్షించే సమయం పెరగడం మనిషిని నిద్రకు దూరం చేస్తోందని వైద్యులు అంటున్నారు. ముఖ్యంగా పడుకునే ముందు గంట నుంచి గంటన్నర పాటు ఫోన్‌ను చూస్తున్నవారు పెరుగుతున్నారు. ఆ కాంతి కిరణాల వల్ల కంటికి, మెదడుకు ఇబ్బంది తలెత్తి చాలాసేపటి వరకు నిద్ర రావడం లేదు. ప్రతి ఒక్కరూ రోజుకు సగటున 3 గంటలపాటు తెరని చూస్తుండటం సమస్యను పెంచుతోంది.

**మెదడుపై ఒత్తిడి ప్రభావం**

మెదడుపై ఒత్తిడి ఎక్కువైతే నిద్రలేమి సమస్య వస్తుంది. ఉదయం లేచిన తరవాత బద్ధకంగా.. తలనొప్పిగా ఉంటుంది. ఇటీవల ఇలాంటి వారు ఎక్కువ మంది మా వద్దకు వస్తున్నారు. మెదడుకు తగిన విశ్రాంతి ఇవ్వాలి. పడుకునే ముందు మెదడుకు, కంటికి ఒత్తిడి కలిగించే ఏ పని చేయొద్దు.

డాక్టర్ కిషన్, మానసిక వైద్య నిపుణులు, కరీంనగర్

# సీఎస్ఆర్ నిధులు... ఆధునిక సౌకర్యాలు

జిన్నారం : సీఎస్ఆర్ నిధులు గ్రామాలకు వరప్రసాదంగా మారుతున్నాయి. ప్రధానంగా ప్రభుత్వ పాఠశాలల స్థితిగతులు మారేందుకు దోహదపడుతున్నాయి. జిన్నారం మండలం ఖాజీపల్లిలో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల కోసం నిర్మిస్తున్న భవనం పూర్తయ్యే దశకు చేరింది. ఈ నెలాఖరులో ప్రారంభోత్సవానికి సిద్ధం చేస్తున్నారు. స్థానిక పారిశ్రామికవాడలోని కెమ్‌టెక్ పరిశ్రమ సీఎస్ఆర్ నిధులతో దీని నిర్మాణం చేపట్టారు.

**సమస్యలు పునరావృతం కాకుండా..**

గతంలో శిథిల భవనం కావడంతో వాన కురిస్తే విద్యార్థులు ఇబ్బందులు పడేవారు. ఆ రోజు సెలవు ఇవ్వాల్సిన దుస్థితి. మరోవైపు ఇరుకు గదులతో పాట్లు పడక తప్పలేదు. ఈ ఇబ్బందులు తీర్చేందుకు కొత్త భవనాన్ని నిర్మిస్తున్నారు. ఐదు తరగతి గదులు, గ్రంథాలయం, కార్యాలయానికి వేర్వేరుగా గదులు నిర్మించారు. గతంలో ఒక గదిలో రెండు తరగతుల వారిని కూర్చోబెట్టగా.. ఇప్పుడిక ఆ సమస్య ఉ




ండదు. విశాలమైన భోజనశాల సైతం అందుబాటులోకి తీసుకొస్తున్నారు. ప్రస్తుతం రంగులు వేస్తున్నారు. రూ.1.8 కోట్ల అంచనాతో నిర్మాణ పనులు చేపట్టారు.

**అంగన్‌వాడీ సైతం**

ఇదే సముదాయంలో అంగన్‌వాడీ భవనాన్ని నిర్మించారు. చిన్నారులు, బాలింతలు, గర్భిణులు ఎలాంటి అవస్థలు పడకుండా అన్ని వసతులు కల్పిస్తున్నారు. ప్రత్యేకంగా సామగ్రి నిల్వ కోసం ప్రత్యేకంగా గదిని నిర్మించారు. చిన్నారులకు సకల సౌకర్యాలు కల్పించారు. వారిని ఆకట్టుకునేలా కార్పొరేట్ తరహాలో గోడలపై బొమ్మలు వేయించారు.

అన్ని సదుపాయాలతో..: అన్ని వసతులతో భవన నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. గతంలో ఉన్న సమస్యలు చాలా వరకు పరిష్కారం అయినట్లే. విద్యార్థులకు అన్ని సౌకర్యాలు ఒనగూరనున్నాయి. అనిల్‌కుమార్, ప్రధానోపాధ్యాయుడు

# ప్రతి పనికీ సప‘రేటు’



పెద్దపల్లి : వాహనాల రిజిస్ట్రేషన్ అయినా.. చలానా చెల్లింపులైనా.. డ్రైవింగ్ లైసెన్సు జారీ అయినా.. ఫిట్‌నెస్ ధ్రువీకరణ అయినా.. ఇలా ప్రతి పనికీ ఓ రేటు. ఇదేమని ఎవరైనా ప్రశ్నిస్తే అధికారుల పేరు చెప్పి బెదిరింపులు. ఏజెంట్లకు, అధికారులకు అనుసంధానకర్తగా వ్యవహరించడం.. ఇదీ పెద్దపల్లి జిల్లా రవాణా శాఖ కార్యాలయంలోని ఓ అధికారి వద్ద పని చేసే ప్రైవేటు సహాయకుడి తీరు. వసూళ్ల పర్వానికి అధికారులు అండగా నిలవడంతో సదరు ఉద్యోగి షాడో ఎంవీఐగా మారాడు.

**నెలవారీగా రూ.లక్షల్లో మామూళ్లు**

జిల్లా పరిధిలో నడిచే లారీల నుంచి భారీ మొత్తంలో వసూళ్లకు పాల్పడుతున్నారు. ఒక్కో లారీకి నెలకు రూ.8 వేల చొప్పున వసూలు చేస్తుండగా ఇటుక, ఇసుక, బొగ్గు రవాణా చేసే దాదాపు 500 లారీల నిర్వాహకులు సదరు షాడో ఎంవీఐ ద్వారా చెల్లిస్తున్నారు.మామూళ్లు చెల్లించేందుకు నిరాకరించిన వారి వాహనాలే అధికారుల తనిఖీల్లో తరచూ పట్టుబడతాయి. వాటిని విడుదల చేయించడానికి జరిమానా స్థాయిని బట్టి అదనపు వసూళ్లుంటాయి. శనివారం కార్యాలయ ఆవరణలో లారీ ఎక్కి ఆత్మహత్యాయత్నం చేసిన అనిల్‌గౌడ్ లారీని ఏడు నెలల కిందట సీజ్ చేయగా అదనపు సొమ్ము ఇచ్చేందుకు నిరాకరించడంతోనే రిలీజ్ చేయలేదనే ఆరోపణలున్నాయి.

ఇక్కడి అధికారుల పనితీరుపై గతంలోనూ అనేక ఆరోపణలు వచ్చాయి. వాహనాల తనిఖీల సందర్భంగా వివాదాలు తలెత్తుతున్నాయి. పత్రాలన్నీ సరిగానే ఉన్నా వేధిస్తున్నారనే ఆరోపణలున్నాయి.

జిల్లా రవాణా శాఖ కార్యాలయంలో విధులు నిర్వహించే ముగ్గురు ఎంవీఐలలో ఒకరి వద్ద పని చేసే ప్రైవేటు సహాయకుడి తీరుతోనే తరచూ వివాదాలు తలెత్తుతున్నాయి. స్థానిక వాహనాలనే లక్ష్యంగా చేసుకొని వేధిస్తున్నారనే ఆరోపణలున్నాయి.

**బోర్డులపైనే నిబంధనలు**

పెద్దపల్లి ఆర్టీవో కార్యాలయానికి సొంతంగా వెళ్తే పనులయ్యే పరిస్థితి లేదు. బోర్డులపై కనిపించే సూచనలు, నిబంధనలు ఆచరణలో కనిపించవు. పని కావాలంటే తప్పనిసరిగా ఏజెంట్ల ద్వారా వెళ్లాల్సిందే. డ్రైవింగ్ లైసెన్సు కోసం కార్యాలయానికి రాకపోయినా, పరీక్ష రాయకపోయినా జారీ చేస్తారు. వాహనాలు నడపాల్సిన అవసరం కూడా ఉండదు. కాకపోతే ప్రతి పనికీ ఒక్కో ధర ఉంటుంది. డ్రైవింగ్ లర్నింగ్ లైసెన్స్‌కు రూ.2,300, పర్మినెంట్ లైసెన్స్‌కు రూ.4200 చొప్పున నిర్ణయించారు. కొత్త వాహనాల రిజిస్ట్రేషన్‌కు నిబంధనల ప్రకారం ఎలాంటి రుసుము చెల్లించాల్సిన అవసరం లేకున్నా ద్విచక్రవాహనానికి రూ.1000, కారుకు రూ.2000 చొప్పున వసూలు చేస్తున్నారు. **రాతపూర్వకంగా ఫిర్యాదు చేస్తే చర్యలు**

రవాణాశాఖ అధికారులు అవినీతికి పాల్పడితే రాతపూర్వకంగా ఫిర్యాదు చేయాలి. లేదంటే ఏసీబీకి పట్టించాలి. కానీ ఆరోపణలు చేయడం వల్ల ప్రయోజనం లేదు. ప్రైవేటు వ్యక్తులు ఎవరైనా డబ్బులు వసూలు చేస్తే మాకు సంబంధం లేదు. రవాణా శాఖ అధికారుల పేరు చెప్పి వసూళ్లకు పాల్పడే వారిని పోలీసులకు అప్పగించాలి.

రంగారావు, జిల్లా రవాణా శాఖ అధికారి

# సీడీపీ నిధులేవి?

ఆదిలాబాద్ : సాధారణంగా ఎమ్మెల్యేకు ఏటా నియోజకవర్గ అభివృద్ధి కార్యక్రమం(సీడీపీ) కింద నిధులు విడుదలవుతాయి. గ్రామాల్లో ఇచ్చిన హామీలు.. కార్యకర్తలు సూచించిన పనులను మంజూరు చేసేందుకు ఎమ్మెల్యేలకు ఉన్న ఏకైక నిధి ఇదే. గెలుపొంది ఏడాది కావొస్తున్నా ఈ సీడీపీ నిధుల జాడ లేకపోవడంపై ఎమ్మెల్యేలు నిట్టూరుస్తున్నారు. ఉమ్మడి జిల్లాలోని విపక్ష ఎమ్మెల్యేల పరిస్థితి అయోమయంగా ఉందని వారి అనుచరులు వాదిస్తున్నారు. తమ వద్దకు వచ్చిన ప్రజల సమస్యలు పరిష్కరించలేకపోతున్నామని ఇటు ఎమ్మెల్యేలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నియోజకవర్గంలో అభివృద్ధి పనులకు గత ప్రభుత్వ హయాంలో తొలుత సీడీపీ కింద రూ.3 కోట్లకు పెంచారు. చివరి సంవత్సరం 2022-23లో ఆ నిధి ఏకంగా రూ.5 కోట్లకు పెరిగింది. నిధులు పెంచినా అందులో ఒక నిబంధనను తీసుకొచ్చారు. రూ.3 కోట్లు ఎమ్మెల్యే కోటా కింద విడుదల చేసి మిగతా వారి ప్రమేయం లేకుండానే రూ.2 కోట్లు నేరుగా ప్రభుత్వమే విద్యాశాఖ కింద ‘మన ఊరు - మన బడి’కి కేటాయించింది. దీంతో కోటా పెంచినా అంతగా ప్రయోజనం లేకుండా పోయిందని అప్పట్లో కొందరు ఎమ్మెల్యేలు ఆవేదన వెలిబుచ్చారు. ఆఖరుగా 23.05.2023న జిల్లాలకు సీడీపీ కింద రూ.3 కోట్ల చొప్పున ఒక్కో నియోజకవర్గానికి విడుదలయ్యాయి. ఇది ఇంతకు ముందున్న ఎమ్మెల్యేలు వినియోగించారు. కొత్తవారికి ఇప్పటి వరకు ఏమీ రాలేదు.

**పదిలో ఆరుగురు విపక్ష ఎమ్మెల్యేలే**

గత డిసెంబరు 7న ఎమ్మెల్యేలు ప్రమాణ స్వీకారం చేశారు. తాజాగా సంవత్సరం కావొస్తోంది. సీడీపీ నిధుల జాడలేక విపక్ష ఎమ్మెల్యేలు నిరాశలో ఉన్నారు. అధికార కాంగ్రెస్‌కు సంబంధించి మంచిర్యాల, ఖానాపూర్, చెన్నూర్, బెల్లంపల్లి నియోజకవర్గాల్లో ప్రేంసాగర్‌రావు, వెడ్మబొజ్జు, వివేక్, వినోద్‌లు గెలుపొందారు. బోథ్, ఆసిఫాబాద్‌లలో భారాసకు చెందిన అనిల్‌జాదవ్, కోవలక్ష్మి విజయం సాధించారు. ఆదిలాబాద్, నిర్మల్, ముథోల్, సిర్పూర్ నియోజకవర్గాల్లో భాజపా నుంచి పాయల్‌శంకర్, మహేశ్వర్‌రెడ్డి, రామారావుపటేల్, పాల్వాయి హరీష్‌బాబులు గెలుపొందారు. కాంగ్రెస్ ఎమ్మెల్యేలు మాత్రం ఇతర నిధులతో పనులు మంజూరు చేయించుకుంటున్నా ఆరురుగు విపక్ష ఎమ్మెల్యేలు ఉండటంతో నిధుల కేటాయింపు సమస్యగా మారింది.

**నిరాశే..**

అసలే సీడీపీ నిధుల విడుదల లేక అయోమయంగా ఉన్న విపక్ష ఎమ్మెల్యేలకు ఇతర నిధుల్లోనూ ప్రాధాన్యం లభించకపోవడం ఇబ్బందికరంగా మారింది. నియోజకవర్గానికి రూ.10 కోట్ల చొప్పున ప్రత్యేక అభివృద్ధి నిధి(స్పెషల్ డెవలప్‌మెంట్ ఫండ్) మంజూరుకాగా కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ఉన్నచోట వారే పనులు ప్రతిపాదించారు. విపక్ష ఎమ్మెల్యేలు ఉన్నచోట మాత్రం వారు ప్రతిపాదించిన పనులను పక్కనపెట్టడం రాజకీయ చర్చకు తెరలేపింది. ఈ పనులను జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి ఆమోదించాల్సి ఉండటంతో అన్ని చోట్ల నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌ఛార్జులు సూచించిన పనులకు అధిక ప్రాధాన్యమిచ్చినట్లు తెలుస్తోంది. గెలిచిన కొత్తలో ఉపాధిహామీ కింద రోడ్లు, మురుగుకాలువల కోసం నిధులు రాగా కాంగ్రెస్ కార్యకర్తలకు కొన్ని కేటాయించి మిగతా సగం విపక్ష ఎమ్మెల్యేలకు సైతం రూ.3.50 కోట్ల చొప్పున మంత్రి కేటాయించడంతో అంతా సంతృప్తిచెందారు.

అభివృద్ధి కోసం కలిసి పనిచేద్దామని మంత్రి చెప్పడంతో ఇతర నిధుల కేటాయింపుల్లోనూ ప్రాధాన్యం ఉంటుందని విపక్ష ఎమ్మెల్యేలు భావించినా ఎస్‌డీఎఫ్ పనుల్లో నిరాశే మిగలడంతో కథ మొదటికొచ్చింది. దీంతోనే సీడీపీ నిధుల విడుదలకు పట్టుబడుతు న్నారు. కేవలం కల్యాణలక్ష్మి చెక్కులు, సీఎం సహాయ నిధి చెక్కుల పంపిణీకే పరిమితమవుతున్నామని విపక్ష ఎమ్మెల్యేలు ఆవేదన వెలిబుచ్చుతున్నారు. ప్రస్తుతం గ్రామాల్లో ప్రజాప్రతినిధులు లేక అన్ని నిధుల్లో ఎమ్మెల్యేల ప్రతిపాదనలే తీసుకోవాల్సి ఉన్నా తమ హక్కులను కాలరాస్తున్నారని విపక్ష ఎమ్మెల్యేల్లో ఒకరైన భారాసకు చెందిన బోథ్ ఎమ్మెల్యే అనిల్‌జాదవ్ పేర్కొనడం ఇక్కడ ప్రస్తావించాల్సిన అంశం.

# అరకొర వసతుల్లో అవస్థల పఠనం

పెద్దపల్లి : కాల్వశ్రీరాంపూర్‌లోని శాఖా గ్రంథాలయ భవనం ఇది. శిథిలావస్థకు చేరడంతో ఇందులో కూర్చోవడానికి పాఠకులు భయపడుతున్నారు. ఒకే గదిలో పుస్తకాలు, బీరువాలు, దినపత్రికలు పెట్టడంతో ఇరుకుగా మారి పాఠకులు కూర్చోలేని పరిస్థితి.

నిరుద్యోగ యువతకు ఉద్యోగ సాధనలో అండగా నిలవాల్సిన గ్రంథాలయాల నిర్వహణపై ఎడతెగని నిర్లక్ష్యం కనిపిస్తోంది. జిల్లా ఆవిర్భవించి ఎనిమిదేళ్లు దాటినా పెద్దపల్లిలోని కేంద్ర గ్రంథాలయానికే సొంత భవనం సమకూరలేదు.

**సొంత భవనాలు రెండే**

జిల్లాలో మొత్తం 14 మండలాలకు 10 చోట్ల గ్రంథాలయాలున్నాయి. పెద్దపల్లి, ధర్మారం, కాల్వశ్రీరాంపూర్, రామగుండం, జూలపల్లి గ్రంథాలయాలను ఇతర ప్రభుత్వ శాఖల భవనాల్లో నిర్వహిస్తున్నారు. మంథని, సుల్తానాబాద్ పట్టణాల్లో సొంత భవనాలున్నా వసతులు లేవు. ఓదెల, గోదావరిఖని, కమాన్‌పూర్ గ్రంథాలయాలను అద్దె భవనాల్లో నిర్వహిస్తున్నారు. ముత్తారంలో దాదాపు 25 ఏళ్ల కిందట గ్రంథాలయం ఉండేది. నిర్వహణ లేక మూతబడగా పునఃప్రారంభానికి పాలకుల చొరవ కరవైంది. ఎలిగేడు, అంతర్గాం, పాలకుర్తి, రామగిరి మండలాలకు గ్రంథాలయాలు మంజూరు కాలేదు. అద్దె భవనాల్లో గదులు శిథిలావస్థకు చేరడంతో వర్షాలకు పుస్తకాలు పాడవుతున్నాయి. ఇంటర్నెట్, వసతుల కల్పనపై దృష్టి సారించలేకపోతున్నారు.

**నిధుల్లేక నీరసం**

గతంలో జిల్లా గ్రంథాలయానికి, కాల్వశ్రీరాంపూర్, ఓదెల గ్రంథాలయానికి పక్కా భవనాల నిర్మాణానికి రూ.90 లక్షలు మంజూరయ్యాయి. మూడు చోట్ల స్థలాలు అందుబాటులో లేకపోవడంతో నిధులు వెనక్కి వెళ్లాయి. పెద్దపల్లి అకాశవాణి కేంద్రంలో ఇటీవల 12 గుంటల స్థలాన్ని కేటాయించారు. నిధుల మంజూరులో జాప్యం నెలకొంది. ఇంటర్నెట్ కనెక్షన్ ఇవ్వడం లేదు. డిజిటల్ గ్రంథాలయాల ఏర్పాటు కలగా మారింది.

**భవనాలకు ప్రతిపాదనలు పంపించాం**

పెద్దపల్లి, జూలపల్లి, ధర్మారం, కాల్వశ్రీరాంపూర్‌లలో కొత్త భవనాలకు ప్రతిపాదనలు పంపించాం. నిధులు మంజూరైన వెంటనే పనులు చేపడతాం. పోటీ పరీక్షలకు అవసరమైన పుస్తకాలను సమకూరుస్తున్నాం. వసతుల కొరత లేకుండా చర్యలు తీసుకుంటున్నాం. కరుణ, జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి

# భక్తజన పరవశం.. శ్రీగిరి మార్గం

ఆత్మకూరు : ప్రకృతి రమణీయ సుందర దృశ్యాలకు నల్లమల చిరునామాగా నిలిచింది. శ్రీగిరికోన శివనామస్మరణతో మార్మోగుతోంది. శివరాత్రికి మల్లికార్జున, అమ్మవార్లను దర్శించుకోవడానికి వచ్చే భక్తులు నల్లమలలోని పలు ఆలయాలను సందర్శిస్తున్నారు. ఇక్కడి విశేషాలను తెలుసుకొని ఆనందానుభూతిని పొందుతున్నారు.

అరణ్యమార్గంలో 40 కి.మీ: శ్రీశైలానికి కాలిబాటన దర్శించుకోవాలనుకునే వారు తొలుత ఆత్మకూరు మండలం వెంకటాపురం గ్రామం నుంచి అరణ్యమార్గంలో 40 కి.మీ.లు ప్రయాణించాలి. వెంకటాపురం నుంచి 6 కి.మీ.లు వెళ్తే గోసాయికట్ట ఆంజనేయస్వామి గుడి వస్తుంది. అక్కడ నుంచి నాగలూటి క్షేత్రానికి 9, దామర్లకుంటకు 8, పెచ్చెర్వుకు 2, మఠంబావికి 6, భీమునికొలనుకు 3, కైలాసద్వారానికి 2, అక్కడ నుంచి 4 కి.మీ.లు నడిస్తే శ్రీశైల మల్లికార్జునస్వామి, అమ్మవార్లను దర్శించుకోవచ్చు. ఆత్మకూరు మండలం వెంకటాపురం నుంచి నడకబాటను ప్రారంభించాలి.

బ్రిటిష్ కాలం నాటి గ్రామం పెచ్చెర్వు: దామర్లకుంట తర్వాత పెచ్చెర్వు గూడేన్ని సందర్శించొచ్చు. అప్పటి బ్రిటిష్ దొరలు సరకుల రవాణా కోసం ఈ గ్రామాన్ని అభివృద్ధి చేశారు. ఆసుపత్రి శిలాఫలకం, బ్రిటిష్ దొరల కార్యాలయాలు, శిథిల భవనాలు,



పురాతన బావిని చూడొచ్చు.

వీరభద్రుని తాపలు: పెచ్చెర్వు నుంచి కొంత దూరం వెళ్లగానే వీరభద్రుని తాపలు వస్తాయి. ఇక్కడ కొలువైన వీర భద్రుడిని పూజించి మెట్ల మార్గంలో నడిచి వెళ్తారు.

కోర్కెల కొండ: పెచ్చెర్వు నుంచి భీముని కొలనుకు వెళ్లే మార్గంలో మెట్లమార్గంలో కోర్కెల కొండ ఉంటుంది. సంతానం, సొంత ఇళ్లు కావాలనుకునేవారు ముడుపులు కడతారు.

మఠం బావి: బిటిష్‌ల కాలంలో బావిని కట్టించారు. ఈ దారిన వెళ్లే వారు ఈ బావి నీటిని తాగి దాహార్తిని తీర్చుకుంటారు.

గోసాయికట్ట ఆంజనేయ స్వామిగుడి: వెంకటాపురం తర్వాత గోసాయి కట్ట ఆంజనేయస్వామి గుడి వస్తుంది. శాలిబాయి అనే మహిళ ఆవులను ఇక్కడ మేపుతుండటం, అందరూ ఆమెను గోసాయమ్మగా పిలవడంతో ఈ ప్రాంతానికి గోసాయికట్టగా పేరొచ్చింది. అప్పట్లో రాజులు ఆంజనేయ స్వామి విగ్రహాన్ని ప్రతిష్ఠించగా, భక్తులు గుడిని కట్టించడంతో అందరూ ఇక్కడ పూజలు చేస్తున్నారు.

నాగలూటి వీరభద్రాలయం: గోసాయి కట్ట తర్వాత నల్లమలలో శ్రీశైల ముఖద్వారంగా పేరుగాంచిన నాగలూటి వీరభద్రాలయాన్ని భక్తులు సందర్శిస్తారు. ఎలాంటి ఇబ్బందులు లేకుండా క్షేమంగా వెళ్లేలా చూడాలని ఇక్కడి వీరభద్రుడిని మొక్కుతారు. 15వ శతాబ్దంలో విజయనగర రాజులు నిర్మించారని కొందరు చెబుతుంటే...తాబేలు, పాము, బల్లి వంటి చిత్రాలను బట్టి చాళుక్య రాజులు ఆలయాన్ని నిర్మించారని ఇంకొందరు చెబుతున్నారు.

దామర్ల కుంట: వీరభద్రస్వామిని దర్శించుకున్నాక తర్వాత దామర్లకుంట వస్తుంది. అడవి జంతువులు సంచరించే ప్రాంతమిది. ఇక్కడ నీటి కుంట వన్యప్రాణుల దాహార్తిని తీరుస్తుంది. సహజసిద్ధమైన ఉప్పు నీటి వనరులు ఇక్కడ ఉన్నాయి. జంతువుల ప్రశాంతతకు భంగం కలగకుండా పాదయాత్ర చేయాలి.


భీముని కొలను: పెచ్చెర్వు నుంచి పాదచారులు భీముని కొలను మీదుగా ప్రయాణించాలి. సముద్రమట్టానికి ఈ ప్రాంతం 585 మీటర్ల ఎత్తున ఉంటుంది. భీమునికొలను నుంచి 60 మెట్లు పైకెక్కితే కైలాసద్వారానికి చేరుకోవచ్చు.

కైలాస ద్వారం: కైలాస ద్వారంలో భక్తులు కైలాసవాసుడ్ని స్మరించుకుంటూ ముందుకు సాగి శ్రీశైల మల్లికార్జున, అమ్మవార్లను దర్శించుకుంటారు.

శిఖర దర్శనం: శిఖర క్షేత్రంలోని నందీశ్వరుని కొమ్ముల మధ్య నుంచి శ్రీశైలక్షేత్రం ప్రధాన గర్భాలయంలోని మల్లికార్జునుడ్ని దర్శించుకుంటే పునర్జన్మ ఉండదని భక్తుల నమ్మకం.

# పేదోళ్లు ఎందరున్నారు

కర్నూలు : విద్యుత్తు సౌకర్యం లేని కుటుంబాలెన్ని ? కట్టెల పొయ్యిపైనే ఎంత మంది వంట చేసుకొంటున్నారు ? పక్కా గృహం లేనివారెందరు ? బ్యాంకు సేవలకు ఎంత మంది దూరంగా ఉన్నారు.. తదితర వివరాలు సచివాలయ సిబ్బంది సేకరించి యాప్‌లో పొందుపరుస్తున్నారు. పేదరిక నిర్మూలనలో భాగంగా కూటమి ప్రభుత్వం పీ4 సర్వేకు శ్రీకారం చుట్టింది. ప్రభుత్వ-ప్రైవేటు-ప్రజల భాగస్వామ్యంతో చేపట్టే ఈ ప్రక్రియనే పీ4. పూర్తిగా పేదరికంలో ఉన్న 20 శాతం కుటుంబాలకు ఆర్థిక స్థితిమంతులు, ఎన్‌ఆర్‌ఐలు సాయం చేస్తారు. ఇందులో భాగంగా ఈ నెల 20 నుంచి వచ్చే నెల 2 వరకు గ్రామ, వార్డు సచివాలయాల పరిధిలో ప్రతి క్లస్టర్‌లో సర్వే నిర్వహిస్తారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో 13,31,113 కుటుంబాలు



న్నాయి. 12,14,379 కుటుంబాలు రేషన్‌కార్డులు కలిగి ఉన్నాయి. అందులో దారిద్ర్యరేఖకు దిగువనున్న 80 శాతానికి పైగా కుటుంబాల (9,97,724) ఆర్థిక పరిస్థితిపై ఆరా తీస్తున్నారు.

కర్నూలు జిల్లాలో 672 సచివాలయాల పరిధిలో 10,442 క్లస్టర్లు ఉండగా.. ఒక్కో క్లస్టర్‌కు 20 నుంచి 40 కుటుంబాలకు పైగా సర్వే పరిధిలోకి వస్తున్నాయి.

నంద్యాలలో 516 సచివాలయాల్లో 9,249 క్లస్టర్లుండగా.. ఒక్కో క్లస్టర్‌కు సుమారు 20-35 కుటుంబాల వరకు సర్వే పరిధిలోకి వస్తున్నాయి. ఒక్కో సచివాలయ ఉద్యోగి రెండు నుంచి మూడు క్లస్టర్ల పరిధిలోని కుటుంబాలను సర్వే చేస్తున్నారు.

# మీపైనే ధ్యాస.. సమస్యలు తీరుస్తారని ఆశ




కర్నూలు: పల్లె ప్రజల ప్రధాన సమస్యలపై సమగ్రంగా చర్చించి..అవసరమైన నిధులపై ప్రభుత్వానికి నివేదిక పంపించడం, జిల్లాను ప్రగతిబాట వైపు నడిపించేందుకు జడ్పీ వేదిక కావాలని ఉమ్మడి జిల్లా ప్రజలు ఆకాంక్షిస్తున్నారు. మొక్కుబడి చర్చలు లేకుండా, కాలయాపన కబుర్లతో సమయం వృథా చేయొద్దని, కీలకాంశాలపై చర్చ జరగాలని కోరుతున్నారు. నేడు జిల్లాపరిషత్ 14వ సర్వసభ్య సమావేశం ఉదయం 11 గంటలకు జరగనున్న నేపథ్యంలో ఉమ్మడి జిల్లా ప్రజల ఆకాంక్షలివీ..

**వేసవిలో తాగునీటికి ఇబ్బందులు**

వేసవిలో తాగునీటి ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఉమ్మడి జిల్లాలో 132 గ్రామాల్లో మంచినీటి ఎద్దడి పొంచి ఉందని, రూ.10.56 కోట్ల నిధులు అవసరమని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు ప్రభుత్వానికి నివేదిక పంపించారు. ఈ క్రమంలో నిధులు వచ్చేలా చూడాలి.

గత ప్రభుత్వ హయాంలో జల్‌జీవన్ మిషన్ పనుల్లో అక్రమాలు జరిగాయని, వాటిపై విచారణ చేయాలని కూటమి అధికారంలోకి వచ్చిన తొలి సమావేశంలోనే (19.7.24) ఎమ్మెల్యేలు, ఎంపీలు జడ్పీ సభ దృష్టికి తెచ్చినా అడుగుపడలేదు.

కర్నూలు జిల్లా పశ్చిమప్రాంత ప్రజలు మంచినీటికి పడుతున్న ఇబ్బందులపైనా సంబంధిత అధికారులతో జడ్పీ తరఫున సమావేశం నిర్వహించని నేపథ్యంలో దీనిపై చర్చ జరగాలని కోరుతున్నారు.

ఉమ్మడి కర్నూలు జిల్లాలో వైద్య ఆరోగ్యం, ఉపాధి హామీ పథకం, వలసలు, గృహ నిర్మాణం తదితర శాఖలపై చర్చ జరగాలి. 2022 మే 5, 2022 ఆగస్టు 16న జరిగిన జడ్పీ సమావేశంలో వైద్య ఆరోగ్యంపై చర్చించినా...ఇంతవరకు వాటిని అజెండాలో చేర్చలేదు. కర్నూలు జిల్లా పశ్చిమప్రాంతంలో ఏటా వేసవిలో వలసలు జరుగుతున్న క్రమంలో వాటిపైన చర్చ జరగాలి.

'గుండ్రేవుల ప్రాజెక్టు'పైనా మాట్లాడాలి. వేదవతి, ఆర్డీఎస్‌లపైనా చర్చించాలి. భూసేకరణతో ఈ రెండు ప్రాజెక్టుల పనులు నిలిచిపోయాయి. టీబీ డ్యాం నుంచి ఎల్లెల్సీ, కేసీసీ కాల్వకు నీటివాటా అందడం లేదు. కేసీసీ నీటివాటాలో ఈఏడాది 3.500 టీఎంసీలు పొరుగు జిల్లాకు తరలించినా పట్టించుకోవడం లేదు.

పందికోన జలాశయం కింద 56 వేల ఎకరాలకు సాగునీరు ఇచ్చేందుకు అవకాశమున్నా.. పంటకాల్వలు లేకపోవడంతో అమలు కావడం లేదు. 68 చెరువుల ప్రాజెక్టుకు పూర్తి స్థాయిలో బడ్జెటు కేటాయించాలి.

నేటి ఉదయం 11 గంటలకు ఛైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి అధ్యక్షతన జరగనున్న సమావేశంలో మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, ఇరు జిల్లాల కలెక్టర్లు, వివిధ శాఖల అధికారులు హాజరవుతారు. గ్రామీణ నీటిసరఫరా, వ్యవసాయం, జలవనరులశాఖలను అజెండాలో చేర్చారు. 2025-26 ఏడాదికి గానూ జడ్పీ, మండల పరిషత్ బడ్జెట్‌ను ప్రవేశపెట్టనున్న నేపథ్యంలో పలు సమస్యలు పరిష్కారమవుతాయనిభావిస్తున్నారు.

# 'వంద'రోజుల ఉపాధికి భరోసా..!




విజయనగరం : జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో ఏడాదిలో వంద రోజుల పనిదినాల కల్పన గగనమవుతోంది. చట్టంలో నిర్దేశించినట్లు ఒక కుటుంబానికి వందరోజుల పని కల్పించాలి. జిల్లాలో గత ప్రభుత్వంలో వేతనదారులకు ఉపాధి కల్పన అందని ద్రాక్షగా మారింది. గడిచిన మూడేళ్లలో మరింత దయనీయం. దీంతో కుటుంబాలు ఆదాయాన్ని కోల్పోయాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ప్రతి కుటుంబానికీ పూర్తిరోజులు పని కల్పించేలా కూటమి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది.

గత అయిదేళ్లలో 18.24 లక్షల కుటుంబాలు ఉపాధి పనిలోకి రాగా, 3.32 లక్షలకు మాత్రమే పూర్తి పనిదినాలు దక్కాయి. 2021-22 నుంచి 2023-24 మధ్య ఇంకా దారుణమైన పరిస్థితి నెలకొంది. 10.47 లక్షలకు 69,278 మేర పూర్తి రోజులు పని కల్పించారు. ఇళ్ల నిర్మాణానికి 90 రోజుల పనిదినాలు కల్పించి ఎక్కువ సంఖ్యలో జాబ్‌కార్డులు జారీచేయడం, మొక్కల పెంపకం, ఇతరత్రా వ్యక్తిగత పనుల కోసం కొందరు జాబ్‌కార్డులు పొందారు. తర్వాత వీరంతా పనుల్లోకి రావడం మానేశారు. ప్రతి 15 రోజులకొకసారి మస్టర్ అప్‌డేట్ చేసుకోని పరిస్థితులే ఇందుకు కారణమని అధికారులు చెబుతున్నారు.

**కూటమి ప్రభుత్వంలో..**

2024-25లో 3.10 లక్షల కుటుంబాలు పనిలోకి వస్తున్నాయి. ఇప్పటివరకు 18,109 మేర పనిదినాలు కల్పించారు. ఈ నెలాఖరు నాటికి ఇంకో 77,265 కుటుంబాలకు పనికల్పించేలా చర్యలు తీసుకున్నారు. ఇందులో 81-99 రోజులు పూర్తిచేసుకున్నవారు 47,894 కుటుంబాలు ఉన్నాయి. 71-80 రోజుల మధ్య 29,371 మంది ఉన్నారు. సాంకేతిక సమస్యలతో 1,125 మంది పూర్తి పనిదినాలకు దూరమవుతున్నారు. వీరికి పనికల్పించేలా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినట్లు డ్వామా పీడీ శారదాదేవి కు తెలిపారు.

# చిన్నారులకు ప్రత్యేక సాయం



గరివిడి : దివ్యాంగ విద్యార్థులకు అన్నివిధాలా చేయూత అందించేందుకు కూటమి ప్రభుత్వం దృష్టి సారించింది. ప్రత్యేకావసరాల పిల్లలందరికీ ఉపకరణాలు అందించేందుకు చర్యలు చేపట్టింది. జిల్లా వ్యాప్తంగా 377 మందికి రూ.38.52 లక్షల విలువైన పరికరాలను మంజూరు చేసింది. వీటిని సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో పంపిణీ చేయనున్నారు. జిల్లాలో 18 ఏళ్లలోపు దివ్యాంగ విద్యార్థులు 4,367 మంది ఉన్నారు. వీరిలో 2,800 మంది భవిత కేంద్రాల్లో శిక్షణ పొందుతుండగా.. మిగతా వారు పాఠశాలల్లో చదువుతున్నారు. ఇదివరకే సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో వైద్యులతో ప్రత్యేక వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి గుర్తించారు. అవసరాల మేరకు చంక కర్రలు, చక్రాల కుర్చీలు, బ్రెయిలీ కిట్‌లు, బుద్ధి మాంద్యం పిల్లలకు అవసరమైన సామగ్రి అందించనున్నారు.

బకాయిల చెల్లింపు.. : భవిత కేంద్రాల్లో శిక్షణ పొందుతున్న పిల్లలకు చెల్లించాల్సిన భత్యాలను గత ప్రభుత్వం బకాయి ఉంచగా, ప్రస్తుత ప్రభుత్వం చెల్లించింది. జిల్లాలో 27 కేంద్రాల్లో శిక్షణ పొందుతున్న ప్రత్యేకావసరాల పిల్లలకు 2024-25కి సంబంధించి పది నెలల కాలానికి భత్యాలు రూ.73.9 లక్షలు తల్లిదండ్రుల ఖాతాలకే జమచేసింది. పిల్లలను తీసుకొస్తున్న తల్లిదండ్రులు, ఎస్కార్ట్, రవాణా భత్యం, ఇంటి వద్దే సేవలందుకున్న వారికి హోమ్ బేస్డ్ అలవెన్స్ చెల్లించింది.

త్వరలో పరికరాల పంపిణీ..

ప్రత్యేకావసరాల విద్యార్థులకు మజూరైన ఉపకరణాలన్నీ త్వరలోనే పంపిణీ చేస్తాం. దివ్యాంగుల చదువును ప్రోత్సహించి వారిలో ఆత్మస్థైర్యం నింపడానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుంది. రామారావు, పీవో, సమగ్ర శిక్ష, విజయనగరం.

# ఎస్.కోట ఆసుపత్రికి డయాలసిస్ కేంద్రం

శృంగవరపుకోట : శృంగవరపుకోట ప్రాంతీయాసుపత్రిలో రెండు నెలల్లో డయాలసిస్ కేంద్రం ఏర్పాటుకు సన్నాహాలు చేస్తున్నట్లు రాష్ట్ర వైద్యారోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ ప్రకటించడంతో జిల్లా వాసుల్లో హర్షం వ్యక్తమవుతోంది. పాలకొల్లులో జరిగిన డయాలసిస్ కేంద్రం ప్రారంభోత్సవంలో ఆమేరకు ఆయన ప్రకటించారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటయ్యాక జాతీయ ఆరోగ్య మిషన్-ప్రధానమంత్రి జాతీయ డయాలసిస్ కార్యక్రమం కింద 13 జిల్లాల్లోని 15 ఆసుపత్రుల్లో ఈ కేంద్రాల ఏర్పాటుకు నిర్ణయించింది. ఇందుకు చండీఘర్‌కు చెందిన రాహి కేర్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థతో ప్రభుత్వం ఒప్పందం కుదుర్చుకుంది. ఇందులో భాగంగా మరో రెండు నెలల్లో ఎస్.కోటతో పాటు ఇచ్ఛాపురం, సీతంపేట, వింజమూరుల్లో కేంద్రాలు ప్రారంభిస్తామని మంత్రి ప్రకటించారు. సేవలను ఆ సంస్థ అందించనుండగా, అవసరమైన వసతి, మంచినీటి సదుపాయం, విద్యుత్తు ప్రభుత్వం సమకూర్చనుంది.

**కొత్త భవనంలో ఏర్పాటుకు నిర్ణయం**

ఎస్.కోట ఆసుపత్రి ఆవరణలో కొత్తగా నిర్మిస్తున్న భవనం కింద అంతస్థులో ఈ కేంద్రం ఏర్పాటుకు వైద్యాధికారులు నిర్ణయించారు. ఎక్కువ ఓపీలు నమోదవుతుండడం, స్థలాభావం కారణంగా అక్కడ ఏర్పాటు చేయనున్నారు. ప్రాంతీయాసుపత్రి ఇన్‌ఛార్జి డా.నీల వద్ద ఈ విషయాన్ని ప్రస్తావించగా మంజూరైన కేంద్రాన్ని కింది అంస్థులో ఏర్పాటు చేస్తామని, సర్వీసు ప్రొవైడర్లకు అవసరమైన విధంగా సిద్ధం చేస్తామన్నారు. ఈ ప్రాంత డయాలసిస్ రోగులు ఇప్పటి వరకు విశాఖ, విజయనగరం వెళ్లాల్సి వచ్చేదని, 35 నుంచి 60 కి.మీ. దూరం ప్రయాణించేవారన్నారు. ఇది ఏర్పాటైతే ఆర్థిక భారం తప్పుతుందని పేర్కొన్నారు.

# కార్మిక బీమా.. కొండంత ధీమా..!

శ్రీకాకుళం : కార్మిక రాజ్య బీమా.. వ్యవస్థీకృత రంగంలో పని చేసేవారికి అండగా నిలిచే పథకం ఇది. దీని ద్వారా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనేక ప్రయోజనాలు అందిస్తున్నాయి. అవగాహన లేక చాలా మంది వాటిని పొందలేకపోతున్నారు. రేపు కార్మిక రాజ్య బీమా సంస్థ(ఈఎస్ఐసీ) దినోత్సవం సందర్భంగా జిల్లాలోని పరిస్థితిపై ప్రత్యేక కథనం..

రణస్థలం మండలంలోని పైడి భీమవరంలో ఈఎస్ఐ డిస్పెన్సరీ, శ్రీకాకుళం నగరంలో శాఖా కార్యాలయం ఉన్నాయి. జిల్లాలో సుమారు 30 వేల మంది కార్మికులు ఉండగా.. పైడిభీమవరం డిస్పెన్సరీ పరిధిలో 23 వేల మంది వరకు నమోదయ్యారు. ఇక్కడ పూర్తిస్థాయి భవనం సమకూరినప్పటికీ డిస్పెన్సరీలో రెగ్యులరు వైద్యుడు లేరు. పది పడకలతో కూడిన డయాగ్నోస్టిక్ సెంటరు, ఐదుగురు వైద్యులను నియమిస్తామని ఆసుపత్రి ఏర్పాటు సమయంలో జీవోలో పేర్కొన్నా జరగలేదు. ప్రస్తుతం ఇన్‌ఛార్జిగా వ్యవహరిస్తున్న విజయనగరం జిల్లా గరివిడి డిస్పెన్సరీ వైద్యుడు రెండు రోజులకోసారి ఇక్కడికి వస్తున్నారు. ఇద్దరు ల్యాబ్ టెక్నీషియన్లు ఉన్నప్పటికీ రోగ నిర్ధారణ పరీక్షలు చేసే పరికరాల్లేవు. జిల్లాలో లోకల్ ఆఫీసు సౌకర్యం లేకపోవడంతో సెలవు పెట్టిన రోజులకు వేతనం పొందాలంటే విజయనగరం వెళ్లాల్సి వస్తోంది. కార్మికులు అస్వస్థతకు గురైనప్పుడు, కార్మికురాలు ప్రసవించినప్పుడు, ఉద్యోగ నిర్వహణలో ప్రమాదాలకు గురైనప్పుడు, ఇతర పరిస్థితుల్లో వైద్య సౌకర్యం కల్పిస్తారు.

ఉద్యోగులతో పాటు వారి కుటుంబ సభ్యులకూ వైద్య సేవలు, రోగనిర్ధారణ పరీక్షలు ఈఎస్ఐ ఆసుపత్రి ద్వారా అందిస్తారు.

పని చేయలేని పరిస్థితుల్లోనూ వైద్యుని ధ్రువీకరణపై ఆర్థిక సాయం పొందొచ్చు. కార్మికుడు విధి నిర్వహణలో ఉన్నప్పుడు, ఉద్యోగానికి వెళ్తున్నప్పుడు ప్రమాదం జరిగి మృతి చెందితే వారిపై ఆధారపడిన వారికి నెలవారీ పింఛను రూపంలో ఇస్తారు.



స్వచ్ఛందంగా ఉద్యోగ విరమణ చేసిన బీమాదారులు వారి జీవిత భాగస్వామికి ఏడాదికి రూ.120 ముందుగా చెల్లిస్తే ఆయన మరణించినా ఆమె వైద్య సేవలు పొందే వీలుంటుంది.ః ప్రసవం, కొన్ని శస్త్రచికిత్సలు చేయించుకున్నవారికి నిర్దేశిత రోజులకు వేతనం చెల్లిస్తారు. ఏదైనా సంస్థ, పరిశ్రమలో కనీసం పది మంది కార్మికులు ఉండి.. వారిలో రూ.21 వేలు కంటే తక్కువ జీతం ఉన్నవారంతా ఈఎస్ఐ పరిధిలోకి వస్తారు. వారి పేరున ఆయా సంస్థలు ఇచ్చే వేతనంపై యజమాని వాటాగా 3.25 శాతం, కార్మికుడి వాటాగా 0.75 శాతం ఈఎస్ఐకి జమ చేయాలి. దీని ద్వారా కార్మికులు అనారోగ్యం పాలైనా, ఇతర ఏ సమస్య వచ్చినా ఈఎస్ఐసీ ద్వారా లబ్ధి పొందవచ్చు.

**ఆయా సంస్థలపై చర్యలు తప్పవు..**

అర్హులైన కార్మికులను ఆయా సంస్థలు ఈఎస్ఐ పరిధిలోకి చేర్చాలి. లేకుంటే చర్యలు తప్పవు. అర్హులందరి వివరాలు శ్రమ సువిధ పోర్టల్‌లో నమోదు చేసుకోవాలి. అవగాహన లేనివారు శ్రీకాకుళం నగరంలో బలగలోని ఈఎస్ఐ శాఖ కార్యాలయాన్ని సంప్రదించొచ్చు. - ప్రజ్ఞ, ఈఎస్ఐ కార్యాలయం బ్రాంచి మేనేజరు,

# అడుగంటిన గొట్టా..!

శ్రీకాకుళం : వంశధార ఆయకట్టు పరిధిలో రబీ సాగు చేస్తున్న రైతన్నలకు నీటికష్టాలు తప్పలేదు. క్యాచ్‌మెంట్ ఏరియా ఒడిశాలో గతేడాది అక్టోబరు నుంచి వర్షపాతం నమోదు కాకపోవడంతో గొట్టాబ్యారేజీ వద్ద నీటి నిల్వలు తగ్గిపోయాయి. ఫలితంగా కుడి, ఎడమప్రధాన కాలువలకు సాగు నీరు అందించలేని పరిస్థితి నెలకొంది.

**ఎడమ కాలువకు అరకొర..**

బ్యారేజీ వద్ద కనీస నీటిమట్టం 36 మీటర్లుంటేనే కుడి ప్రధాన కాలువకు విడిచిపెట్టే అవకాశం ఉంటుంది. ప్రస్తుతం బెడ్ లెవెల్ 35 మీటర్ల నీటి మట్టం మాత్రమే నీరుంది. ఈ నిల్వతో ఎడమ ప్రధాన కాలువకు కేవలం 130 క్యూసెక్కుల నీటిని విడుదల చేయగలుగుతున్నారు. నీటి ప్రవాహం జలుమూరు మండలం వరకు మాత్రమే చేరుతోంది.

**డెడ్ స్టోరేజీ..**

వంశధార జలాశయంలో డెడ్ స్టోరేజీ (2 టిఎంసీలు) నిల్వ ఉంది. కుడి ప్రధాన కాలువకు విడిచిపెట్టేందుకు అవసరమైనంత నీరు లేకపోయినప్పటికి ఇటీవల ప్రాజెక్టు కమిటీ అధ్యక్షుడు రవీంద్ర, రైతుల వినతి మేరకు జలాశయ గర్భంలో పొక్లెయినర్‌తో కాలువ తవ్వి లింకు కాలువ ద్వారా కుడి కాలువలకు నీరు విడిచిపెట్టారు. నీటి మట్టం



తగ్గడంతో ఈ సరఫరా నిలిచిపోయింది.

**వర్షాభావంతో ఇక్కట్లు**

సాధారణంగా 300 క్యూసెక్కుల నీటి ప్రవాహం ఉంటేనే కాలువలకు నీరు విడిచిపెట్టేందుకు అవకాశం ఉంటుంది. ప్రస్తుతం గొట్టాబ్యారేజీ వద్ద 130 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉన్నట్లు అధికారులు అంచనా వేస్తున్నారు. గత ఖరీఫ్ సీజన్‌లోను సరైన వర్షాలు లేకపోవడంతో వరద కాలువ ద్వారా జలాశయంలోకి నీటిని నింపలేకపోయారు. దీంతో ఇప్పుడు సమస్య నెలకొంది.

**జలాశయపనులు పూర్తయితేనే పరిష్కారం**

జిల్లాలో సాగు, తాగునీటి సమస్యకు పరిష్కారం వంశధార జలాశయంతోనే సాధ్యం. 17 ఏళ్ల వ్యవధిలో 95 శాతం పనులు పూర్తయ్యాయి. మిగిలిన బిల్లులు మంజూరైతే గుత్తేదారు పూర్తి చేసేందుకు సిద్ధంగా ఉన్నారు. కూటమి ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తే వచ్చే ఖరీఫ్ నాటికి జలాశయంలో 19 టీఎంసీల నీటి నిల్వ చేసుకునేందుకు వీలు కలుగుతుంది. తద్వారా జిల్లాలో సాగు, తాగునీటి సమస్య పరిష్కారం అవుతుంది.ఇన్‌ఫ్లో తగ్గడంతో సమస్య.. నది క్యాచ్‌మెంట్ ప్రాంతం ఒడిశాలో వర్షాల్లేకనే సమస్య నెలకొంది. రబీలో అనధికారికంగా నీరు విడుదల చేయాల్సి ఉన్నప్పటికీ సరిపడేంత లేకనే ఈ పరిస్థితి. ఉన్న నీటిని రైతులు పొదుపుగా ఉపయోగించుకోవాలి. ఎత్తిపోతల పథక పనులు 36 శాతం జరిగాయి. వీటితో జలాశయం పనులు త్వరగా పూర్తి చేసి రైతులకు నీరందిస్తాం.- తిరుపతిరావు, వంశధార ఎస్ఈ, శ్రీకాకుళం

# దస్త్రం తొక్కిపెట్టి.. టీడీఆర్‌లు కట్టబెట్టి

విశాఖపట్నం: ఓ కీలక దస్త్రాన్ని అధికారుల కమిటీ తొక్కిపెట్టింది. గత ప్రభుత్వంలో వైకాపా నేతల ఒత్తిళ్లతో నివేదికల్లో ఎక్కడా ఆ దస్త్రం గురించి ప్రస్తావించలేదు. సుమారు రూ.200 కోట్ల విలువైన టీడీఆర్ బాండ్లు అనుకున్నవారికి కట్టబెట్టేశారు. స్థల యజమానికి ప్రత్యామ్నాయ స్థలం ఇవ్వడం, మళ్లీ అదే స్థలంలో ఆక్రమణదారులకు నాలుగు రెట్లు టీడీఆర్‌లు ఇవ్వడం ప్రస్తుతం కలకలం రేపుతోంది.గోశాల నుంచి అడవివరం వరకు సింహాచలం బీఆర్టీఎస్ రహదారి విస్తరణ గతంలో చేపట్టారు. రోడ్డుకు ఇరువైపులా సింహాచలం దేవస్థానం భూములు కొంత తీసుకున్నారు. ఈ నేపథ్యంలో జీవీఎంసీ 2012లో దేవస్థానానికి ప్రత్యామ్నాయంగా సర్వే నెంబరు 26లో 7 ఎకరాల భూమిని ముడసర్లోవలో కేటాయించింది. దాని విలువ ఇప్పుడు రూ.500కోట్ల వరకు ఉంటుంది. స్థలానికి స్థలం ప్రత్యామ్నాయంగా ఇచ్చినా మళ్లీ అక్కడున్న ఆక్రమణదారులకు కొన్ని నెలల క్రితం టీడీఆర్ బాండ్లు ఇచ్చారు. 2.72 ఎకరాల భూమికి సంబంధించి 210పైగా బాండ్లు మంజూరు చేశారు. వాటి విలువ సుమారు రూ.200కోట్లు పైమాటే. గజం రూ.35వేల చొప్పున దానికి



నాలుగు రెట్లుగా గజానికి రూ.1.40లక్షల బాండ్లు ఇచ్చారు. టీడీఆర్‌లు అందుకున్న వారిలో కొందరు వైకాపా నాయకులున్నారు.

**అనుకూలంగా రాసిచ్చేశారు..**

టీడీఆర్‌ల మంజూరుపై తహసీల్దార్, సబ్ రిజిస్ట్రార్, టౌన్ ప్లానింగ్ డిప్యూటీ డైరెక్టర్, జీవీఎంసీ రెవెన్యూ అడిషనల్ కమిషనర్, సీసీపీ అధికారులతో పరిశీలన కమిటీ వేశారు. గతంలో దేవస్థానానికి జీవీఎంసీ స్థలం ఇచ్చిందని ఎక్కడా పొందుపర్చకుండా, పరిశీలన కమిటీ టీడీఆర్‌లు మంజూరు చేయడానికి అనుకూలంగా నివేదిక ఇచ్చిందనే విమర్శలున్నాయి. వాస్తవానికి దేవస్థానానికి భూమి ప్రత్యామ్నాయంగా ఇస్తూ, ఆక్రమణదారులకు కూడా టీడీఆర్‌లు ఇస్తున్నామని నివేదికలో రాయాలి. అలా రాయకపోగా, రిజిస్టర్ గిఫ్ట్‌డీడ్ ద్వారా టీడీఆర్ ఇవ్వాల్సి ఉన్నప్పటికీ, నోటరైజ్డ్ అఫిడవిట్ మీద టీడీఆర్‌లు ఇచ్చేయొచ్చని ఉచిత సలహా ఇచ్చారు.

**తాజా నివేదికల్లోనూ ఆ దస్త్రం లేదు..**

బీఆర్టీఎస్ విస్తరణలో ఇప్పటికే 210 టీడీఆర్ పత్రాలు ఇచ్చారు. అయితే పలు ఆరోపణల నేపథ్యంలో వాటిని వినియోగించకుండా హోల్డ్‌లో పెట్టారు. ప్రస్తుతం ఆ టీడీఆర్‌ల వినియోగానికి అవకాశం కల్పించాలంటూ కొందరు పావులు కదిపారు. ఈ నేపథ్యంలో కూటమి ప్రభుత్వం దీనిపై తాజాగా నివేదిక కోరగా, జీవీఎంసీ అధికారులు ఆగమేఘాలపై జిల్లా కలెక్టర్‌కు దస్త్రం పంపారు. అందులోనూ దేవస్థానానికి ప్రత్యామ్నాయంగా ఇచ్చిన భూమికి సంబంధించి దస్త్రం చూపకపోవడం గమనార్హం. పాత టీడీఆర్‌లు విడుదల చేయడంతోపాటు... కొత్తగా మరో 186 టీడీఆర్‌లు ఇవ్వాలంటూ కొందరు నాయకులు అధికారులపై ఒత్తిళ్లు తెస్తున్నట్లు సమాచారం.

# తాగినా.. తాకినా రోగాలే

నంద్యాల : ఉమ్మడి జిల్లా ప్రజల తాగు, సాగునీటి అవసరాలు తీరుస్తున్న తుంగభద్ర, హంద్రీ, కృష్ణా, కుందూనదులు కాలుష్య కాసారాలుగా మారిపోయాయి. నీటిలో కోలిఫాం బ్యాక్టీరియా అసలు ఉండకూడదు. కర్నూలు మండలం పంచలింగాల, తాండ్రపా డు, మామిదాలపాడు, జొహరాపురం తదితర ప్రాంతాల్లో తుంగభద్ర నీటిలో ఈ బ్యాక్టీరియా ఉన్నట్లు తేలింది. కోలిఫా 50 సీఎఫ్‌యూ దాటితో కచ్చితంగా ఆ నీటిని శుద్ధిచేసి తాగాలి. డయేరియా తదితర వ్యాధుల బారినపడే ప్రమాదం ఉంది. ఈ నీళ్లతో నేరుగా స్నానం చేసినా చర్మవ్యాధుల బారినపడాల్సి ఉంటుంది.

**జలచరాల ఉక్కిరిబిక్కిరి**

జలచరాలు మనుగడ సాగించాలంటే నీటిలో కరిగిన ఆక్సిజన్ (డీవో) తగు మోతాదులో ఉండాలి. లీటరు నీటిలో కనీసం 4 మిల్లీగ్రాములు.. అంతకన్నా ఎక్కువ ఉండాలి. అంతకంటే తక్కువుంటే జలచరాల ప్రాణాలకు ముప్పు కలుగుతుంది. కుందూనది పొడవునా డీవో తక్కువగా ఉంది. నంద్యాల పట్టణ శివార్లలోని ఉడుమాల్పురం నుంచి పాణ్యం మండలం తొగర్చేడు, మద్దూరు, ఉయ్యాలవాడ, కోవెలకుంట్ల, గోస్పాడు తదితర మండలాల్లో ఈ సమస్య తీవ్రంగా ఉంది. ఈ ప్రాంతాల్లో నీటిలో ఆక్సిజన్



3.5 మిల్లీగ్రాముల వరకే ఉంటోందని పరీక్షల్లో వెల్లడైంది.

**నదుల్లోకి నేరుగా మురుగు**

తుంగభద్ర నదిపై 11 సీపీడబ్ల్యూ పథకాలు నడుస్తున్నాయి. 133 గ్రామాల పరిధిలోని సుమారు 3 లక్షల మందికి ఈ నీళ్లే ఆధారం. కర్నూలు నగరం నుంచి రోజూ విడుదలవుతున్న 60 ఎంఎల్‌డీ మురుగునీరు నేరుగా నదిలో కలుస్తోంది. సాధారణంగా మురుగునీటిలో కోలిఫాం 100 మి.లీకు సగటున 600 సీఎఫ్‌యూ ఉండాలి. తుంగలో ఇది 1100- 1200 సీఎఫ్‌యూ దాటుతున్నట్లు కాలుష్య నియంత్రణ మండలి చెబుతోంది.

నంద్యాల పురపాలక సంఘంలో రోజూ 30 ఎంఎల్‌డీ మురుగునీరు నేరుగా కుందూనదిలోకే వదలుతున్నారు. ఈ మురుగులో కోలిఫాం 1000 సీఎఫ్‌యూ వరకు ఉంది.

ఉమ్మడి జిల్లాలో 306 కి.మీలు ప్రవహించే కేసీ కాల్వ మురుగు కూపంగా మారింది. పరిశ్రమల నుంచి రసాయన వ్యర్థాలు వదులుతున్నారు. నంద్యాల పట్టణ శివార్లలోని విత్తన శుద్ధి కేంద్రాల వారు వ్యర్థ జలాలను కేసీలోకి కలుపుతున్నారు.

**టర్బిడిటీతో సమస్యలు** నీటిలో 1- 4 పాయింట్ల వరకు టర్బిడిటీ ఉండాలి. పరిమితి దాటితే మట్టితో సహా ఇతర కణాలు దెబ్బతింటాయి. పశ్చిమ ప్రాంతంలోని గోనెగండ్ల, మంత్రాలయం, కౌతాళం ప్రాంతాలతో పాటు తూర్పు ప్రాంతలోని ఆత్మకూరు, కొలిమిగుండ్ల మండలాల్లో అర్బిడిటీ అధికంగా ఉంది. ఈ నీటిని పంటలకు ఉపయోగించడం వల్ల ఆయా ప్రాంతాల్లో మొక్కలకు సరిగ్గా ఆక్సిజన్ అందడం లేదని గతంలోనే వ్యవసాయ శాస్త్రవేత్తలు స్పష్టం చేశారు.

# బాధలెవరికి చెప్పుకోవాలి స్వామీ!



అనంతపురం : జిల్లా నుంచి తిరుపతి వెళ్లాలనుకునే శ్రీవారి భక్తులు ఇదివరకు ఎన్నడూ లేని ప్రయాణ కష్టాలను చవిచూస్తున్నారు. తిరుపతి చేరుకునేందుకు అసలే అంతంత మాత్రం రైళ్ల సదుపాయం ఉంది. ఈ నేపథ్యంలో ఏకంగా రెండు ప్యాసింజరు సర్వీసు రైళ్లను రద్దు చేయడంతో భక్తులకు కష్టాలు రెట్టింపయ్యాయి.

**వామ్మో.. వారాంతపు రైళ్లా?**

గుంతకల్లు నుంచి తిరుపతికి రాత్రి వేళలో తిరుపతి-కదిరిదేవరపల్లి (57405/06), పగటివేళల్లో (57403/04) రైళ్లు నడుస్తున్నాయి. జిల్లావాసులు వీటికే ప్రాధాన్యం ఇస్తారు. ఎక్స్‌ప్రెస్ రైళ్లు వారంలో ఐదు రోజులు ఉన్నా.. అర్ధరాత్రి సమయంలో వెళ్లిపోతాయి. సీట్లు దొరకవు. ఈ వారాంతపు రైళ్లు అన్నీ సికింద్రాబాద్, కాచిగూడ, అమరావతి, అకోలా నుంచి నడిచేవి కావడంతో జిల్లావాసులకు రిజర్వేషన్ దొరకదు. అందుకే ప్యాసింజర్ రైళ్లకే మొగ్గు చూపుతారు. కదిరి దేవరపల్లి రైలు రాయదుర్గం, బళ్లారి, గుంతకల్లు, అనంతపురం, కదిరి, మదనపల్లి మీదుగా తిరుపతికి వెళ్తుంది. కళ్యాణదుర్గం, రాయదుర్గం, బళ్లారి ప్రయాణికులకు ఇది బాగా అనుకూలం. జనవరిలో ఈ రెండు సర్వీసులను రద్దు చేసి.. కుంభమేళాకు పంపారు. కుంభమేళా గత నెల 25నే ముగిసింది. అయితే మార్చి 7 నుంచి తిరిగి నడుపుతామని తొలుత రైల్వే అధికారులు ప్రకటించారు. మళ్లీ మార్చి నెలాఖరు రద్దు కొనసాగిస్తున్నట్లు ప్రకటన చేయడంతో భక్తుల నుంచి నిరసన వ్యక్తం అవుతోంది.

**ఛార్జీల మోత..**

అనంతపురం నుంచి తిరుపతికి వెళ్లాలంటే ప్యాసింజర్ రైలులో సాధారణ బోగీలో అయితే రూ.65, రిజర్వేషన్ అయితే రూ.180 ఛార్జీ ఉంది. బస్సులో అయితే రూ.350కు పైమాటే. ప్రైవేటు వాహనాల్లో అయితే రూ.500 నుంచి రూ.2000 దాకా చెల్లించి వెళ్లాల్సిన పరిస్థితి.

**ఒక్కటి కూడా లేదు!**

గుంతకల్లు డివిజన్ కేంద్రం నుంచి అనంతపురం మీదుగా తిరుపతికి వెళ్లడానికి ఒక్క ఎక్స్‌ప్రెస్ రైలు కూడా లేకపోవడం దారుణం. ఉన్నవన్నీ వారాంతపు రైళ్లే. గతంలో మీటరు గేజును బ్రాడ్ గేజుగా మార్పు చేయక మునుపు, బళ్లారి నుంచి తిరుపతికి ఎక్స్‌ప్రెస్ రైలు నడిచేది. గేజు మార్పిడి జరిగిన తర్వాత పట్టాలు ఎక్కలేదు. గతంలో కాచిగూడ- తిరుపతి వెంకటాద్రి ఎక్స్‌ప్రెస్ అనంతపురం మీదుగా నడిచేది. గేజు మార్పిడి తర్వాత ఇదీ పట్టాలెక్కలేదు. ప్రస్తుతం వెంకటాద్రి ఎక్స్‌ప్రెస్ గుత్తి, తాడిపత్రి, రేణిగుంట మీదుగా తిరుపతికి వెళ్తోంది. ప్రస్తుతం ధర్మవరం నుంచి తిరుపతి మీదుగా నర్సాపూర్ వెళ్లే రైళ్లను అనంతపురం దాకా పొడగించాలని ప్రయాణికులు ఎప్పటినుంచో కోరుతున్నారు. ఆచరణలోకి రాలేదు.

# నిధులు నిష్ప్రయోజనం.. వైకాపాదే పాపం!



కదిరి : శ్రీసత్యసాయి జిల్లాలో రూ.కోట్లు వెచ్చించి నిర్మించిన ఎంపీఎఫ్‌సీ గోదాములు నిరుపయోగంగా మారాయి. రైతులకు ఎంతగానో ఉపయోగపడాల్సిన గోదాములు నిర్మించి నెలలు గడుస్తున్నా ఎందుకూ కొరగానివిగా మిగిలాయి. మొత్తం 90 నిర్మిస్తే 3 మాత్రమే వినియోగంలో ఉన్నాయి. వాటిని సరైనచోట నిర్మించకపోవడమే అందుకు కారణం. గత వైకాపా ప్రభుత్వ హయాంలో బహుళ ప్రయోజన సౌకర్య గోదాములు (ఎంపీఎఫ్‌సీ) నాబార్డు నిధులతో నిర్మించారు.

**మూడు మాత్రమే వినియోగం**

2022 నుంచి 2024 మధ్య కాలంలో శ్రీసత్యసాయి జిల్లాకు 500, 1000 మెట్రిక్ టన్నుల సామర్థ్యం కలిగిన మొత్తం 90 గోదాములు మంజూరయ్యాయి. 500 మెట్రిక్ టన్నుల సామర్థ్యం గోదాములు మొత్తం 75 మంజూరుకాగా 58 నిర్మాణాలు పూర్తయ్యాయి. 17 వివిధ నిర్మాణ దశల్లో ఉన్నాయి. ఒక్కో దాని నిర్మాణానికి రూ.40 లక్షలు నాబార్డు నుంచి విడుదలయ్యాయి. అదేవిధంగా 1000 మెట్రిక్ టన్నుల సామర్థ్యం గోదాములు 15 మంజూరు కాగా 2 నిర్మాణాలు పూర్తయ్యాయి. 13 నిర్మాణ దశల్లో ఉన్నాయి. ఒక్కో దాని నిర్మాణానికి రూ.80 లక్షలు మంజూరయ్యాయి. ప్రాథమిక సహకార సంఘాలకు నిర్మాణ పర్యవేక్షణ బాధ్యతలు అప్పగించారు. జిల్లా వ్యాప్తంగా మొత్తం 90 గోదాములకుగాను 60 నిర్మాణాలు పూర్తయ్యాయి. పాలసముద్రం, రొద్దంలో ఉన్న 3 గోదాములు మాత్రమే వినియోగంలో ఉన్నాయి.

**స్థలాల ఎంపికలోనే లోపం**

పంటలకు సరైన ధర లేని సమయాల్లో, ప్రకృతి విపత్తుల సందర్భంలో పంట ఉత్పత్తులు నిల్వ చేసుకునేందుకు గోదాములు అందుబాటులో లేకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ పరిస్థితుల్లో గత ప్రభుత్వం వాటి నిర్మాణం చేపట్టడంతో ఇబ్బందులు తొలగిపోతాయని అన్నదాతలు ఆశించారు. అయితే నిర్మాణానికి స్థలాల ఎంపిక చేపట్టేటప్పుడు ప్రాథమిక సూత్రాలను కూడా పరిగణలోకి తీసుకోలేదు. వైకాపా నాయకులు మితిమీరిన జోక్యం వల్లే గ్రామానికి, రోడ్డుకు దూరంగా.. పంట ఉత్పత్తులు తరలించేందుకు అనువుగాని చోట గోదాములు నిర్మించారు. దీంతో వాటిని రైతులు వినియోగించుకోవడంపై ఆసక్తి చూపడంలేదు. ఫలితంగా అవి నిరుపయోగంగా మారాయి. రూ.కోట్లు వెచ్చించినా ప్రయోజనం చేకూరింది శూన్యం.

**ఇతర శాఖలకు కేటాయిస్తాం- కృష్ణానాయక్, జిల్లా సహకార శాఖ అధికారి, పుట్టపర్తి**

రైతులు ఆసక్తి చూపని ఎంపీఎఫ్‌సీ గోదాములను ఇతర శాఖలకు అద్దెకు ఇస్తాం. ఖాళీగా ఉన్న వాటి సమాచారం ఇప్పటికే ఆయా శాఖల అధికారులకు ఇచ్చాం. నిబంధనల మేరకు వాటిని కేటాయిస్తాం.

# చూస్తే.. జలదరింపే!



భీమవరం : జిల్లాలోని ప్రధాన పంట కాలువల్లో ఒకటైన గోస్తనీ- వేల్పూరు కెనాల్ ఇది. తణుకు నుంచి అత్తిలి, పాలకోడేరు మండలాల మీదుగా భీమవరం వరకు విస్తరించి ఉన్న ఈ కాలువ ద్వారా 35 వేల ఎకరాలకు సాగునీరు, 70కి పైగా గ్రామాలకు తాగునీరు అందుతుంది. దీని వెంబడి వేల ఎకరాల్లో ఆక్వా సాగు జరుగుతోంది. ఆక్వా ఆధారిత పరిశ్రమల నుంచి వ్యర్థ జలాలను గుట్టు చప్పుడు కాకుండా ఈ కాలువలోకి వదులుతుండటంతో నీరు కలుషితమైన ఇలా నల్లగా మారిపోతోంది.

ఆక్వా రంగంలో కొందరి స్వార్థం, బాధ్యతా రాహిత్యం, అధికారుల అలసత్వం కారణంగా పంట కాలువలు కాలుష్య కాసారాలుగా మారిపోతున్నాయి. ఆక్వా పరిశ్రమల్లో వ్యర్థ జలాలను శుద్ధి చేసిన తర్వాత మురుగు కాలువల్లోకి మాత్రమే వదలాలి. దీనికి భిన్నంగా జిల్లాలోని పలు చోట్ల నేరుగా పంట కాలువల్లోకి వదులుతున్నారు. అధికార యంత్రాంగం చూసీ చూడనట్లు వ్యవహరిస్తుంటంతో పరిస్థితి నానాటికీ దిగజారిపోతోంది.

పశ్చిమగోదావరి, ఏలూరు జిల్లాల్లో ఆక్వా మేతలు, ఇతర అనుబంధ పరిశ్రమలు పదుల సంఖ్యలో ఉన్నాయి. ఈ పరిశ్రమల్లో కలుషిత నీటిని శుద్ధి చేసే ప్లాంట్లు ఉండాలి. వాటిని పక్కాగా నిర్వహించాలి. ఖర్చు తగ్గించుకునే ఉద్దేశంతో చాలా పరిశ్రమలు గుట్టుచప్పుడు కాకుండా వ్యర్థ జలాలను కాలువల్లోకి వదులుతున్నాయనే ఆరోపణలు ఉన్నాయి.

నోటీసులు ఇచ్చాం.. ఏడాదిన్నర కిందట అన్ని ఆక్వా పరిశ్రమల్లో మురుగు శుద్ధి ప్లాంట్లు పెట్టించి పర్యవేక్షణ చేస్తున్నాం. కొన్ని చోట్ల ఆక్వా చెరువులు, పరిశ్రమల్లో వ్యర్థ జలాలను పంట కాలువల్లోకి వదులుతున్నారంటూ ఫిర్యాదులొస్తున్నాయి. చర్యలు తీసుకుంటున్నాం. కొందరికి నోటీసులు కూడా ఇచ్చాం.

కె.వెంకటేశ్వరరావు, కాలుష్య నియంత్రణ మండలి ఈఈ

పాలకోడేరు మండలం పెన్నాడలో పలు చోట్ల ఆక్వా వ్యర్థాల నీటిని గొట్టాల ద్వారా ఇలా నేరుగా ఈ కాలువలోకి వదులుతున్నారు. ఈ నీటిని చేలల్లోకి మళ్లించే పరిస్థితి లేదని సాగుదారులు ఆందోళన చెందుతున్నారు.

ఉభయ జిల్లాల్లో ఇలా..

ప్రధాన పంట కాలువలు 14
ఆక్వా సాగు విస్తీర్ణం 2.30 లక్షల ఎకరాలు
వరిసాగు విస్తీర్ణం 4.10 లక్షల ఎకరాలు
మంచి నీటి చెరువులు 1,250

# కాలువ గట్లనూ వదల్లేదు..!

జీలుగుమిల్లి : మట్టి మాఫియా ఇష్టానుసారంగా రెచ్చిపోతుంది. పగలు రాత్రి తేడా లేకుండా మట్టి రవాణా చేస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. వీరి అక్రమార్జనకు కొంత మంది అధికారు లు చేతులు కలపడంతో ఏకంగా కిలోమీటర్ల మేర కాలువ గట్టునే తవ్వేస్తున్నారు. గోదావరి జలాలను కృష్ణమ్మకు చేర్చి రాష్ట్రాన్ని సస్యశ్యామలం చేయాలనే సంకల్పంతో తెదేపా ప్రభుత్వం పదేళ్ల కిందట చింతలపూడి ఎత్తిపోతల పథకం ప్రారంభించింది. తొలి రోజుల్లో ప్రధాన కాలువ తవ్వి మట్టిని గట్టుగా ఇరువైపులా పోశారు. వైకాపా హయాంలో పనులు నిలిపోయాయి. దీంతో ఈ కాలువ గట్టుపై కన్నేసిన మాఫియా ఎక్కడ పడితే అక్కడ తవ్వేస్తున్నారు.

అడిగేవారు లేరని.. ఎత్తిపోతల పథకం మూలనపడటంతో ఆ శాఖాధికారులు వేరే శాఖలకు బదిలీ అయ్యారు. రెవెన్యూ, పోలీసు అధికారులు తమకేమీ సంబంధం లేదంటూ తప్పుకొంటున్నారు. దీంతో అక్రమార్కులు జీలుగుమిల్లి మండలం పి.రాజవరం నుంచి టి.నరసాపురం మండలం సీతంపేట, గంగినీడిపాలెం, బండివారిగూడెం, మక్కినవారిగూడెం, టి.నరసాపురం వరకు గట్టుకు గండ్లు పెట్టి మట్టిని దోచేస్తున్నారు. ఇలా పది కిలోమీటర్ల మేర కాలువ గట్టు కానరాకుండా చేశారు. మాఫియా తవ్వేసిన కాలువ గట్టుపై కొన్ని



చోట్ల రైతులు పంటలు కూడా సాగు చేయడం గమనార్హం.

గ్రావెల్‌కు గిరాకీ ఉండటంతో.. ప్రస్తుతం గ్రావెల్‌కు మంచి గిరాకీ ఉంది. ఒక ట్రక్కు మట్టి రూ.వెయ్యి నుంచి రూ.1500 వరకు అమ్ముతున్నారు. దీంతో సీతంపేటకు చెందిన వైకాపా నాయకుడు రెండు యంత్రాలు ఏర్పాటు చేసి పదుల సంఖ్యలో ట్రాక్టర్లు పెట్టి నిత్యం మట్టి రవాణా చేస్తున్నారు. భవిష్యత్తులో కాలువ పనులు సాగిస్తే గట్టును పటిష్ఠం చేసేందుకు గ్రావెల్ కొనుగోలు చేయాల్సిన పరిస్థితి తలెత్తుతుంది. ప్రస్తుతం గట్టు లేకపోవడంతో వర్షపు నీరు నేరుగా కాలువలోకి వస్తూ గండ్లు పడుతున్నాయి. పలుమార్లు రెవెన్యూ సిబ్బం దిని కాలువ గట్టుపై తవ్వకాలను నివారించేందుకు పంపించానని టి.నరసాపురం తహసీల్దార్ సత్యసాయిబాబా తెలిపారు. వారం రోజుల పాటు గస్తీ ఏర్పాటు చేసి అక్రమార్కులపై కేసులు నమోదు చేస్తామన్నారు.

# దృష్టి పెడితే గట్టి మేలు

ఏలూరు: వైకాపా ప్రభుత్వ అలసత్వం..జగన్ అభివృద్ధిని గాలికొదిలేయడం..కేటాయించిన నిధులను దారి మళ్లించడం వంటి కారణాలతో జిల్లాలో ఎన్నో ప్రభుత్వ భవనాలు మొండి గోడలతో దర్శనమిస్తున్నాయి. గత ప్రభుత్వ వైఫల్యాలను వెక్కిరిస్తున్నాయి. బడ్జెట్ వేళ కూటమి సర్కారు కొద్దిపాటి నిధులు కేటాయిస్తే జిల్లా వాసులకు ఎంతో ప్రయోజనం చేకూరుతుంది.

**గుత్తేదారుకు బకాయిలతో..**

మన్యం ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు 2020లో పోలవరంలో 30 పడకల సీహెచ్‌సీ ప్రారంభించారు. రెండేళ్లలో పూర్తి చేయాల్సి ఉన్నా వైకాపా పాలకులు నాలుగేళ్లు కాలం గడిపేశారు. రూ.5.16 కోట్లతో మొదలు పెట్టిన నిర్మాణ పనులు 50 శాతం పైగా పూర్తయ్యాయి. ప్లాస్టింగ్, ఫ్లోరింగ్, కిటికీలు తదితరాలు పూర్తి చేయాల్సి ఉంది. గుత్తేదారులకు భారీగా బకాయిలు ఉండటంతో చాలా కాలంగా పనులు ఆగిపోయాయి. దీంతో ప్రస్తుత ఆసుపత్రిలో చాలీచాలని గదుల్లో రోగులు, వైద్యులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

**100 పడకలకు అయిదేళ్లుగా..**

చింతలపూడిలోని 100 పడకల ఆసుపత్రి నిర్మాణం రూ.22 కోట్లతో 2020లో మొదలు పెట్టారు. ఇప్పటికి అయిదేళ్లు గడుస్తున్నా నిధుల సమస్యతో పూర్తి కాలేదు. వైకాపా పాలనలో గుత్తేదారులకు దాదాపు రూ.4 కోట్ల బకాయిలున్నాయి. ఇప్పటికి 60శాతం వరకు పూర్తి కాగా నిధులిస్తే త్వరగా ఆసుపత్రి అందుబాటులోకి వస్తుంది.



అంతటా అంతే.. జిల్లాలో సచివాలయాలు మొదలు..రైతు సేవా కేంద్రాలు, విలేజ్ క్లినిక్ భవనాలు, మార్కెటింగ్ శాఖ పరిధిలోని మల్టీపర్పస్ గిడ్డంగులు, నాడు - నేడు పాఠశాలలు ఇలా చాలా నిర్మాణాలు అసంపూర్తిగా నిలిచిపోయాయి. అంగన్‌వాడీ, క్రీడావికాస కేంద్రాల నిర్మాణాలు తెదేపా ప్రభుత్వ హయాంలో 60 నుంచి 80 శాతం వరకు పూర్తి అయినా వైకాపా సర్కారు కనీసం పట్టించుకోలేదు. అసంపూర్తి అంగన్‌వాడీ కేంద్రాలైతే నియోజకవర్గానికి మూడు నాలుగు ఉన్నాయి. వీటిల్లో రూ.లక్ష నుంచి రూ.5 లక్షలు కేటాయిస్తే పూర్తి చేసే పనులే అధికం. తెదేపా మొదలు పెట్టిన పనులు తాము ఎందుకు పూర్తి చేయాలన్న అక్కసుతో గాలికొదిలేశారు.

**రాజకీయ క్రీనీడ**

భీమడోలు జడ్పీ ఉన్నత పాఠశాలలో 2017 తెదేపా పాలనలో రూ.2.5 కోట్లతో క్రీడా వికాస కేంద్రం, ఇండోర్ మైదానం, క్రీడాకారులకు వసతి గృహ నిర్మాణం మొదలు పెట్టారు. ఏడాదిన్నరలో శరవేగంగా 65 శాతం పనులు చేశారు. ప్రభుత్వం మారటంతో వైకాపా సర్కారు వీటికి పైసా విదల్చలేదు. రూ.కోటి కేటాయిస్తే అన్ని పనులు పూర్తి చేయవచ్చు. ఈ కేంద్రాలు జిల్లాలో దాదాపు 10 వరకు అసంపూర్తిగా మిగిలాయి.

**కూటమి సర్కారు కరుణిస్తేనే..**

గత తెదేపా పాలనలో చివరి దశలో ఉన్న భవనాలను సైతం వైకాపా గాలికి వదిలేసింది. అలానే వైకాపా అధికారంలో ఉన్న సమయంలో మొదలు పెట్టిన పనులనూ అర్ధంతరంగా నిలిపేసింది. ఫిబ్రవరి-28న కూటమి సర్కారు రాష్ట్ర బడ్జెట్ ప్రవేశపెడుతున్న నేపథ్యంలో అసంపూర్తి భవనాలను పరిగణనలోకి తీసుకోవాలి. వాటికి ఎంత ఖర్చు అవుతుందో అంచనాలతో నిధులు మంజూరు చేస్తే పూర్తయ్యే దశలో ఉన్న పనులన్నీ ప్రజలకు అందుబాటులోకి వస్తాయి.

## స్మార్ట్‌గా నడుపుదాం.. ఇక కొత్త కార్డుల జారీ

పుత్తూరు : పుత్తూరుకు చెందిన వ్యక్తి ఒకరు ఏడాదిన్నర కిందట కారు కొన్నారు. అప్పటి నుంచి ఆర్‌సీ రాలేదు. ఆయన పక్క రాష్ట్రానికి వెళ్లినపుడు పోలీసులు ఆర్‌సీ అడగ్గా తన వద్ద ఉన్న డిజిటల్ పత్రాన్ని చూపారు. ఒరిజినల్ కార్డు లేకుంటే చలానా చెల్లించాలని చెప్పడంతో అవాక్కయ్యాడు. విధిలేని పరిస్థితుల్లో అపరాధ రుసుము చెల్లించారు. కొత్త వాహనాల రిజిస్ట్రేషన్(ఆర్‌సీ), డ్రైవింగ్ లైసెన్స్(డీఎల్)లు తీసుకునే వారికి కూటమి ప్రభుత్వం మంచి వార్త చెప్పింది. వైకాపా హయాంలో నిలిపేసిన స్మార్ట్ కార్డులు మళ్లీ అందజేయాలని నిర్ణయం తీసుకోవడంతో వాహన చోదకుల్లో సంతోషం వ్యక్తమవుతోంది. లైసెన్సులు పొందిన చోదకులు సదరు కార్డులు పొందేందుకు అర్హులని పేర్కొంది. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో వేల సంఖ్యలో త్వరలో కార్డులు జారీ చేయనున్నారు.

**రెండేళ్లుగా కార్డులు ఇవ్వక..** వాహన చోదకులు డ్రైవింగ్ లైసెన్సులు పొందాలంటే ఆర్టీవో కార్యాలయంలో వాహన చోదక పరీక్షల్లో ఉ





త్తీర్ణత సాధించాలి. వైకాపా హయాంలో రెండేళ్లుగా డ్రైవింగ్ వాహనా రిజిస్ట్రేషన్ కార్డుల జారీ నిలిపేసింది. వాటికి బదులుగా ఆన్‌లైన్ ద్వారా లైసెన్స్ చూసుకోవచ్చని చెప్పింది. ఈ నిబంధనలు వాహన చోదకులకు ఇబ్బందిగా మారాయి. ప్రమాదాలు జరిగినపుడు బీమాకు దరఖాస్తు చేసుకోవాలన్నా ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

**రూ.235 చెల్లిస్తే పోస్టు ద్వారా..** డీఎల్, ఆర్‌సీలకు మళ్లీ స్మార్ట్‌కార్డులు అందజేయనున్న నేపథ్యంలో రవాణాశాఖ నిర్వహించే ఈ-ప్రగతి పరివాహన్ పోర్టల్‌లో నమోదు అవకాశం కల్పించారు. కార్డు ఫీజు రూ.200, పోస్టు ద్వారా పంపడానికి రూ.32, ఇతరత్రా కలిపి రూ.235 ఆన్‌లైన్‌లో చెల్లించాలి. గతంలో డబ్బులు చెల్లించినా కార్డులు రాలేదని, ఇప్పుడు టెండర్ల ప్రక్రియ నిర్వహించకుండా ఫీజు వసూలు చేయడంపై వాహనదారులు ప్రశ్నిస్తున్నారు. వైకాపా హయాంలో వాహనదారుల నుంచి వసూలు చేసిన సొమ్ము గుత్తేదారుకు ఇవ్వకపోవడంతో సరఫరా నిలిచిపోయింది. ఈ నేపథ్యంలో కూటమి ప్రభుత్వం కచ్చితంగా కార్డులు వచ్చేలా చర్యలు చేపట్టాలని వాహనదారులు కోరుతున్నారు.

**రుసుము చెల్లిస్తే కార్డులు వస్తాయి..** ప్రభుత్వం వాహన చోదకులకు డీఎల్ కార్డుల జారీకి ఉత్తర్వులు ఇచ్చింది. రుసుం చెల్లించిన వాహన పరీక్షల్లో ఉత్తీర్ణులైన వారు కార్డులు పొందే అవకాశం కల్పించింది. కార్డులు ముద్రణ పూర్తయింది. రుసుం చెల్లించిన వెంటనే కార్డులు తపాలాలో పంపుతున్నారు. చంద్రశేఖర్, మోటారు వాహనాల తనిఖీ అధికారి, పుత్తూరు

## కుప్పంలో అక్రమాలకు ఉపాధి

కుప్పం : వైకాపా హయాంలో 2019 నుంచి 2024 వరకు కుప్పం నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో ఉపాధి హామీ ద్వారా రూ.236 కోట్లు ఖర్చు చేశారు. ఐదేళ్లకు సంబంధించి.. రామకుప్పం మండలంలో అత్యధికంగా రూ.72.65 కోట్లు, కుప్పంలో రూ.63.56 కోట్లు, శాంతిపురంలో రూ.60 కోట్లు, గుడుపల్లెలో రూ.49.80 కోట్లు వ్యయం చేశారు. పులివెందుల తరహాలో కుప్పం నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తామని వైకాపా హయాంలో సాక్షాత్తు నాటి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి గొప్పలు చెప్పారు. ప్రగతి పనులు అటుంచి



అక్రమంగా ఆరగించడంలో మాత్రం దూసుకెళ్లారని తేటతెల్లమవుతోంది. ఈ నియోజకవర్గంలో ఉపాధి హామీ పథకంలో నిధుల వ్యయంపై జరుగుతున్న విజిలెన్స్ విచారణలో ఈ విషయమే స్పష్టమవుతోంది. స్థానిక తెదేపా నేతలు కూటమి ప్రభుత్వానికి లేఖ రాయగా విచారిస్తున్న అధికారులకు ఈ విషయమే వెల్లడవుతోంది.

**కొవిడ్ సమయంలో అత్యధికంగా..** ప్రజలను గడగడలాడించిన కరోనా మహమ్మారి (కొవిడ్) కాలంలోనే అత్యధికంగా ఉపాధి నిధులు ఖర్చు చేసినట్లు గణాంకాలు చెబుతున్నాయి. కరోనా తీవ్రతతో జనం చాలా వరకు ఇళ్లకే పరిమితమైన 2020-21 ఆర్థిక సంవత్సరంలో.. నాలుగు మండలాలకు రూ.68.78 కోట్లు ఖర్చు చేశారు. రామకుప్పం మండలంలో రూ.20.15 కోట్లు, కుప్పంలో రూ.16.79, రామకుప్పంలో రూ.19.12, గుడుపల్లెలో రూ. 12.72 కోట్లను ఉపాధి పనులకు వెచ్చించారు. కొవిడ్ భయాందోళనతో కూలీలు చాలా వరకు ఉపాధి పనులకు వెళ్లలేదు. ప్రభుత్వ కార్యాలయాలు సైతం మూతపడిన విషయం తెలిసిందే.

**అధికారం అండతో అక్రమాలకు తెరతీసి..** కరోనా కాలాన్ని సద్వినియోగం చేసుకున్న అక్రమార్కులు ఉపాధిలో అక్రమాలకు తెరతీసినట్లు స్పష్టమవుతోంది. నాలుగేళ్లకు గాను రూ.167 కోట్లు ఖర్చు చేయగా.. కరోనా ఏడాదిలో రూ.68.78 కోట్లు వ్యయం చేసినట్లు గణాంకాలు ఉండటంతో అధికారులే విస్మయం వ్యక్తం చేస్తున్నారు. అప్పట్లో అధికారం అండతోనే సామాజిక తనిఖీలను తూతూమంత్రంగా ముగించినట్లు స్పష్టమవుతోంది.

**విజిలెన్స్ అధికారుల ఆరా**
తిరుపతికి చెందిన విజిలెన్స్ అధికారుల బృందం బుధవారం నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో పర్యటించి ఉపాధి నిధుల వ్యయం వివరాలు సేకరించారు. నెలన్నర కిందట మండల ప్రజాపరిషత్తు, ఉపాధి కార్యాలయాల్లో వీరు రహస్యంగా వివరాలు తీసుకెళ్లగా.. తాజాగా మరోదఫా సేకరించారు. త్వరలోనే సమగ్ర విచారణ చేపట్టనున్నట్లు అధికార వర్గాల సమాచారం.

# పల్లెదారులకు కొత్త వెలుగులు



ఆత్మకూరు : రాప్తాడు నియోజకవర్గం వ్యాప్తంగా రహదారులకు నోచుకోని గ్రామాలు ఎన్నో ఉన్నాయి. దశాబ్దాల నుంచి గంపెడు మట్టి వేయని గ్రామాల్లో.. గుంతలు, కంకర, రాళ్లు రప్పలతో దారులలో ప్రజలు పడిన ప్రయాసలెన్నో.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పరిస్థితి మారింది. రోడ్లకు వెంటనే మరమ్మతులు చేపట్టడంతోపాటు పూర్తిగా దారులు లేని గ్రామాలకు తారు, సీసీ రోడ్లు నిర్మించి ప్రయాణ ఇబ్బందులు తొలగించేందుకు చర్యలు చేపడుతోంది. ఇప్పటికే పూర్తి చేసిన దారులతోపాటు ప్రస్తుతం పనులు జరుగుతున్న సిమెంట్, తారు రోడ్డు నిర్మాణాలు పూర్తి అయితే ప్రజలు ఎలాంటి ఒడిదొడుకులు లేకుండా ప్రయాణం చేసేందుకు వీలుగా ఉంటుంది.

**నిధులు చకచకా మంజూరు..**
ఆత్మకూరు మండల వ్యాప్తంగా రూ.2.50 కోట్లతో 5.5 కిలోమీటర్ల మేర సీసీ రోడ్డు నిర్మాణం చేపట్టారు. మండలంలోని తలుపూరు గ్రామం నుంచి కళ్యాణదుర్గం ప్రధాన రహదారి వరకూ కోటి రూపాయలతో 2.1 కిలోమీటరు మేర తారు రోడ్డు నిర్మాణం చేపట్టారు. వీటితోపాటు ఆత్మకూరు నుంచి కుర్లపల్లి వరకూ, సింగంపల్లి గ్రామాలకు తారు రోడ్డు నిర్మాణం చేపట్టేందుకు పనులు ప్రారంభించారు.

చెన్నేకొత్తపల్లి మండలం ఉపాధి నిధులు రూ.3.60 కోట్లతో 6.03 కిలోమీటర్ల సీసీ రోడ్లను ఇప్పటికే నిర్మించి ప్రారంభోత్సవం చేశారు. మరో 3.4 కిలోమీటర్ల దారిని నిర్మించేందుకు రూ.2.45 కోట్లు నిధులు మంజూరు అయ్యాయి. న్యామద్దెల నుంచి చిన్నప్పేట వరకూ తారురోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు అయ్యాయి.

కనగానపల్లి మండలవ్యాప్తంగా రూ.3.60 కోట్లతో 6.25 కిలోమీటర్ల మేర సీసీ రోడ్డు నిర్మాణాలను పూర్తి చేశారు. ఆత్మకూరు మండలం రంగాపేట నుంచి కనగానపల్లి మండలం తొగరకుంట వరకూ రూ.4.80 కోట్లతో 14 కిలోమీటర్ల మేర తారురోడ్డు నిర్మాణ పనులు ప్రారంభించారు.

రామగిరి మండలంలో రూ.3.60 కోట్లతో 5.91 కిలోమీటర్ల మేర సీసీ రోడ్డు నిర్మాణం పూర్తి చేసి ప్రారంభించారు. గంగంపల్లి నుంచి ముత్యాలమ్మపల్లి వరకూ 0.7 కిలోమీటర్ల మేర రూ.65 లక్షలతో తారు రోడ్డు వేశారు. రాప్తాడు మండలవ్యాప్తంగా చాపట్ల, చెర్లోపల్లి రూ.4.96 కోట్లతో 7 కిలోమీటర్ల తారు రోడ్డు నిర్మాణాన్ని పూర్తి చేశారు.

# అతివలు.. 'అజయ్'లు



ఒంగోలు : వైకాపా ప్రభుత్వ హయాంలో స్వయం సహాయక సంఘాల్లోని ఎస్సీ మహిళలు 'ఉన్నతి' పథకం కింద దరఖాస్తు చేసుకున్నా నెలల తరబడి రుణం మంజూరయ్యేది కాదు. కూటమి అధికారంలోకి వచ్చాక ఎస్సీ మహిళల స్వయం ఉపాధి నిమిత్తం ఇప్పటికే పలు పథకాలను తీసుకొచ్చింది. తాజాగా వారి అభ్యున్నతికి మరో అడుగు ముందుకేసింది. ప్రధానమంత్రి అనుసూచిత్ జాతి అభ్యుదయ్ యోజన(పీఎం అజయ్)లో భాగంగా డీఆర్డీఏ, ఎస్సీ కార్పొరేషన్ సంయుక్త ఆధ్వర్యంలో అర్హులైన మహిళలకు వ్యక్తిగత రుణం అందించనుంది. ఇందుకుగాను ఇప్పటికే క్షేత్రస్థాయిలో లబ్ధిదారులను అధికారులు గుర్తించారు. రానున్న ఆర్థిక సంవత్సరంలో మరింత ఎక్కువ మందికి లబ్ధి చేకూర్చేలా చూస్తున్నారు.

పథకం: ప్రధానమంత్రి అనుసూచిత్ జాతి అభ్యుదయ్ యోజన(పీఎం అజయ్)
అమలు: డీఆర్డీఏ, ఎస్సీ కార్పొరేషన్ సంయుక్త ఆధ్వర్యం
అర్హులు: ఎస్సీ మహిళలు
వ్యక్తిగత రుణం: రూ.లక్ష నుంచి రూ.3 లక్షల వరకు
జిల్లాలో యూనిట్లు: మొత్తం 109
మంజూరైన మొత్తం: రూ.1.68 కోట్లు
కేటాయింపులు: మండలానికి మూడు యూనిట్లు (2024-25 ఆర్థిక సంవత్సరానికి)

**ఇక వ్యక్తిగతంగానూ రుణాలు**
ఎస్సీ వర్గాల్లోని మహిళలు స్వయం సహాయక బృందాలుగా ఉన్నా ఇప్పటివరకు వ్యక్తిగతంగా రుణాలు అందించింది లేదు. సకాలంలో చెల్లించే ఆర్థిక స్తోమత ఉందన్న ఉద్దేశంతో వారికి రుణాలిచ్చేందుకు బ్యాంకర్లు వెనకడుగు వేసేవారు. దీంతో సంఘానికి వచ్చిన మొత్తం నుంచే వ్యక్తిగతంగా పంచుకునేవారు. 'అజయ్' పథకం కింద ఎంపికైన లబ్ధిదారులకు రాయితీ రూ.50 వేలు, లబ్ధిదారుని వాటా రూ.10 శాతంపోను.. మిగిలిన మొత్తాన్ని ఉన్నతి పథకం నుంచి ఇకపై విడుదల చేయనున్నారు. తద్వారా సొంతంగా యూనిట్లు ఏర్పాటు చేసుకుని స్వయం ఉపాధి పొందొచ్చు.

**ఇవీ నెలకొల్పుకునే యూనిట్లు**
సిమెంట్ (బ్రిక్స్), చీరల విక్రయం, డీజే సౌండ్ సెట్, చెప్పుల దుకాణం, పాత సామగ్రి కొనుగోలు, నాటు కోళ్ల పెంపకం, కంప్యూటర్ అండ్ నెట్, హోటల్, పండ్లు, జ్యూస్, ఆర్వో ప్లాంట్, కూరగాయల సాగు, ఐస్‌క్రీమ్ పార్లర్, శీతల పానీయాల దుకాణాలు వంటి వాటిని స్వయం ఉపాధి యూనిట్లుగా మహిళలు ఏర్పాటు చేసుకోవచ్చు.

**60 సంవత్సరాల్లోపు వారికే మంజూరు**
పీఎం అజయ్ పథకం వర్తించాలంటే 60 సంవత్సరాల్లోపు మహిళలై ఉండాలి.
అంతకు ముందు ఇతర పథకాల్లో ఎలాంటి రుణం పొందనివారై ఉండాలి.
ఒంటరి మహిళలు, దివ్యాంగులు, సొంతిల్లు, భూమి లేనివారికి ప్రాధాన్యముంటుంది.
ఒక్కో యూనిట్ నిర్వహణ ఖర్చు ఆధారంగా రూ.లక్ష నుంచి రూ.3 లక్షల వరకు అందిస్తారు. అందులో రూ.50 వేలు రాయితీ ఉంటుంది.
రుణం మొత్తాన్ని నెలవారీ వాయిదాల్లో చెల్లించాలి.
ఎంపికైన లబ్ధిదారులతో ఈ నెలాఖరుకల్లా యూనిట్లు నెలకొల్పించేలా అధికారులు ప్రణాళిక చేశారు.

# సర్వే చేస్తున్నా.. ఆగని అక్రమం



పలమనేరు : పలమనేరు పట్టణానికి అత్యంత సమీపంలోని గంటావూరు కాలనీలో అక్రమ గృహ నిర్మాణాలు ఇంకా కొనసాగుతున్నాయి. ఒక వైపు అధికారులు అక్రమాల నిగ్గు తేల్చడానికి సర్వే చేస్తున్నా ఆగడం లేదు. కాలనీకి అనుబంధంగా ఉండే సర్వే నం 1082-10, 1082-13లతోపాటు మరికొన్ని సర్వే నంబర్లలో దాదాపు మూడెకరాల విస్తీర్ణంలోని భూమిలో ప్రభుత్వం పేదల కోసం ఇళ్ల పట్టాలు పంపిణీ చేసింది.

**వైకాపా నాయకుడి చేతివాటం**
గత ప్రభుత్వంలో చక్రం తిప్పిన వైకాపా నాయకుడొకరు ప్లాట్లు చేసి విక్రయాలు చేసినట్లు ఆరోపణలున్నాయి. అప్పట్లో దాదాపు 100 ప్లాట్లను తనకు ఇష్టమొచ్చిన వారికి పట్టాలు పంపిణీ చేసినట్లు ఫిర్యాదులున్నాయి.

**ఎమ్మెల్యే ఆదేశాలతో సర్వే**
కూటమి ప్రభుత్వం వచ్చాక కాలనీలో గతంలో చోటుచేసుకున్న అక్రమాలను వెలికితీయాలని ఎమ్మెల్యే అమరనాథరెడ్డి రెవెన్యూ అధికారులను ఆదేశించారు. దీంతో వారం రోజుల నుంచి సర్వే చేసి వివరాలు సేకరించారు. ఇప్పటికీ కొందరు అక్రమంగా ఇళ్ల నిర్మాణాలను చేపడుతున్నారని ఆ ప్రాంత తెదేపా నాయకుడు వై.శ్రీధర్ అధికారులకు ఫిర్యాదు చేయడంతో అధికారులు అడ్డుకున్నారు.

చదువు చేసి.. పందేరానికి తెగబడి..
పేదలకు గృహ నిర్మాణాల కోసం ప్రభుత్వం ప్రైవేటు భూమి కొంత సేకరించింది. అది ఎత్తుపల్లాలుగా ఉండటంతో చదును చేయలేదు. ఇదే అదనుగా వైకాపా నాయకుడు చదును చేసి పట్టాల పందేరానికి తెగబడ్డారు. సర్వే నంబరు 1082-10తో పాటు 1082-11, 1082-13లో ఇలాంటి అక్రమాలు చోటు చేసుకున్నాయి. మరి కొద్దిరోజుల్లో అక్రమ పట్టాల వ్యవహారాన్ని గుర్తిస్తామని పలమనేరు తహసీల్దారు ఇన్బనాథన్ తెలిపారు.


**లంచం కొట్టు.. పట్టా పట్టు**
కాగా ప్రభుత్వం మారినా దందాలు కొనసాగుతుండటం గమనార్హం. గత ప్రభుత్వంలో నాయకులు ఇక్కడ ఒక ప్లాటుకు రూ.లక్ష నుంచి రూ.2 లక్షలు తీసుకుని ప్రభుత్వ భూమిలో సర్దుబాటు చేసి పట్టాలు పంపిణీ చేసినట్లు వచ్చిన ఆరోపణలపై విచారణ చేపడుతున్నారు. అప్పట్లో పట్టాలతోపాటు జగనన్న గృహనిర్మాణానికి రుణం మంజూరు చేయిస్తామని వైకాపా నాయకులు ప్రకటించడం చర్చనీయాంశమైంది.

## ఇక రైళ్ల నిరీక్షణకు చెల్లు!

గుంతకల్లు : 'సిగ్నల్ కోసం రైల్వే స్టేషన్‌కు కిలోమీటర్ల దూరంలో రైలు వేచి ఉండే పరిస్థితులు పోనున్నాయి. ఇక నుంచి రైళ్ల కోసం ప్రయాణికులు గంటల తరబడి రైల్వేస్టేషన్లలో నిరీక్షించాల్సిన అవసరం ఉండదు' అని గుంతకల్లు డీఆర్ఎం చంద్రశేఖర్ గుప్త, ఏడీఆర్ఎం సుధాకర్ పేర్కొన్నారు. గుంతకల్లు రైల్వే డివిజన్ సిగ్నల్ అండ్ టెలికాం విభాగం సీనియర్ డీఎస్‌టీఈ చంద్రశేఖర్ డివిజన్‌లో కొత్త సిగ్నలింగ్ వ్యవస్థను అందుబాటులోకి తెచ్చే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. కొత్త సిగ్నలింగ్ వ్యవస్థపై లోకో పైలెట్ (రైల్వే డ్రైవర్లు), అసిస్టెంట్ పైలెట్‌లకు (సహాయ డ్రైవర్లు) అవగాహన కల్పించే మార్గదర్శక (గైడెన్స్) పుస్తకాలను డీఆర్ఎం, ఇతర విభాగాల అధికారులు శనివారం గుంతకల్లు డీఆర్ఎం కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డీఆర్ఎం మాట్లాడారు. ప్రస్తుతం రైలు స్టేషన్ దాటిన తరువాతనే మరో రైలు రావడానికి అనుమతించే వారు. కొత్త సిగ్నల్ వ్యవస్థ ద్వారా ఒకదాని వెనుక ఒకటి.. ఒకేసారి పది రైళ్లను అనుమతించేందుకు, నడిపేందుకు వెసులు బాటు కలగనుందని వివరించారు. ఫలితంగా ప్రయాణికులు గంటల తరబడి రైల్వే స్టేషన్లలో వేచి ఉండే పరిస్థితి ఇక ఉండదన్నారు. ప్రస్తుతం గుంతకల్లు డివిజన్‌లో గుంతకల్లు - మొలగవల్లి స్టేషన్ల మధ్య ఆటోమేటిక్ సిగ్నలింగ్ వ్యవస్థను ఏర్పాటు చేశామన్నారు. ఈ వ్యవస్థ చక్కగా పనిచేస్తోందని డీఆర్ఎం వివరించారు. అంచెలవారీగా డివిజన్ అంతటా ఈ వ్యవస్థను అందుబాటులోకి తెస్తామన్నారు. కార్యక్రమంలో సీనియర్ డీఎస్టీఈ చంద్రశేఖర్, సీనియర్ డీఎంఈ (డీజిల్) మంగార్యాలు, సీనియర్ డీఈఈ (ట్రాక్షన్) సుదర్శన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఇక్కడ పేరు.. అక్కడ చదువు

పాడేరు : ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల ప్రవేశాలకు సంబంధించి కొన్నిచోట్ల ఉపాధ్యాయులు అడ్డదారులు తొక్కుతున్నారు. పిల్లల పేర్లు మాత్రమే తమ పాఠశాలల్లో చూపిస్తున్నారు.. వారి చదువులు మాత్రం ప్రైవేటు పాఠశాలల్లో సాగించేలా ఒప్పందాలు చేసుకుంటున్నారు. నర్సీపట్నం మండలంలో కేడీపాలెం, నగరం ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులు సంధ్య, సూర్యప్రకాశ్‌ల పిల్లలు ప్రైవేటు స్కూళ్లకు పంపించి ప్రభుత్వ పాఠశాలల్లో చూపించడంతో వారిద్దరిపై వేటు వేశారు. చోడవరం మండలంలోనూ కొంతమంది ఉపాధ్యాయులు ఈ తరహా అక్రమాలకు పాల్పడినట్లు గుర్తించి చర్యలకు సిద్ధం చేస్తున్నారు. గతేడాది కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆటోమేటెడ్ పర్మినెంట్ అకడమిక్ అకౌంట్ రిజిస్ట్రీ (అపార్)తో గురువుల లీలలు బయటపడుతున్నాయి. వాటిపై ప్రాథమిక విచారణ చేపట్టి ఇప్పటికే ఇద్దరు ఉపాధ్యాయులపై చర్యలు తీసుకున్నారు. జిల్లాలో ఈ తరహా అక్రమాలు చాలానే జరిగినట్లు గుర్తించినా ఆ వివరాలు బయటకు




రాకుండా విద్యాశాఖ అధికారులు గోప్యత పాటిస్తున్నారు. గతేడాది మొదలుపెట్టిన అపార్ నమోదు ఇప్పటికీ పూర్తికాకపోవడానికి విద్యార్థుల లెక్కలు తేలకపోవడం కూడా ఓ కారణమని సంబంధిత అధికారులే చెబుతున్నారు.

**ప్రవేశాల్లో మాయాజాలం..** విద్యార్థుల సంఖ్య తగ్గిపోతే ఆయా పాఠశాలల్లో పోస్టులు కోతపెడతారని కొంతమంది ఉపాధ్యాయులు ప్రవేశాలను (అడ్మిషన్లు) రికార్డుల్లోనే చూపిస్తున్నారు. వారు బడికి రాకపోయినా హాజరుపట్టీలో మాత్రం వచ్చినట్లే టిక్ పెట్టేస్తున్నారు. నవోదయ, సైనిక్ పాఠశాలలు, ట్రిపుల్ ఐటీ ప్రవేశాల్లో ప్రభుత్వ స్కూల్ విద్యార్థులకే ఎక్కువ అవకాశం కల్పిస్తుంటారు. దీనికోసం ప్రైవేటు స్కూల్ పిల్లలను కొన్నిచోట్ల సర్కారీ బడుల్లో చదువుతున్నట్లు చూపిస్తున్నారు. అల్లూరి జిల్లాలో మొత్తం 1,97,049 మంది విద్యార్థులున్నారు. వీరిలో 1,55,809 మంది వివరాలు అపార్‌లో నమోదు చేశారు. ఇంకా 41,418 మంది పెండింగ్‌లో ఉన్నారు.

**మిగతా వారిపై దృష్టి..** ప్రభుత్వ, ప్రైవేటు యాజమాన్యాల్లో చదువుతున్న ఒకటో తరగతి నుంచి జూనియర్ కళాశాల విద్యార్థుల వరకు 'వన్ నేషన్.. వన్ స్టూడెంట్ ఐడీ' పేరిట అపార్ నమోదు చేయిస్తోంది. ఒక విద్యార్థి అడ్మిషన్ ఒకే చోట ఉండాలి.. రెండు మూడుచోట్ల చూపడానికి వీల్లేదు. ఆధార్ సంఖ్యతో అనుసంధానం చేసి అపార్ నమోదులో అనధికార విద్యార్థులు వెలుగులోకి వస్తున్నారు. ఈ విషయమై డీఈవో అప్పారావునాయుడు వద్ద ప్రస్తావించగా పరీక్షలు దగ్గర పడడంతో అపార్ నమోదుపై ఒత్తిడి తగ్గించారని, అందుకే ప్రక్రియలో జాప్యం జరుగుతోందన్నారు. అనధికార విద్యార్థుల వివరాలు కొన్నిచోట్ల వెలుగు చూడగా ఇద్దరిపై చర్యలు తీసుకున్నామని మిగతా వారిపైనా దృష్టిసారించినట్లు చెప్పారు. సస్పెన్షన్ ఉత్తర్వులు ఇచ్చేందుకు యత్నించగా ఉపాధ్యాయులు అందుబాటులో లేరని ఎంఈవో తలుపులు చెప్పారు.

## పల్లె పయనం.. ఇక పదిలం

నంద్యాల : కొన్నేళ్లుగా నిర్వహణ, మరమ్మతులు కరవై దారుణంగా దెబ్బతిన్న గ్రామీణ రహదారులకు మోక్షం కలగనుంది. ఇటీవల ఆర్అండ్‌బీ రహదారులపై గుంతలు పూడ్చేందుకు నిధులు మంజూరు చేసిన కూటమి ప్రభుత్వం.. తాజాగా పంచాయతీరాజ్ రోడ్ల మరమ్మతులపై దృష్టిపెట్టింది. గత ఐదేళ్ల వైకాపా ప్రభుత్వంలో ఈ రహదారులు పూర్తిగా నిర్లక్ష్యానికి గురయ్యాయి. కొత్త రహదారులు వేయకపోగా.. దెబ్బతిన్న వాటికి మరమ్మతులు కూడా చేయలేదు. దీంతో చాలా గ్రామాల పరిధిలో రోడ్లు రూపు కోల్పోయాయి. త్వరలో నిధులు మంజూరు చేసేందుకు చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా సంబంధిత శాఖ అధికారులను ప్రతిపాదనలు పంపాలని ఇటీవల ఆదేశించింది.

**ఐదేళ్ల పట్టించుకోలేదు** జిల్లా పంచాయతీరాజ్‌లో రెండు విభాగాలు ఉన్నాయి. పీఐయూ నుంచి 49 రోడ్లకు ప్రతిపాదనలు పంపారు. 183.01 కి.మీల పొడవున మరమ్మతులకు రూ.68.56 కోట్లతో ప్రతిపాదించారు. పీఆర్ డివిజన్ నుంచి 47 రోడ్లకు 184.94 కి.మీల పొడవున మరమ్మతులు చేసేందుకు రూ.83.06 కోట్లతో ప్రతిపాదనలు పంపారు. ఐదేళ్ల కాలంలో దెబ్బతిన్న బీటీ రోడ్లే. వీటిని గత తెదేపా ప్రభుత్వ హయాంలో నిర్మించారు. గత ఐదేళ్లలో కనీస నిర్వహణ లేకపోవడంతో ఛిద్రమయ్యాయి. కొన్ని రహదారులపై పెద్ద ఎత్తున గుంతలు పడ్డాయి. మరికొన్ని రహదారులపై తారు కొట్టుకుపోయి కంకర రాళ్లు దర్శనమిస్తున్నాయి. పంట పొలాల మధ్య వేసిన రహదారులు కోతకు గురవడంతో వీటిపై ప్రయాణం ప్రమాదకరంగా మారింది.

**ఎట్టకేలకు వీటికి మోక్షం**
పాణ్యం నియోజకవర్గంలోని గడివేముల మండలంలో ఎనిమిది చోట్ల రహదారులు బాగా దెబ్బతిన్నాయి. ప్రత్యేకించి సంధ్యాల - నందికొట్కూరు రోడ్డు నుంచి భోగేశ్వరం రహదారి వరకు 4.17 కి.మీల పొడవున దారి దారుణంగా ఉంది. గని ఆర్అండ్‌బీ రోడ్డు నుంచి పైభోగుల రోడ్డు, ఎన్ఎస్ రోడ్డు నుంచి- బిలకలగూడూరు వరకు దారి ఛిద్రమైంది. 6.9 కి.మీ ఉన్న చిందుకూరు- పరమటూరు రోడ్డు కూడా అధ్వానంగా మారింది. మంచాలకట్ట- ఎల్‌కే తండా రహదారి మరమ్మతులు చేయాలని నిర్ణయించారు. శ్రీశైలం నియోజకవర్గంలోని బండిఆత్మకూరు మండలంలో ఈర్నపాడు- మాణికంతాపురం మధ్య 4 కి.మీ, మహికంతాపురం- ఓంకారం మధ్య 3.3 కి.మీ, బండిఆత్మకూరు- ఈర్నపాడు మధ్య 11 కి.మీల పొడవున్న రోడ్లను బాగు చేయాలని ప్రతిపాదించారు.

ఆళ్లగడ్డ నియోజకవర్గంలోని రుద్రవరం మండలం మహదేవపురం నుంచి కె.కొత్తూరు వరకు 2.58 కి.మీలు, బాచపల్లి నుంచి అహోబిలం వరకు 9 కి.మీ ఉన్న రోడ్ల మరమ్మతులకు నిధులు రానున్నాయి. సంధ్యాల మండలంలోని పోలూరు- రాయమాల్పురం, అయ్యలూరు- మహేదపురం, గోస్పాడు మండలం జిల్లెల్ల- పసురపాడు రోడ్లను మరమ్మతులు చేయనున్నారు.

# 'తెల్ల'బోయిన మద్దతు

కర్నూలు : ఉమ్మడి కర్నూలు జిల్లాలో కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) పత్తి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటుచేసింది. మద్దతు ధర రూ.7,521గా ప్రకటించింది. మంచి ధర ఉండటంతో అన్నదాతలు ఆనందం వ్యక్తం చేశారు. మద్దతు ధర వద్దే సీసీఐ తిరకాసు పెట్టింది. తేమ 8 శాతం వరకు ఉంటేనే పూర్తి మద్దతు ధర లభిస్తుంది. 9-12 శాతం వరకు తేమ ఉంటే ప్రతి ఒక్క శాతానికి మద్దతు ధరలో కోత విధిస్తోంది. తేమ 12 శాతానికన్నా ఎక్కువగా ఉంటే కొనుగోలు చేయడం లేదు. తేమ పేరుతో కోత విధిస్తుండటంతో చాలామంది తీవ్రంగా నష్టపోతున్నారు. జిల్లాలో ఆదోని, ఎమ్మిగనూరు, కోడుమూరు, మంత్రాలయం వ్యవసాయ మార్కెట్ కమిటీల పరిధిలో 15 జిన్నింగ్ మిల్లుల్లో సీసీఐ పత్తి కొనుగోళ్లు చేపట్టింది. క్వింటా రూ.7,521 మద్దతు ధరతో కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా పత్తి కొనుగోలు చేస్తోంది. బహిరంగ మార్కెట్‌లో పత్తి ధరలు తగ్గిపోవడంతో రైతులు సీసీఐ కేంద్రాలవైపే మొగ్గు చూపుతున్నారు. కానీ పత్తి కొనుగోళ్ల విషయంలో సీసీఐ ప్రతినిధులు చుక్కలు చూపిస్తున్నారు. తేమ శాతం ఎక్కువగా ఉందంటూ నానా ఇబ్బందులకు గురి చేస్తున్నారు. మరోవైపు 2-5, 10 క్వింటాళ్ల పత్తిని అమ్ముకునేందుకు వారం రోజులపాటు వాహనాలతో నిరీక్షించే పరిస్థితి నెలకొందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**నిబంధనల పేరుతో..**



సీసీఐ కొనుగోలు కేంద్రాల్లో పత్తి క్వింటా రూ.7,072 నుంచి గరిష్ఠంగా రూ.7,471 పలికింది. ఉమ్మడి జిల్లాలో తెల్ల బంగారం సాగు చేసిన రైతులు జిల్లాలోని 15 జిన్నింగ్ మిల్లుల్లో విక్రయిస్తున్నారు. సీసీఐ నిబంధనలకు లోబడి ప్రభుత్వం నిర్ణయించిన మద్దతు ధర క్వింటా రూ.7,521కు ఇప్పటివరకు ఏ ఒక్క రైతు నుంచి కూడా కొనుగోలు చేయకపోవడం గమనార్హం.

**కొనుగోళ్లు అంతంతే..**

కర్నూలు జిల్లాలో 1.97 లక్షల హెక్టార్లలో పత్తి సాగైంది. ఎకరాకు 7.41 క్వింటాళ్ల చొప్పున హెక్టారుకు 15 క్వింటాళ్ల వరకు దిగుబడులు వచ్చాయి. వ్యవసాయ శాఖ అధికారుల లెక్కల మేరకు 3,72,546 మెట్రిక్ టన్నుల తెల్ల బంగారం పండినట్లు అంచనా. సీసీఐ గతేడాది డిసెంబరు నాలుగో వారం వరకు కొనుగోలు చేసింది.. 3.24 లక్షల క్వింటాళ్లు మాత్రమే కావడం గమనార్హం. ఒక రైతుకు వచ్చిన మొత్తం దిగుబడిలో 40 శాతం మాత్రమే కొనుగోలు చేస్తామని సీసీఐ ప్రకటించింది. ఒక రైతుకు గరిష్ఠంగా 20 క్వింటాళ్ల పత్తి దిగుబడులు వస్తే అందులో 8 క్వింటాళ్లు మాత్రమే కొనుగోలు చేస్తారు. మిగిలిన 12 క్వింటాళ్లను తక్కువ ధరకు బహిరంగ మార్కెట్‌లో అమ్ముకుని అన్నదాతలు నష్టపోయే పరిస్థితి నెలకొంది. పెంచికలపాడు జిన్నింగ్ మిల్లులో యంత్రాలు పనిచేయక వారం రోజులకు పైగా పత్తి కొనుగోళు ఆగిపోయాయి. ఆదోనిలో క్రిస్మస్ పండగ పేరుతో కొనుగోళ్లు ఆపేయడంతో రైతులు ఇబ్బంది పడ్డారు. ఉమ్మడి జిల్లా పరిధిలో 2.10 లక్షల హెక్టార్లకుపైగా పత్తి సాగైంది. నాలుగు లక్షల మెట్రిక్ టన్నులకు పైగా పత్తి దిగుబడులు వచ్చాయి. కానీ సీసీఐ కొనుగోలు చేసింది అంతంతమాత్రమే కావడం గమనార్హం. '13,890 మంది రైతుల నుంచి నాలుగు మార్కెట్ల పరిధిలో రూ.237.22 కోట్ల విలువ చేసే 3,24,465 క్వింటాళ్ల పత్తిని సీసీఐ ప్రతినిధులు కొనుగోలు చేశారు. రైతులకు నగదు చెల్లింపులు జరుగుతున్నాయి' అని మార్కెటింగ్ శాఖ ఏడీ నారాయణ మూర్తి తెలిపారు.

# రైలు మార్గం సుగమం

డోన్ : డోన్- గుంతకల్లు రైలు మార్గంలో డబ్లింగ్ పనులు పూర్తయ్యాయి. బుగ్గానిపల్లె- పాణ్యం వరకు 19.35 కి.మీ. మేర చేపట్టిన పనులను ఇటీవల రైల్వే భద్రతా కమిషనర్ మాధవి పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. దీంతో గుంతకల్లు నుంచి పాణ్యం వరకు ఎలాంటి ఆటంకం లేకుండా రైళ్లు వెళ్లడానికి మార్గం సుగమం అయ్యింది. గుంతకల్లు డివిజన్ పరిధిలో డోన్ కూడలికి ఎంతో పేరుంది.. డబ్లింగ్, విద్యుద్దీకరణ పనులు పూర్తికావడంతో రైళ్లవేగం పెరగడంతోపాటు వాటి సంఖ్యా పెరిగే అవకాశం ఉంది.

**129 కి.మీ. మేర పనులు పూర్తి**



గుంతకల్లు- గుంటూరు( 403 కి.మీ) రైలు మార్గాన్ని డబ్లింగ్, విద్యుద్దీకరణ చేసేందుకు కేంద్రం గతంలో రూ.3,280 కోట్లు మంజూరు చేసింది. ఇందులో భాగంగా గుంతకల్లు నుంచి డోన్ రైల్వే జంక్షన్, బేతంచెర్ల, పాణ్యం వరకు 129 కి.మీ. మేర పనులు పూర్తయ్యాయి. ఇప్పటికే ఎద్దులదొడ్డి- మద్దికెర, మల్కాపురం- డోన్ స్టేషన్ల మధ్య పనులు పూర్తికావడంతో రైళ్ల వేగం పెరిగింది. మల్కాపురం నుంచి బేతంచెర్ల మీదుగా బుగ్గానిపల్లె వరకు రాకపోకలకు అనుమతులు లభించాయి. పనులు పూర్తయిన నేపథ్యంలో బేతంచెర్ల రైల్వేస్టేషన్‌లో చిన్న అమరావతి, పెద్ద అమరావతి, ప్రశాంతి, ధర్మవరం ఎక్స్‌ప్రెస్ రైళ్లు ఆపాలని ప్రయాణికులు విన్నవిస్తున్నారు.

**తప్పనున్న నిరీక్షణ**గుంతకల్లు, గుత్తి వైపు నుంచి ఆర్ఎస్ పెండేకల్లు జంక్షన్, డోన్ జంక్షన్ మీదుగా బెంగళూరు, రామేశ్వరం, న్యూఢిల్లీ, లక్నో, మైసూర్, జైపూర్, మంగళూరు, భువనేశ్వర్, ఓఖా, గోరఖ్‌పూర్, హవుడా, వాస్కోడిగామా, గోవా, శిరిడీ వంటి ప్రధాన నగరాలు, తెలుగు రాష్ట్రాల్లోని హైదరాబాద్, తిరుపతి, గుంటూరు, విజయవాడ వంటి ప్రాంతాలకు ఎక్స్‌ప్రెస్, ప్యాసింజర్‌లతో కలిపి 45 నుంచి 50 వరకు, గూడ్స్ రైళ్లు 25 వరకు తిరుగుతున్నాయి. ఏక వరుస లైన్(సింగిల్) ఉండటంతో గుంతకల్లు నుంచి డోన్, డోన్ నుంచి నంద్యాల, గుంటూరుకు రైళ్లు నెమ్మదిగా వెళ్తున్నాయి.. ఒక రైలు వస్తుందంటే మరొకటి స్టేషన్(క్రాసింగ్)లో ఆపేస్తున్నారు. ప్రయాణికులు గంటల తరబడి నిరీక్షించాల్సి వస్తోంది.

# మన భద్రత.. మనదే బాధ్యత



అనంతపురం : వాట్సాప్‌లో బ్యాంకు పేర్లతో కానీ, ప్రభుత్వ పథకాల పేర్లతో కానీ వచ్చే మెసేజ్‌లు పట్ల, లింకుల పట్ల జాగ్రత్తగా ఉండాలని, వాటిని డౌన్లోడ్ చేయొద్దని సూచిస్తూనే.. తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలు అంటూ స్టాక్, షేర్ మార్కెట్ల గురించి వచ్చే ప్రకటనకు ఆకర్షితులు కావొద్దని హెచ్చరిస్తున్నారు.

ఏదైనా సైబర్ మోసానికి గురైతే వెంటనే 1930కి కాల్ చేయాలని, లేదా 'సైబర్ క్రైం.జీవోవీ.ఇన్' అనే వెబ్‌సైట్లో ఫిర్యాదు చేయాలంటూ పోలీసులు అవగాహన కల్పిస్తున్నారు.

చరవాణి ఇప్పుడు అందరికీ నిత్యావసరం. జాగ్రత్తగా ఉపయోగిస్తే ఆనందం మన సొంతం. అదే ఆధారంగా చేసుకొని ఆన్‌లైన్ వేదికగా సైబర్ నేరగాళ్లు జిత్తులతో ఎత్తులు వేస్తూ పలువురిని మోసగిస్తున్నారు. ఆశలు, బలహీనతలే వారికి పెట్టుబడి.. బోల్తా కొట్టించేందుకు ఉద్యోగాలు, పెట్టుబడులు, షేర్ మార్కెట్లు ఇలా వివిధ రూపాల్లో పక్కదారి పట్టించి పెద్ద ఎత్తున డబ్బు కొల్లగొడుతున్నారు. ఈనేపథ్యంలో జిల్లా పోలీసు శాఖ 'సైబర్ సురక్ష అనే కొత్త కార్యక్రమాన్ని చేపట్టింది. నిత్య చైతన్యంతో సైబర్ దారుణాలకు అడ్డుకట్ట వేయాలనేదే కార్యక్రమ ఉద్దేశం.

**సైబర్ వాలంటీర్లు..**

జిల్లాలోని కళాశాలల్లో చురుగ్గా విద్యార్థులను వారిని ఒక బృందంగా తయారు చేస్తారు. వారిని సైబర్ వాలంటీర్లు అని పిలుస్తున్నారు. వీరు చేయాల్సిన మొదటి పని.. కుటుంబ సభ్యులను, చుట్టుపక్కల వారికి, గ్రామాల్లో అవగాహన కల్పించడం. ఇందుకు 'ఎన్‌సీఆర్‌పీ' పోర్టల్‌లో సైబర్ వాలంటీర్లుగా స్వచ్ఛందంగా నమోదుకు అవకాశం కల్పించారు. ఇప్పటికే జిల్లావ్యాప్తంగా పట్టణాలు, మండల కేంద్రాలు, కూడళ్లలో సైబర్ మోసాలను ఎలా ఎదుర్కోవాలో వీడియోల రూపంలో ప్రదర్శిస్తున్నారు. ఇందుకు మూడు డిజిటల్ డిస్‌ప్లే వాహనాలను ఏర్పాటు చేశారు. రికార్డు చేసిన ఆడియోలను 'టాంటాం' ఆటోల్లో మైక్‌ల ద్వారా తెలియజెప్పుతారు.

**ప్రభావశీలుర భాగస్వామ్యం**

సామాజిక మాధ్యమాల్లో తమ వీడియోలతో అభిమానులు సంపాదించుకున్న వారిని గుర్తించి.. వారి ద్వారా సైబర్ నేరాలపై అవగాహన వీడియోలు చేయిస్తున్నారు. అత్యంత ప్రభావశీలురతో ప్రజలకు ఉపయోగపడే వీడియోలు, సందేశాలను సిద్ధం చేస్తున్నారు. ఇందుకు పలువురు ప్రభావశీలురు అవగాహన కార్యక్రమాలకు మద్దతు పలికారు.

**ప్రచారంలో వైవిధ్యం**

నీవు డబ్బు పంపకపోతే నీ బ్యాంకు ఖాతా స్తంభింప జేస్తాం.., మీరు చెప్పినట్టు వినకపోతే మీ వీడియోలను సామాజిక మాధ్యమాల్లో పెడతాం.. అంటూ సైబర్ నేరగాళ్లు వేసే ఎత్తుగడలు పసిగట్టేలా అవగాహనా కార్యక్రమాలను రూపకల్పన చేస్తున్నారు. ఇటీవల 'డిజిటల్ అరెస్టు' విషయంలో ఓ వీడియోకాల్ ద్వారా అధికారి రూపంలో బెదిరిస్తున్న తీరును కళ్లకు కట్టేలా రూపకల్పన చేశారు.

**అపరిచితులతో జాగ్రత్త**

ఇంటి వద్దనే పనిచేస్తూ సులువుగా డబ్బు సంపాదించుకోవచ్చు అనే ప్రకటనలకు ఆకర్షితులు కావొద్దని అవన్నీ 'ఇన్వెస్ట్ ఫ్రాడ్' అని అవగాహన కల్పిస్తున్నారు. అపరిచిత వ్యక్తులు మీకు ఫోన్ చేసి మీ పేరుపై కొరియర్ వచ్చిందని అందులో డ్రగ్స్ ఉన్నాయంటూ భయపెట్టే 'కొరియర్ ఫ్రాడ్' తీరును వివరిస్తున్నారు. 'లోన్ యాప్‌లు' మోసపూరితమని వాటి జోలికెళ్లొద్దంటూ ఉదాహరణలు చెబుతున్నారు.

# కీలక రహదారి.. నరకప్రాయంగా మారి



అనంతపురం : సరకు రవాణాను వేగవంతం చేయడానికి రామనగర-కృష్ణపట్నం జాతీయ రహదారి (ఎన్‌హెచ్-67) పనులు ఏళ్లుగా ముందుకు సాగడం లేదు. కర్ణాటకలోని బళ్లారి నుంచి ఉమ్మడి అనంతపురం, కడప, నెల్లూరు జిల్లాలను కలిపే ఈ రహదారి నిర్మాణం పూర్తయితే రెండు రాష్ట్రాల అభివృద్ధిలో కీలకంగా మారనుంది. ఇంతటి ప్రాధాన్యమున్న మార్గాన్ని గత వైకాపా ప్రభుత్వం నిర్లక్ష్యం చేసింది. ఫలితంగా సరకు రవాణా అత్యంత దుర్లభంగా మారింది. ప్రయాణికులు సైతం ఈ మార్గంలో వెళ్లాలంటే భయపడాల్సిన పరిస్థితి నెలకొంది. కూటమి ప్రభుత్వం వచ్చాక తాడిపత్రి నుంచి కడప జిల్లాలోని ఎర్రగుంట్ల వరకు నిర్మాణ పనులు మొదలయ్యాయి. విడపనకల్లు మండలం డొనేకల్లు నుంచి గుత్తి మార్గానికి ఇప్పటికీ మోక్షం లభించలేదు.

**గుత్తేదారు మృతితో..**

బళ్లారి సరిహద్దు నుంచి గుంతకల్లు మీదుగా గుత్తి వరకు 57 కిలోమీటర్ల రహదారి పనుల్ని ఎస్ఆర్‌కే సంస్థకు అప్పంగించారు. రూ.668 కోట్ల అంచనా వ్యయంతో 2016లోనే పనులు మొదలుపెట్టారు. 2019 వరకు పనులు వేగంగా జరిగాయి. రూ.557 కోట్ల మేర ఖర్చు చేసి 86 శాతం మేర పనులు పూర్తిచేశారు. వైకాపా అధికారంలోకి వచ్చాక నత్తనడకన సాగుతూ వచ్చాయి. 2021లో గుత్తేదారు మరణించడంతో పనులు పూర్తిగా నిలిచిపోయాయి. దీంతో ఎన్‌హెచ్ అధికారులు కాంట్రాక్టును రద్దు చేశారు.

**పూర్తి కాకుండానే పగుళ్లు..**

దేశంలోనే ప్రయోగాత్మకంగా ఎన్‌హెచ్-67ను సిమెంటు రోడ్డుగా తీర్చిదిద్దడానికి పనులు చేపట్టారు. 2021 నాటికే చాలావరకు నాలుగు వరుసల నిర్మాణం పూర్తయింది. విడపనకల్లు మండలం డొనేకల్లు, కడదరబెంచి, గడేకల్లు, పెంచలపాడు గ్రామాల పరిధిలో వంతెనలు, ఇతర పనులు చేపట్టాల్సి ఉంది. నాణ్యత లేకపోవడం, పర్యవేక్షణ కొరవడటంతో 2019కు మందు నిర్మించిన సిమెంటు రోడ్డుకు పగుళు వచ్చాయి. బళ్లారి సరిహద్దు నుంచి గుంతకల్లు వరకు సుమారు 30 చోట్ల ఈ దుస్థితి నెలకొంది. బళ్లారి నుంచి గుంతకల్లు మీదుగా నిత్యం వేలాది సరకు రవాణా వాహనాలు కృష్ణపట్నం పోర్టుకు రాకపోకలు సాగిస్తుంటాయి. అసంపూర్తి పనులతో ప్రయాణ సమయం రెండు, మూడు గంటలు పెరుగుతూ.. ఇంధన ఖర్చు అధికంగా ఉంటోందని వాహనదారులు, వాహనాలు గ్రామాల మీదుగా వెళ్తున్నప్పుడు ఎగుస్తున్న దుమ్ముతో అవస్థలు పడుతున్నట్లు స్థానికులు వాపోతున్నారు.

**మరమ్మతులు చేపడతాం..- సుధాకర్‌రెడ్డి, ఈఈ, ఎన్‌హెచ్ విభాగం**

దెబ్బతిన్న రహదారిని బాగు చేసేందుకు టెండర్లు పిలిచాం. త్వరలోనే పనులు మొదలుపెడతాం. పెండింగ్ పనులు పూర్తి చేయడానికి అంచనాలు సిద్ధం చేసి కేంద్ర ప్రభుత్వానికి పంపాం. అనుమతులు రాగానే టెండర్ల ప్రక్రియ చేపడతాం.

# 12 లేఖలు రాసినా స్పందన కరవు

అనంతపురం : గత వైకాపా ప్రభుత్వ పాలకుల నిర్లక్ష్య వైఖరి.. అసమర్థత కారణంగా మూడున్నరేళ్లపాటు హెచ్చెల్సీ ఎస్ఈ కార్యాలయానికి పక్కా భవన సముదాయం లేకుండా పోయింది. అనంత నగర నడిబొడ్డున ఉండే హెచ్చెల్సీ ప్రాజెక్టుకు చెందిన రూ.85 కోట్లు ఖరీదు చేసే 3.82 ఎకరాలను గత ప్రభుత్వం రాష్ట్ర వైద్య,ఆరోగ్య శాఖకు స్వాధీనం చేసింది. ప్రత్యామ్నాయంగా కొత్త భవన నిర్మాణానికి రూ.10 కోట్లు ఇస్తామంటూ అప్పట్లోనే జీవో 32లో పేర్కొన్నా ఇప్పటికీ కార్యరూపం దాల్చలేదు. తాజా అంచనాల ప్రకారం కొత్త భవన నిర్మాణానికి రూ.14.65 కోట్లు అవుతుందని.. ఈ మొత్తాన్ని మంజూరు చేయాలంటూ జిల్లా జలవనరుల శాఖ సీఈ, హెచ్చెల్సీ ఎస్ఈ ఇప్పటికే ఏపీ వైద్య,ఆరోగ్య మౌలిక వసతుల అభివృద్ధి సంస్థ(ఏపీఎంహెచ్ఐడీసీ) ఎండీ, సీఈలకు 12 లేఖలు పంపినా స్పందన లేదంటే నిర్లక్ష్యం ఏస్థాయిలో ఉందో స్పష్టమవుతోంది.

**సర్వజన వైద్యశాల విస్తరణకు..**

అనంత నగరంలో తెలుగుతల్లి కూడలి పక్కనే సర్వే నెంబరు 2019-1లో 3.82 ఎకరాల ఆవరణలో హెచ్చెల్సీ ఎస్ఈ కార్యాలయ భవన సముదాయం ఉండేది. ఈ స్థలాన్ని అప్పట్లో ప్రభుత్వ సర్వజన వైద్యశాల విస్తరణ భవన సముదాయాల నిర్మాణానికి తీసుకున్నారు. జిల్లా జలవనరుల శాఖ(ఎంఐ) ఆవరణలో పక్కా భవన నిర్మాణానికి రూ.10కోట్లు ఇస్తామంటూ 2021, మార్చి 22న రాష్ట్ర వైద్య,ఆరోగ్య శాఖ జారీ చేసిన జీవో 32లో స్పష్టంగా పేర్కొన్నారు. జీ౦3 స్థాయిలో భవనాన్ని నిర్మించాలని డిజైన్, అంచనా, సాంకేతిక ఆమోదం.. ఇలా



అన్నింటిని ఏపీఎంహెచ్ఐడీసీ ఎండీ, సీఈలకు కూడా పంపారు. అప్పటి కలెక్టర్ ఒత్తిడితో 2021, అక్టోబరు 14న ఆగమేఘాలపై ఎస్ఈ కార్యాలయాన్ని ఖాళీ చేయాల్సి వచ్చింది.

**అతిథి భవనంలో అష్టకష్టాలు**పాత భవన సముదాయంలో ఉన్న హెచ్చెల్సీ ఎస్ఈ కార్యాలయాన్ని మూడున్నరేళ్ల క్రితం ఖాళీ చేశారు. అక్కడి నుంచి హెచ్చెల్సీ కాలనీలోని ఇరుకైన గదుల్లో నిర్వహిస్తున్నారు. అత్యంత దయనీయం ఏమంటే ఓ అతిథి భవనంలో ఎస్ఈ కార్యాలయం, డిజైన్, టెక్నికల్, పరిపాలన.. ఇలా పలు విభాగాలు వేర్వేరు చోట్లా ఏర్పాటు చేశారు. అష్టకష్టాలు పడుతూ చాలీచాలని గదుల్లో నిర్వహించే దుస్థితి తలెత్తింది. ఈ కష్టాలన్నీ చెప్పినా ఏపీఎంహెచ్ఐడీసీ యంత్రాంగం కనికరించలేదు. రూ.85కోట్లు ఖరీదు చేసే స్థలాన్ని తీసుకుని...రూ.14.65 కోట్లు ఇవ్వడానికి మీనమేషాలు లెక్కిస్తున్నారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం చొరవ తీసుకుని సమస్యను పరిష్కరించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

# పేదల గూడు.. కూటమి తోడు

కర్నూలు : గూడు లేని పేదల సొంతింటి కల నెరవేర్చేందుకు కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఏడాదికి ఐదు లక్షల చొప్పున ఐదేళ్ల కాలంలో 25 లక్షల గృహ నిర్మాణాలు మంజూరు చేసేందుకు ప్రణాళికలు రూపొందించింది. పీఎంఏవై అర్బన్- 2.0 పథకం కింద దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు.. ఒక్కో ఇంటి నిర్మాణానికి రూ.2.50 లక్షలు ఇవ్వనున్నారు. ఇప్పటి వరకు 18,522 అర్జీలు వచ్చాయి. దరఖాస్తులు చేసుకోవడానికి అవకాశం ఉంది.. మార్చిలో ఇళ్లు మంజూరు అవుతాయని గృహ నిర్మాణ శాఖ అధికారులు చెబుతున్నారు. అదేవిధంగా నిర్మాణంలో ఉన్న 10,534 గృహాలు పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. సంక్రాంతికి పనులు పూర్తి చేయించి రాష్ట్రంలో లక్ష ఇళ్లను ఒకేసారి ప్రారంభించేందుకు చర్యలు చేపట్టారు.

**55 మండలాలకు అవకాశం**

ఉమ్మడి కర్నూలు జిల్లాలో కర్నూలు నగరపాలక సంస్థ, ఆదోని, ఎమ్మిగనూరు, గూడూరు, నంద్యాల, ఆళ్లగడ్డ, నందికొట్కూరు, ఆత్మకూరు, డోన్ పురపాలక సంఘాలతోపాటు బేతంచెర్ల నగర పంచాయతీ, కర్నూలు జిల్లాలో 25, నంద్యాల జిల్లాలో 26 మండలాలు కలిపి మొత్తం 55 మండలాలు కర్నూలు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (కుడా) పరిధిలో ఉన్నాయి. కుడా పరిధిలో ఉంటే ప్రధాన మంత్రి ఆవాస్ యోజన-2.0 పథకానికి గ్రామీణ, పట్టణ ప్రాంతాల వారందరూ అర్హులవుతారు.

**అర్హులు ఎవరంటే**

సొంత స్థలం ఉండి ఇల్లు నిర్మించుకునేందుకు ముందుకు వచ్చేవారు ముందుగా గ్రామ, వార్డు సచివాలయాల్లో స్థలాలకు సంబంధించిన పత్రాలు, భార్య, భర్త ఆధార్ కార్డులు, కుల ధ్రువీకరణ పత్రాలు, రేషన్ కార్డు పత్రాలతో దరఖాస్తు చేసుకోవాలి. ఇదివరకెన్నడూ తమ పేర్లతో గృహ నిర్మాణ పథకం కింద ఇల్లు మంజూరు కాకుంటేనే అర్హులవుతారు. సచివాలయాల్లో దరఖాస్తు చేసుకున్న తర్వాత వాటిని తమ పరిధిలోని హౌసింగ్ ఏఈకి అందించాల్సి ఉంటుంది.

**బిల్లుల మంజూరుకు రంగం**

గతంలో తెదేపా ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు ఎన్టీఆర్ గృహ నిర్మాణాల పేరుతో ఇళ్లు లేని పేదలకు గృహాలను మంజూరు చేశారు. ఆ తర్వాత బిల్లులు చెల్లించకుండా వైకాపా ప్రభుత్వం మొండికేసింది. బిల్లులొస్తాయన్న ఆశతో కొందరు అప్పులు చేసి ఇళ్లు పూర్తి చేసుకున్నారు. బిల్లులు రాక అల్లాడిపోయారు. ఈ క్రమంలో ఆరు నెలల కిందట అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం గతంలో మంజూరైన ఇళ్లలో ఎన్ని పూర్తయ్యాయి? బిల్లు బకాయిలు ఉంత తదితర వాటిపై సర్వే చేయించింది. కర్నూలు జిల్లాలో 25,624 మంది లబ్ధిదారులకు రూ.41.64 కోట్లు, నంద్యాల జిల్లాలో 28,649 మందికి రూ.49.89 కోట్ల మేర బిల్లులు రావాల్సి ఉందని తేలింది. ఈ నూతన సంవత్సరంలో ప్రభుత్వం లబ్ధిదారులకు పెండింగ్ బిల్లులు చెల్లించనుంది.

**కొరవడిన ప్రచారం**

ప్రధానమంత్రి ఆవాస్ యోజన పథకం కింద ఇచ్చే రూ.2.50 లక్షలతో పాటు లబ్ధిదారులు మరో రూ.3 లక్షల నుంచి రూ.4 లక్షలు సొంతంగా పెట్టుకుంటే ఇంటి నిర్మాణం పూర్తవుతుంది. పథకం బాగున్నా ప్రచారం కొరవడింది. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో సచివాలయ ఉద్యోగులు, హౌసింగ్ ఏఈలు ప్రచారం కల్పించడంలో పూర్తిగా విఫలమయ్యారు. నెల రోజుల కింద ప్రారంభించిన డిమాండ్ సర్వే సైతం నత్తనడకన సాగుతోంది. తమకు సొంతంగా స్థలాలున్నాయని.. గృహాలు మంజూరు చేయాలంటూ కర్నూలు జిల్లాలో 12,102, నంద్యాల జిల్లాలో 6,420 మంది మాత్రమే దరఖాస్తు చేసుకున్నారు.

**అందరికీ అందించేలా..**

టిడ్కో గృహాలకు సంబంధించి ఉమ్మడి జిల్లాలో 29 వేల మంది లబ్ధిదారులకుగాను కేవలం 6,159 మందికి మాత్రమే ఇళ్లు అందజేశారు. 22,933 మంది గత ఐదేళ్లుగా సొంతింటి కోసం ఎదురుచూసినా వైకాపా ప్రభుత్వం పట్టించుకోలేదు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే రుణాలిచ్చేందుకు హడ్కో సంసిద్ధత వ్యక్తం చేసింది. దీంతో టిడ్కో గృహాలకు మంచి రోజులు రానున్నాయి. టిడ్కో గృహ సముదాయాల్లో సౌకర్యాలు కల్పించడంతోపాటు త్వరలో వడ్డీ బకాయిలు చెల్లించి జూన్‌లో పెద్దఎత్తున గృహ ప్రవేశాలు చేయించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది.

**నాడు రూ.1.80 లక్షలు.. నేడు రూ.2.50 లక్షలు**

గత వైకాపా ప్రభుత్వ హయాంలో నాలుగేళ్ల కిందట మంజూరైన ఇళ్లలో 20 వేలకుపైగా నిర్మాణాలను లబ్ధిదారులు ప్రారంభించుకోలేదు. ఇవికాక ఉమ్మడి జిల్లాలో మరో 80 వేల మందికి గత ప్రభుత్వ హయాంలో స్థలాలిచ్చినా గృహాలు మంజూరు చేయలేదు.

గత వైకాపా ప్రభుత్వం ఇంటి నిర్మాణానికి రూ.1.80 లక్షల ఆర్థిక సాయం అందజేసింది. ఆ నగదు సరిపోక చాలా మంది నిళ్ల నిర్మాణానికి ముందుకు రాలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే పీఎంఏవై అర్బన్- 2.0 పథకం కింద ఒక్కో ఇంటి నిర్మాణానికి రూ.2.50 లక్షలకు పెంచింది. కేంద్రం రూ.1.50 లక్షలు, రాష్ట్ర ప్రభుత్వం రూ.లక్ష కలిపి అందించనుంది. గత ప్రభుత్వంతో పోలిస్తే ఒక్కో ఇంటి నిర్మాణానికి రూ.70 వేలు ఇవ్వనున్నారు.

# ఆరేళ్లలోపు చిన్నారులకు ఆధార్ నమోదు

రాజమహేంద్రవరం : ఆధార్ గుర్తింపు సంఖ్యలేని ఆరేళ్లలోపు చిన్నారులు జిల్లాలో 17 వేల మంది వరకు ఉంటారని అధికారులు అంచనాకు వచ్చారు. ఆధార్ సంఖ్య ఆధారంగానే ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు జరుగుతున్న దృష్ట్యా వీరందరికీ ఆధార్ నమోదు చేయించేందుకు నిర్ణయించారు. 0-6 మధ్య వయస్సున్న చిన్నారులకు ఆధార్ నమోదు కోసం జిల్లాలో ఈ నెల 6 నుంచి 10వ తేదీ వరకు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించేందుకు చర్యలు చేపట్టారు. దీనిలో భాగంగా ఆయా గ్రామ, వార్డు సచివాలయాల పరిధిలో ప్రత్యేక ఆధార్ నమోదు శిబిరాలు నిర్వహిస్తారు. తొలిదశలో ఈ అయిదు రోజులపాటు జరిగే ప్రత్యేక ఆధార్ నమోదు ప్రక్రియలో 84 బృందాలుగా సిబ్బంది విధులు నిర్వర్తిస్తారు. ఏ రోజు ఎక్కడ చిన్నారులకు నమోదు చేస్తారనే వివరాలు మండల కేంద్రంలోని కార్యాలయాల్లో, గ్రామ, వార్డు సచివాలయాల్లోని నోటీసు బోర్డుల్లో ప్రదర్శించడంతో పాటు.. అంగన్‌వాడీ, సచివాలయాల సిబ్బంది ద్వారా ప్రజలకు అవగాహన కల్పించనున్నట్లు అధికారులు చెబుతున్నారు. దీనికోసం మున్సిపల్, మండల పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాలకు సమీపంలోని సచివాలయాల్లో సిబ్బంది అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకున్నారు.

**పేరుతో కూడిన జనన ధ్రువీకరణ తప్పనిసరి**

ఆరేళ్లలోపు చిన్నారులకు కొత్తగా ఆధార్ నమోదు చేసే సమయంలో వారి పేరుతో కూడిన జనన ధ్రువీకరణ పత్రం తప్పనిసరిగా ఉండాలి. ఒకవేళ ఆ పత్రంలో పేరు లేకుండా ఉంటే సంబంధిత అధికారులను సంప్రదించి తప్పక నమోదు చేయించాలి. తర్వాత పుట్టిన తేదీ ధ్రువీకరణ పత్రంతో ఆధార్ నమోదు సిబ్బందిని కలిసి చిన్నారి తల్లి లేదా తండ్రి ఆధార్ కార్డు, ఫోన్ నంబర్ల వివరాలతో నమోదు చేయించుకుని పిల్లల ఆధార్ పొందాల్సి ఉంటుందని అధికారులు చెబుతున్నారు.

చురకలు



# క్యూట్ కీర్తి రాయల్ లుక్

బాలనటిగా పాతిక ఏళ్ల క్రితం ఇండస్ట్రీలో అడుగు పెట్టిన కీర్తి సురేష్ హీరోయిన్‌గా ప్రస్తుతం బిజీగా ఉంది. మలయాళం మూవీ గీతాంజలితో హీరోయిన్‌గా ఎంట్రీ ఇచ్చిన కీర్తి సురేష్ తక్కువ సమయంలోనే కోలీవుడ్‌లో పెద్ద హీరోల సినిమాల్లో నటించింది. మలయాళంలో హీరోయిన్‌గా మొదటి సినిమా చేసిన రెండేళ్లకే తమిళ్‌లో హీరోయిన్‌గా నటించే అవకాశం దక్కింది. ఆ తదుపరి సంవత్సరంలోనే తెలుగులో రామ్ కు జోడీగా 'నేను శైలజ' సినిమాలో నటించింది. కెరీర్ ఆరంభం నుంచి మొన్నటి వరకు స్కిన్ షో విషయంలో కీర్తి సురేష్ చాలా దూరం ఉంటూ వచ్చింది. కానీ ఇప్పుడు పరిస్థితి మారినట్లు అనిపిస్తుంది. బాలీవుడ్‌లో ఎంట్రీ ఇచ్చిన తర్వాత కాస్త పద్ధతి మార్చుకుందని టాక్ వినిపిస్తుంది. టాలీవుడ్‌లో ఈమె మహేష్ బాబు, పవన్ కళ్యాణ్ వంటి స్టార్ హీరోల సినిమాల్లో నటించింది. కానీ స్కిన్



షో కి ఓకే చెప్పక పోవడంతో పాటు, ఇతర కారణాల వల్ల తెలుగులో ఎక్కువగా ఈమె కనిపించడం లేదు. టాలీవుడ్‌లో ఈమెకు మహానటి సినిమాతో మంచి గుర్తింపు దక్కింది. ఆ సినిమా పాన్ ఇండియా రేంజ్‌లో మంచి విజయాన్ని సొంతం చేసుకుంది. ఆ సినిమా తర్వాత తెలుగులో వరుసగా సినిమాలు చేసిన కీర్తి సురేష్ ఈమధ్య కాలంలో తెలుగులో సినిమాలు చేయడమే బొత్తిగా మానేసింది. ఆకట్టుకునే అందం తో పాటు, మంచి నటన ప్రతిభ ఉన్న కీర్తి సురేష్ ప్రస్తుతం తమిళ్, హిందీ సినిమా ఇండస్ట్రీలో వరుస ప్రాజెక్ట్‌లు చేస్తుంది. ఎన్ని సినిమాలు చేస్తూ బిజీగా ఉన్నా రెగ్యులర్‌గా సోషల్ మీడియా ద్వారా తన అందమైన ఫోటోలను షేర్ చేస్తూ ఉంటుంది. రెగ్యులర్ ఫోటోల కంటే ఈసారి కీర్తి సురేష్ కాస్త గ్లామర్‌గా కనిపిస్తుందని కొందరు కామెంట్స్ చేస్తున్నారు. ఈ విభిన్నమైన ఔట్ ఫిట్‌లో రాయల్ లుక్ వచ్చింది అని కొందరు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. కీర్తి ఔట్ ఫిట్‌తో పాటు ప్రతి ఒక్కటీ చూపు తిప్పనివ్వడం లేదు అంటూ నెటిజన్స్ కామెంట్స్ చేస్తున్నారు. కీర్తి సురేష్ అందమైన ఔట్ ఫిట్‌లో మరింత అందంగా కనిపిస్తోంది అంటూ నెటిజన్స్ తెగ కామెంట్ చేస్తూ ఆమె అందంపై ప్రశంసలు కురిపిస్తూ ఉన్నారు. కీర్తి సురేష్ తన అందమైన ఫోటోలను షేర్ చేయడం ద్వారా నెటిజన్స్‌కి వినోదాన్ని పంచుతుంది. క్యూట్ కీర్తి సురేష్ మెల్ల మెల్లగా రూటు మార్చుకుంటూ ఉందని కొందరు అంటున్నారు. తెలుగులో కీర్తి సురేష్ చివరగా భోళా శంకర్ సినిమాలో నటించింది. ఆ సినిమాలో హీరోయిన్‌గా కాకుండా ముఖ్య పాత్రలో నటించింది. తెలుగులో హీరోయిన్‌గా కీర్తి సురేష్ చివరగా దసరాలో నటించింది. నానితో పోటీ పడి మరీ ఆ సినిమాలో కీర్తి సురేష్ డీ గ్లామర్ లుక్‌తో అలరించింది. అంతే కాకుండా సీరియస్‌గా నటించి సినిమాకు ప్రధాన ఆకర్షణగా నిలిచింది. మొత్తానికి తెలుగు బాక్సాఫీస్ వద్ద ఈ అమ్మడి సందడి కనిపించడం లేదు.

# ఘాటీ వాయిదా తప్పేలా లేదు

బాహుబలి సినిమాతో భారీ క్రేజ్ సొంతం చేసుకున్న టాలీవుడ్ స్టార్ హీరోయిన్ అనుష్క శెట్టి ఆ సినిమా తర్వాత వరుసపెట్టి సినిమాలు చేసి తన సత్తా చాటుతుందనుకున్నారు అందరూ. కానీ తను మాత్రం ఆ సినిమా తర్వాత స్లో అయిపోయింది. అనుష్క నుంచి సినిమా రిలీజై దాదాపు సంవత్సరంన్నర దాటుతుంది. స్వీటీ నటించిన ఆఖరి సినిమా మిస్ శెట్టి మిస్టర్ పోలిశెట్టి. నవీన్ పోలిశెట్టి హీరోగా నటించిన ఈ సినిమాకు మహేష్ బాబు దర్శకత్వం వహించారు. ఈ సినిమాకు ఆడియన్స్ నుంచి మంచి రెస్పాన్స్ రావడంతో పాటూ బాక్సాఫీస్ వద్ద కూడా మిస్ శెట్టి మిస్టర్ పోలిశెట్టి మంచి హిట్ గా నిలిచింది. ఆ సినిమా తర్వాత మళ్లీ గ్యాప్ తీసుకుంది అనుష్క. చాలా టైమ్ తీసుకుని మొత్తానికి అనుష్క రెండు సినిమాలకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. అందులో ఒకటి మలయాళంలో చేస్తున్న కథనర్ కాగా, రెండోది తెలుగులో చేస్తున్న ఘాటీ సినిమా. ఈ రెండు సినిమాలూ



పాన్ ఇండియా రేంజ్ లో తెరకెక్కుతున్నాయి. ఇందులో ఘాటీ సినిమా ముందుగా ప్రేక్షకుల ముందుకు రానుంది. క్రిష్ జాగర్లమూడి దర్శకత్వంలో వస్తున్న ఈ సినిమాను యూవీ క్రియేషన్స్ భారీ బడ్జెట్ తో నిర్మించింది. అయితే ఘాటీ సినిమా ఏప్రిల్ 18న రిలీజ్ కానున్నట్టు మేకర్స్ ఎప్పుడో అనౌన్స్ చేసిన విషయం తెలిసిందే. అంటే రిలీజ్ కు ఇంకా నెల కూడా లేదు. కానీ ఇప్పటివరకు ఘాటీ టీమ్ సినిమా నుంచి టీజర్ ను తప్ప మరే ప్రమోషనల్ కంటెంట్ ను వదిలింది లేదు. రిలీజ్ దగ్గర పడుతున్నా కూడా మేకర్స్ ప్రమోషన్స్ విషయంలో సైలెంట్ గానే ఉంటున్నారు. దీంతో ఘాటీ వాయిదా పడుతుందనే అనుమానాలు బలపడుతున్నాయి. అయితే ఎప్పట్నుంచో ఈ సినిమా వాయిదా పడే ఛాన్సుందని అంటున్నారు తప్పించి నిర్మాతల నుంచి మాత్రం ఈ విషయంలో ఎలాంటి అఫీషియల్ అనౌన్స్‌మెంట్ వచ్చింది లేదు. విక్రమ్ ప్రభు కీలక పాత్ర పోషిస్తున్న ఈ సినిమాకు విద్యా సాగర్ సంగీతం అందిస్తున్నాడు. ఈ సినిమాలో అనుష్క చాలా మాస్ లుక్ లో కనిపించనున్నట్టు టీజర్ చూస్తుంటే అర్థమవుతోంది.




# ప్రియదర్శి 'సారంగపాణి జాతకం' - పర్ఫెక్ట్ సమ్మర్ డేట్!




టాలెంటెడ్ నటుడు ప్రియదర్శి ప్రధాన పాత్రలో తెరకెక్కుతున్న కామెడీ ఎంటర్టైనర్ సారంగపాణి జాతకం విడుదల తేదీ ఖరారైంది. టాలెంటెడ్ దర్శకుడు మోహనకృష్ణ ఇంద్రగంటి తెరకెక్కిస్తున్న ఈ సినిమా పూర్తిస్థాయి ఫ్యామిలీ కామెడీ డ్రామాగా రూపొందింది. గతంలో జెంటిల్‌మన్, సమ్మోహనం వంటి విజయవంతమైన చిత్రాలను నిర్మించిన శివలెంక కృష్ణప్రసాద్ ఈ చిత్రాన్ని శ్రీదేవి మూవీస్ బ్యానర్‌పై నిర్మిస్తున్నారు. ఇక సినిమా విడుదలపై చాలా రోజులుగా అనేక రకాల గాసిప్స్ వైరల్ అవుతున్నాయి. ఇక ఎట్టకేలకు మేకర్స్ ఓ నిర్ణయానికి వచ్చినట్లు తెలుస్తోంది. లేటెస్ట్ అప్డేట్ ప్రకారం, ఈ సినిమా ఏప్రిల్ 18న గ్రాండ్ గా రిలీజ్ కాబోతోంది. ప్రస్తుతం సినిమా సెన్సార్ కార్యక్రమాలు మినహా అన్నీ పనులు పూర్తయ్యాయి. ఇప్పటికే విడుదలైన టీజర్‌కు మంచి రెస్పాన్స్ రావడంతో సినిమా పై అంచనాలు పెరిగాయి. ఇటీవల విడుదలైన కోర్ట్ సినిమాతో బాక్సాఫీస్ వద్ద సాలీడ్ విజయాన్ని అందుకున్న ప్రియదర్శి, ఈసారి సారంగపాణి జాతకం ద్వారా ప్రేక్షకులను నవ్వులతో ముంచెత్తాలని చూస్తున్నారు. ఇప్పటికే డబ్బింగ్ పూర్తయింది. వివేక్ సాగర్ అందించిన సంగీతం కూడా ఆకట్టుకుంటోంది. రెండు పాటలు ఇప్పటికే విడుదల కాగా, మిగిలిన ట్రాక్‌లు కూడా మంచి స్పందన అందుకునే అవకాశముంది. సారంగపాణి జాతకం సినిమాలో అన్ని వర్గాల ప్రేక్షకులను ఆకట్టుకునేలా మంచి కామెడీ హంగులు పుష్కలంగా ఉన్నాయని నిర్మాత కృష్ణప్రసాద్ విశ్వాసం వ్యక్తం చేశారు. కుటుంబ ప్రేక్షకులను ఆకట్టుకునేలా కథను మలిచారని, ఇప్పటివరకు వచ్చిన ప్రోమోలకు సానుకూల స్పందన రావడంతో సినిమా మంచి విజయాన్ని సాధిస్తుందని భావిస్తున్నట్లు తెలిపారు. వెన్నెల కిశోర్, వీకే నరేష్, వైవా హర్షా డిఫరెంట్ కామెడీ రోల్స్ లో కనిపించనున్నారు. తణికెళ్ల భరణి, శ్రీనివాస్ అవసరాల, శివన్నారాయణ ఇతర కీలక పాత్రల్లో కనిపించనున్నారు. ఉమామహేశ్వర ఉగ్రరూపస్య ఫేమ్ రూపా కొడువయూర్ హీరోయిన్‌గా నటించగా, పీజీ విందా సినిమాటోగ్రఫీ, రవీందర్ ప్రొడక్షన్ డిజైన్ విభాగాలను అందించారు. ఇక ఈ సినిమా ట్రైలర్ ఏప్రిల్ తొలి వారంలో విడుదల కానుంది. వేసవి సీజన్‌లో కుటుంబ ప్రేక్షకులకు సరైన ఎంటర్టైన్మెంట్ అందించడానికి సారంగపాణి జాతకం సిద్ధంగా ఉంది. మరి సినిమా బాక్సాఫీస్ వద్ద ఎలాంటి ఫలితాన్ని అందుకుంటుందో చూడాలి.

# 'అఖండ' తాండవం ఎక్కడ..!



బాలకృష్ణ మొన్న సంక్రాంతికి 'డాకు మహారాజ్' సినిమాతో ప్రేక్షకుల ముందుకు వచ్చిన విషయం తెల్సిందే. ఆ సినిమాకు పాజిటివ్ రెస్పాన్స్ దక్కింది. వెంకటేష్ సంక్రాంతికి వస్తున్నాం సినిమా కారణంగా డాకు మహారాజ్ వసూళ్లు తగ్గాయి. లేదంటే బాలయ్య కెరీర్లో అత్యధిక వసూళ్లు సాధించిన సినిమాగా డాకు మహారాజ్ నిలిచేది అంటూ బాక్సాఫీస్ వర్గాల వారు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. బాబీ దర్శకత్వంలో వచ్చిన డాకు మహారాజ్ సినిమా బాక్సాఫీస్ వద్ద భారీ వసూళ్లు సాధించలేకపోయినా, బాలయ్య తదుపరి సినిమా 'అఖండ : తాండవం' సినిమా ఆ లోటును భర్తీ చేస్తుందనే విశ్వాసంను నందమూరి ఫ్యాన్స్‌తో పాటు అన్ని వర్గాల వారు వ్యక్తం చేస్తున్నారు. బోయపాటి శ్రీను దర్శకత్వంలో బాలయ్య హీరోగా ఇప్పటి వరకు మూడు సినిమాలు వచ్చాయి. సింహా, లెజెండ్, అఖండ సినిమాలు బాక్సాఫీస్ వద్ద భారీ విజయాలను సొంతం చేసుకున్నాయి. ముఖ్యంగా అఖండ సినిమా బాక్సాఫీస్ వద్ద దాదాపు రూ.200 కోట్ల వసూళ్లను రాబట్టింది అంటూ ఇండస్ట్రీ వర్గాల ద్వారా సమాచారం అందుతోంది. ఇప్పటి వరకు మూడు సినిమాలు వీరి కాంబోలో వచ్చి సూపర్ హిట్ అయ్యి బ్లాక్ బస్టర్ విజయాలను సొంతం చేసుకున్న విషయం తెల్సిందే. అందుకే డబుల్ హ్యాట్రిక్ అఖండ 2 తో సాధ్యం అంటూ పలువురు ఫ్యాన్స్ చాలా నమ్మకంగా ఉన్నారు. డాకు మహారాజ్ విడుదలకు ముందు నుంచే అఖండ 2 పనులు జరుగుతున్నాయి. అఖండ 2 కోసం ఇటీవల జరిగిన మహా కుంభమేళలో కీలక సన్నివేశాలను చిత్రీకరించారనే విషయం తెల్సిందే. ఆ తర్వాత విజయవాడలో కీలక సన్నివేశాలను చిత్రీకరించారు. తాజాగా అందుతున్న సమాచారం ప్రకారం హిమాలయాల్లో సినిమాకు సంబంధించిన షూటింగ్ జరుగుతుందట. అక్కడ అఘోరాలపై కీలక సన్నివేశాలను షూట్ చేస్తున్నారు. బాలయ్య అఘోరాగా కనిపించే గెటప్‌తో షూటింగ్ చేస్తున్నారు. మరో మూడు లేదా నాలుగు రోజుల్లో అక్కడ షూటింగ్‌ను బోయపాటి అండ్ టీం ముగించుకుని వస్తారని యూనిట్ సభ్యుల ద్వారా సమాచారం అందుతోంది. హిమాలయాల్లో షెడ్యూల్ తర్వాత కర్నూలులో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన సెట్‌లో షూటింగ్ జరపనున్నట్లు సమాచారం అందుతోంది. అఖండ 2 సినిమా కోసం బాలకృష్ణ డ్యూయెల్ రోల్‌లో కనిపించబోతున్నాడనే విషయం తెల్సిందే. కర్నూలు షెడ్యూల్ లో బాలకృష్ణ రెగ్యులర్ లుక్‌లో కనిపించబోతున్నారు. వరుసగా నాలుగు విజయాలను సొంతం చేసుకున్న బాలకృష్ణ నుంచి వస్తున్న సినిమా కావడంతో అఖండ 2 పై సహజంగానే అంచనాలు భారీగా ఉంటాయి. కనుక అంచనాలకు ఏమాత్రం తగ్గకుండా బోయపాటి ఈ సినిమాను రూపొందిస్తున్నారు. సనాతన ధర్మ నేపథ్యంలో ఈ సినిమా ఉంటుంది అంటూ ఇండస్ట్రీ వర్గాల వారు అంటున్నారు.

# అందాల ఐశ్వర్యం

తమిళ బ్యూటీ ఐశ్వర్య మీనన్ ఇండస్ట్రీలో అడుగు పెట్టి పదేళ్లు దాటినా అదృష్టం కలిసి రాలేదు. అయితే ఈ పదేళ్ల కాలంలో ఐశ్వర్య మీనన్ చాలానే ప్రయత్నాలు చేసింది. తమిళ్ చిత్రాలతో పాటు మలయాళం, తెలుగు సినిమాల్లోనూ నటించింది. తెలుగులో ఈమె నటించిన స్పై, భజే వాయు వేగమ్ సినిమాలు ప్రేక్షకుల ముందుకు వచ్చాయి. ఆ సినిమాలు బాక్సాఫీస్ వద్ద పెద్దగా ఆకట్టుకోలేకపోయాయి. దాంతో తెలుగులో మళ్లీ ఆఫర్ల కోసం ఈమె వెయిట్ చేయాల్సిన పరిస్థితి నెలకొంది. ప్రస్తుతం మలయాళంలో ఒక సినిమాను చేస్తుంది. అంతే తప్ప ఆమె నుంచి మరే సినిమాలు కూడా ప్రేక్షకుల ముందుకు వచ్చే పరిస్థితి లేదు. చూడ్డానికి చక్కగా ఉండి, ఎంతో మంది స్టార్ హీరోయిన్స్‌తో పోల్చితే అందం విషయంలో, అభినయం విషయంలో ముందు ఉండే ఐశ్వర్య మీనన్ అదృష్టం కలిసి రాకపోవడంతో అంతగా ఆఫర్లు సొంతం చేసుకోలేక పోతుంది. ఆకట్టుకునే అందం ఉన్నా కూడా ఈమెకు ఇప్పటి వరకు బిగ్ కమర్షియల్ హిట్ పడలేదు. కనుక ఇంకా ఆఫర్ల కోసం వెతుక్కోవాల్సిన పరిస్థితి ఉంది. ముందు ముందు అయినా ఈమెకు నటిగా వరుసగా



ఆఫర్లు వస్తాయా అనేది చూడాలి. నటిగా గుర్తింపు దక్కించుకోవడం ప్రయత్నాలు చేస్తున్న ఐశ్వర్య మీనన్ సోషల్ మీడియాలో మాత్రం స్టార్ ఇమేజ్‌ను సొంతం చేసుకుంది. తన అందమైన ఫోటోల కారణంగా రెగ్యులర్‌గా వార్తల్లో నిలుస్తూ ఉంటుంది. ఇన్‌స్టాగ్రామ్‌లో 3.2 మిలియన్‌ల ఫాలోవర్స్‌ను కలిగి ఉన్న ఐశ్వర్య మీనన్ రెగ్యులర్‌గా షేర్ చేసే అందమైన ఫోటోలు, వీడియోల కారణంగా వార్తల్లో నిలుస్తూ ఉంటుంది. తాజాగా మరోసారి అందాల ఐశ్వర్యం అనిపించుకునే విధంగా విభిన్నమైన మోడ్రన్ ఔట్ ఫిట్‌తో ఆకట్టుకుంది. సింపుల్ అండ్ స్వీట్ లుక్‌తో పాటు ఆకట్టుకునే అందం తన సొంతం అన్నట్లుగా ముద్దుగుమ్మ సోషల్ మీడియా ద్వారా మెప్పించింది. ఇంతటి అందగత్తె అయినా అదృష్టం కలిసి రాకపోవడంతో ఆఫర్లు అంతగా రావడం లేదు అంటూ కొందరు కామెంట్ చేస్తున్నారు. ఐశ్వర్య మీనన్ అందంకు తగ్గ ఆఫర్ల కోసం ఆమె మరింత కాలం వెయిట్ చేయాల్సిందే అనే అభిప్రాయం వ్యక్తం అవుతోంది. తెలుగులో ఈమె చేసిన స్పై సినిమాతో పాటు భజే వాయు వేగమ్ సినిమా నిరాశ పరిచింది. కనీసం ఒక్క సినిమా హిట్ అయినా ఈ అందమైన ముద్దుగుమ్మకు టాలీవుడ్‌లో కనీసం మూడు నాలుగు ఆఫర్లు వచ్చి ఉండేవి. కానీ అదృష్టం కలిసి రాక పోవడంతో ఐశ్వర్య మీనన్ ఇంకా ఆఫర్ల కోసం ఎదురు చూడాల్సిన పరిస్థితి. ఈమె అందం చూస్తే మరో పదేళ్ల పాటు ఇండస్ట్రీలో సందడి చేసే అవకాశాలు ఉన్నాయి. ఈ పదేళ్ల కాలంలో అయినా ఐశ్వర్య మీనన్ కి స్టార్ హీరోల సినిమాల్లో నటించే అవకాశాలు రావాలని అభిమానులు కోరుకుంటున్నారు.

# ప్రభాస్ లీక్స్.. ముద్దు పొందిన ఆ అమ్మాయి ఎవరంటే..

పాన్ ఇండియా స్టార్ గా ప్రభాస్ స్థాయి ఏ లెవెల్లో పెరిగిందో ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. మంచి ఫ్రెండ్లీ స్వభావం ఉన్నప్పటికీ అతను ఇంట్రోవర్ట్ అని తెలిసిన విషయమే. ఎక్కడైనా ఇంటర్వ్యూలు, పబ్లిక్ ఈవెంట్స్ అంటే మౌనంగా కనిపించే ప్రభాస్.. తన క్లోజ్ ఫ్రెండ్స్‌తో మాత్రం వేరే లెవెల్ ఫన్నీగా ఉంటాడట. సరదాగా హంగామా చేయడం, తనదైన హాస్యంతో చుట్టుపక్కల వారిని నవ్వించడం ప్రభాస్ స్టైల్. అయితే ప్రస్తుతం మ్ ప్రభాస్ నుంచి కొత్త సినిమా అప్‌డేట్ కోసం ఎదురు చూస్తున్న ఫ్యాన్స్.. ఓ పాత ఫోటోను తెరపైకి తీసుకొచ్చారు. ఇప్పుడు అదే సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఈ ఫోటోలో ప్రభాస్ ఎంతో ముచ్చటగా ఒక అమ్మాయిని బుగ్గపై ముద్దు పెట్టాడు. దీనిని చూసిన ఫ్యాన్స్ షాక్ అవుతూ.. ప్రభాస్ ఎవరిని ఇలా కిస్ చేశాడు? అని చర్చించుకోవడం స్టార్ట్ చేశారు. అసలిది కొత్త ఫోటో కాదని అర్థమయినా, అందులో కనిపిస్తున్న అమ్మాయి ఎవరు అనే దానిపై హాట్ టాపిక్ నడుస్తోంది. ఈ ఫోటో 'బాహుబలి' టైమ్‌లో క్లిక్ అయినట్లు తెలుస్తోంది. ఆ అమ్మాయి తమన్నా క్లోజ్ ఫ్రెండ్, మేకప్ ఆర్టిస్ట్ బిల్లి మానిక్ అని లేటెస్ట్ అప్‌డేట్. ప్రభాస్



ఇంత ఫ్రెండ్లీగా తన టీమ్‌తో ఉంటాడని అంతా గమనిస్తున్నారు. ఇండస్ట్రీలో స్టార్స్ సాధారణంగా మేకప్ ఆర్టిస్టులు, స్టైలింగ్ టీమ్‌తో ఒక లిమిట్ దాటకుండా ఉంటారు. కానీ ప్రభాస్ మాత్రం తన వర్క్ సర్కిల్‌లో అందరికీ ఓ మంచి ఫ్రెండ్‌లా మెలుగుతాడని ఇప్పటి వరకు అందరికీ తెలిసిన విషయం. కాస్త మంచిగా అనిపించినా కూడా భోజనాలతో తన ప్రేమను వ్యక్తం చేస్తాడు. ఇక లేటెస్ట్ గా ఈ పాత ఫోటో వైరల్ కావడంతో 'ఇంత ఫ్రెండ్లీ యాక్టర్ వేరెవరైనా ఉన్నారా?' అంటూ ప్రభాస్ ఫ్యాన్స్ తెగ సెర్చ్ చేస్తున్నారు. మరోవైపు ప్రభాస్ లైనప్ లో ప్రస్తుతం భారీ సినిమాలు ఉన్నాయి. సెట్స్ మీద 'రాజా సాబ్', 'ఫౌజీ' సినిమాలు షూటింగ్ జరుపుకుంటుండగా, 'స్పిరిట్', 'కల్కి 2' ప్రారంభానికి సిద్ధంగా ఉన్నాయి. ప్రభాస్ తర్వాత సలార్ 2 కూడా చేయనున్నాడు. ప్రశాంత్ వర్మతో ఓ పాన్ ఇండియా సినిమా చర్చల్లో ఉండగా, %ఖ+ఖీ% మేకర్స్ తో మరో రెండు సినిమాలకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్టు ప్రచారం జరుగుతోంది. ఆ దర్శకులు ఎవరనేది క్లారిటీ రావాల్సి ఉంది. ఇదిలా ఉంటే, ప్రభాస్ ప్రస్తుతం పూర్తి ఫోకస్ 'రాజా సాబ్' మూవీపై పెట్టాడు. కానీ ఈ సినిమా షూటింగ్ పలుమార్లు వాయిదా పడుతుండడంతో, విడుదల తేదీపై స్పష్టత రాలేదు. మొదటగా ఈ ఏడాది వేసవిలో విడుదల చేయాలని అనుకున్నా, మారిన షెడ్యూల్ వల్ల కొత్త డేట్‌పై ఇంకా అనౌన్స్‌మెంట్ లేదు. త్వరలోనే ప్రభాస్ టీమ్ నుంచి సినిమాల అప్డేట్స్ రానున్నట్లు తెలుస్తోంది.

PRINTED, PUBLISHED AND OWNED BY MOHAMMED IMRAN, PRINTED AT RIMSHA PRINTERS & WEB OFFSET PRINTING PRESS, Alugunur (V), Timmapur(M),DIST. KARIMNAGAR. TELANGANA.
PUBLISHED FROM H.NO. 10-2-324/B, VIDHYANAGAR, KARIMNAGAR - 505001. EDITOR : MOHAMMED IMRAN, RNI. NO. TELTEL/2006/16536